అక్టోబర్ 2021

అరుణతార

సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక
సంపుటి: 49 సంచిక: 7 385 పేజీలు 52 రూ. 20/-

సీతాకోక చిలుకలతో
చెలిమి నేరమవ్వని చోటు కోసం
కలలపై కత్తివేటు పడని కాలం కోసం...

VIJAYAWADA H.O.
27 10 21

వసంతగానం

ఐదు దశాబ్దాల విప్లవ సాహిత్య సిద్ధాంతం -1



ఈ యాభై ఏళ్ల విప్లవ సాహిత్య విమర్శ లిఖిత రూపంలో ఎంత ఉన్నదో అంతకంటే అనేక రెట్లు ఎక్కువ మౌఖిక రూపంలో సాగింది. బహిరంగ వేదికలపై సాహిత్య విమర్శను వినిపించే సంప్రదాయాన్ని విరసం తీసుకొచ్చింది. విమర్శలోకి మౌఖిక సంప్రదాయాన్ని తేవడమే కాదు, ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలోనే తొలిసారి మౌఖిక కళా సాహిత్యాలపై విమర్శను విప్లవ సాహిత్య విమర్శ తీసుకొచ్చింది. బ్రాహ్మణీయ భూస్వామ్య భావజాలాన్ని, రివిజనిజాన్ని, బూర్జువా భావాలను, యథాతథ, క్షుద్ర ధోరణులను, శుష్క కళా వాదనలను, రకరకాల ముసుగు విన్యాసాలను ఎండగడుతూ, పునర్మూల్యాంకనం చేసుకుంటూ విప్లవ సాహిత్య విమర్శ తన భావజాల ప్రపంచాన్ని విస్తరింపజేసుకుంటోంది.

కోర్టు వాదనల్లో, ప్రకటనల్లో సాహిత్య విమర్శ వినిపించే పద్ధతి కూడా విప్లవ సాహిత్యోద్యమమే తీసుకొచ్చింది. తత్వశాస్త్రం, రాజకీయార్థిక శాస్త్రం, చరిత్ర వంటి వివిధ సామాజిక శాస్త్ర పద్ధతులను సాహిత్యానికి అన్వయించే పద్ధతిని విప్లవ సాహిత్య విమర్శే ప్రవేశ పెట్టింది.

మలుపు ప్రచురణ, వెల : రూ. 300/-

తంగేడుపూల పాట



సాహిత్యం సమాజానికి దర్పణం లాంటిది. కళ్లముందుటి కాలాన్ని కలంలోకి ఒంపి సృజనాత్మకంగా పాఠకుడి చేర్చుతుంటాడు రచయిత. ప్రజల పక్షాన నిలబడ్డ అలాంటి రచయిత రాసే ప్రతి అక్షరం, సమాజంలోని సంఘర్షణను ప్రతిబింబిస్తుంది. తంగేడుపూల పాట అలాంటి సంఘర్షణకు అక్షర రూపం. కారు చీకట్లను గేలిచేస్తూ కాలం ఆలపించే పాట ఇది. నిండైన విశ్వాసాన్ని రేపటికి అందించే రాగమిది. అది అమరత్వాన్ని గుండెల్లో నింపుకొని, చరిత్రను తనలో నిక్షిప్తం చేసుకున్న పాట. అంతరాల సమాజాన్ని అసహ్యించుకునే పాట. అట్టడుగు వర్గాల గుండె గొంతుక ఈ పాట.

వెల : రూ. 80/-

KLVA101M197

అరుణతార
సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక
సంపుటి : 49 ◆ సంచిక : 7 ◆ అక్టోబర్ 2021 ◆ వెల : రు. 20/-

రివేరా

అస్సాంలో ముస్లింలకు చోటు లేదా?

జార్జ్ ఫ్లాయిడ్ ముఖాన్ని రోడ్డుపై తొక్కిపెట్టి మోకాలితో పొత్తుతున్న పోలీసు అధికారి గుర్తున్నాడా? బ్రీత్...బ్రీత్..బ్రీత్ అంటూ ఫ్లాయిడ్ నుంచి వచ్చిన చివరి మూల్గులు వినిపిస్తున్నాయా? ఓ నల్లజాతీయుని మానవ మర్యాదను బూట్లకింద నులిమివేసిన అమెరికాది శ్వేత జాత్యహంకారం.

మరి మృతదేహానికి దక్కాల్సిన కనీస గౌరవాన్ని కూడా అస్సాంలో కాలరాయడాన్ని ఏమనాలి? అస్సాంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో తూటా తగిన ఓ ముస్లిం ఆందోళనకారుడు కిందపడిపోయాడు. పోలీసుల వెంట ఉన్న ప్రభుత్వ వీడియోగ్రాఫర్ కెమెరాల సాక్షిగా ఆ ఆందోళనకారుడి మృతదేహం పైకి బూటుకాళ్లతో ఎగిరి దూకాడు. ఒకసారి కాదు... పదేపదే దూకాడు. అలా దూకుతూ మృతదేహాన్ని కాళ్లతో తన్నాడు. కిందపడిఉన్న కర్ర అందుకుని పెటీపెటీమని కొట్టాడు. బంగ్లాదేశ్ నుంచి తమ తాతల కాలంలో అస్సాం వచ్చి స్థిరపడిపోయిన అస్సామీ ముస్లిందీ ఆ మృతదేహం. ముస్లిములకు అస్సాంలో జీవించే హక్కు లేదని బీజేపీ ప్రభుత్వం ఇప్పటికే తేల్చేసింది. కానీ. కాల్చిచంపిన తర్వాత కూడా ముస్లిముల మృతదేహాలను అవమానించడం ఏ జాత్యహంకారానికీ తీసిపోని చర్య. ఫాసిస్టులు మాత్రమే వొడిగట్టే వికృత చేష్ట.

అమెరికాలో పోయిన ట్రంప్ ప్రభుత్వం మెక్సికో శరణార్థులను, వలస కార్మికులను ఎలా మెడపట్టి గెంటేసిందో చూశాం. మెక్సికో వనరులన్నీ అమెరికా దోచేసింది. తనపై ఆధారపడక తప్పనిస్థితిని అక్కడి ఆర్థికవ్యవస్థకు కల్పించింది. ఆపై అక్రమంగా మెక్సికన్లు తరలివస్తున్నారంటూ అడ్డుగా గోడ కట్టిన తెంపరితనం ట్రంప్ ప్రభుత్వంలో ఆనాడు చూశాం.

అస్సాంలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఏమీ లేవని ఆరేళ్లుగా అక్కడి పరిణామాలు హెచ్చరిస్తూనే ఉన్నాయి. అస్సామీ ముస్లిములతో బీజేపీ ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తోందనేది సీఏఏ, ఎన్ఆర్‌సీ వంటి సందర్భాల్లో యావత్తూ దేశం చూసింది. తన సొంత కారణాలతో ఈ ప్రక్రియకు తాత్కాలికంగా విరామమిచ్చినా... అస్సామీ ముస్లిములను 'వదిలించుకోవడానికి' వేయని ఎత్తూ, చేయని ప్రయత్నమూ ఇప్పటికీ లేదు. ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి తొలగించే మిషపై ఈసారి పెద్దఎత్తున ముస్లిములను టార్గెట్ చేశారు. అందులో భాగంగానే దరాంగ్ జిల్లా సిపారూర్ గ్రామంలో ఈ నెల 4వ తేదీన (2021 సెప్టెంబరు) పోలీసులు కాల్పులు జరిపి ఇద్దరిని చంపివేశారు. పోలీసుల నివేదికల ప్రకారం కనీసం 20 మంది ఈ ఘటనలో గాయపడ్డారు. గాయపడినవారిలో కొందరు పోలీసులు కూడా ఉన్నారు.

సిపారూర్ గ్రామంలో అస్సాం ముస్లిముల ఇళ్లు 800 ఉన్నాయి. ప్రభుత్వ భూముల్లో ఉన్న ఈ ఇళ్లను ఖాళీ చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, ఇందుకోసం పోలీసు కాల్పుల వరకు వెళ్లేంత ఆందోళనకర పరిస్థితులు లేవనేది వీడియో దృశ్యాలను చూస్తే తెలిసిపోతుంది. తాము తరతరాలుగా ఉంటున్న భూములను వదులుకోవడానికి ముస్లిములు సిద్ధమయ్యారు. కాకపోతే తమ పునరావాసానికి ప్రభుత్వం నుంచి హామీని వారు కోరుతున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి భరోసా రాకపోవడంతో భూములను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించిన అధికారులను ఆందోళనకారులు అడ్డుకున్నారు. ఇళ్లలోంచి సామానును బయటకు తెచ్చుకునే వ్యవధిని కూడా తమకు ఇవ్వకుండా కూల్చివేతలకు తెగబడటంపై కొందరు ముస్లిములు ఆగ్రహించారు. ఆ సమయంలో ఆందోళనకారులవద్ద పదునైన ఆయుధాలు ఉన్నాయని దరాంగ్ ఎస్పీ, సీఎం హిమంత బిశ్వాస్ శర్మ సోదరుడు సుహంత బిశ్వాస్ శర్మ ప్రకటించారు.

కానీ, వ్యవసాయం చేసుకునేవారి దగ్గర ఏమి ఆయుధాలు ఉంటాయి? చేతికి దొరికిన కర్రలు, కొడవళ్లతో ఆందోళనకారులు తిరగబడ్డారు. అక్కడకు చేరుకున్న సాయుధ పోలీసులు రావడం రావడమే కాల్పులకు తెగబడ్డారు. ముందస్తు

(మిగిలాది 6వ పేజీలో...)

ఎడిటర్
అరసవిల్లి కృష్ణ

వర్కింగ్ ఎడిటర్
పి. వరలక్ష్మి

రచనలు పంపించాల్సిన చిరునామ:
5-1820, గీతాశ్రమం వీధి,
ప్రొద్దుటూరు-516360.

* email : arunatara1977@gmail.com

Like Page:
//viplava rachayitala sangahm arunatara

facebook:
//viplava rachayitala sangahm virasam

Virasam website :
www. vasanthamegham.com

చందాలు, విరాళాలు పంపవలసిన చిరునామా
అరసవిల్లి కృష్ణ, 6-1/16-7ఎ/1, పెద్దిరాజు స్ట్రీట్, ప్రైజర్‌పేట, విజయవాడ-520001.
చెక్‌లు / డ్రాఫ్టులు / ఆన్‌లైన్‌లో పంపడానికి
A. Krishna, Bank : State Bank of India, A/c. No. 52018355595, IFSC : SBIN0020714,
Branch : Vagu Center, Vijaywada.

అరుణతార చదవండి!
చదివించండి!
చందాదారులు కండి!

విడి సంచిక వెల - రు. 20; సంవత్సర చందా - రు. 240;
రెండు సంవత్సరాల చందా - రు. 450; మూడు సంవత్సరాల చందా - రు. 680;
ఐదు సంవత్సరాల చందా - రు. 1100; దశాబ్ది చందా - రు. 2200/-

వసంతమేఘం
సాహిత్య, రాజకీయార్థిక పక్షపత్రిక

వసంతమేఘం అంతర్జాల పక్ష పత్రిక చదవండి. గతంలో విరసం.ఆర్గ్‌లాగే వసంతమేఘాన్నీ ప్రోత్సహించండి. రచనలు పంపించండి. మీ రచనలతో, విమర్శలతో, సూచనలతోనే వసంతమేఘం విప్లవ, ప్రజా సాహిత్య సాంస్కృతికోద్యమంలో తన కర్తవ్యాలను నెరవేర్చగలుగుతుంది. - **వసంతమేఘం టీం**

ఈ సంచికలో

సంపాదకీయం (3)

అస్సాంలో ముస్లింలకు చోటు లేదా?

కథలు

టూల్ కిట్- జి. ఉమామహేశ్వర్ (7-11)

వందన కథ- ఎంకె కుమార్ (17-20)

నివాళి(12-16)

అద్భుత మానవి కామేశ్వరి- భాగ్య

వ్యాసాలు

లాల్ నీల్ ఐక్యత

అవకాశాలు-అవరోధాలు-పాణి(21-27)

కవిత్వం (28-32)

సుఖవేదన-మహమూద్

జిఎన్ సాయిబాబా కవితలు రెండు

ఈ రోజు గడిచిపోతుంది..

నిషిద్ధాంశాల ప్రపంచం నుంచి

మరొకసారి-కెక్యూబ్ వర్మ

ఆర్. శశికళ కవితలు రెండు

ఢిల్లీ సరిహద్దుల్లో

అనంతయానం

ఇంటర్వ్యూ (33-37)

పోలిక, పోటీ తగదు-అల్లం రాజయ్య

సాహిత్య వ్యాసం(38-39)

సాహిత్య చరిత్రలో ముస్లింవాద సాహిత్యం

అరసవిల్లి కృష్ణ

పుస్తక సమీక్ష(40)

సీమ-బహుజన అస్తిత్వ కవితాపతాక

మహమూద్

నివేదిక(41-42)

గ్లోబల్ హిందుత్వను కూల్చివేద్దాం

(సెప్టెంబర్ 10-12 తేదీల మధ్య అమెరికాలో జరిగిన మహాసభ సంక్షిప్త నివేదిక)

కమలా భాసిన్ మాటలు, కవితలు(43-44)

ప్రకటనలు(45-48)

కా. కోటీకి మరో పీటీ వారంట్

కామ్రేడ్ గొంజాలోకు జోహార్లు

కామ్రేడ్ జీతన్ మరాండీకి జోహార్లు

లేఖ(49-50)

శిరోమణి వ్యాసంపై నా అభ్యంతరాలు!- కాంతి నల్లూరి

వసంతమేఘం అంతర్జాల పత్రికలో..

సెప్టెంబర్ 15 , 2021 సంచిక

సంపాదకీయం: కా. గొంజాలోకు జోహార్లు - విరసం

ఓపెన్ పేజీ: వాళ్లు తాలిబాన్లకంటే భిన్నంగా ఉన్నారా? - రామ్ పునియాని

సంభాషణ: సాహసోపేతంగా పురోగమించండి- గొంజలో ప్రసంగం

సంభాషణ: మరణానంతర ప్రేమ లేఖ - ఓ అభిమాని

సంభాషణ: ఛైర్మన్ గొంజలో వర్ధిల్లాలి, అతని శక్తివంతమైన, ప్రభావశాలియైన ఆలోచనా విధానం వర్ధిల్లాలి! - పెరూ కమ్యూనిస్ట్ పార్టీ

కాలమ్స్ :

సమకాలీనం: అమెరికా నిష్క్రమణ దేనికి సంకేతం? - సతీష్ బైరెడ్డి

ఆర్థికం: అవినీతి, దోపిడీలను పెంచే క్రోనీ క్యాపిటలిజం- ఎ. నరసింహారెడ్డి

లోచూపు: పితృస్వామ్యంపై ఫేస్ ఆఫ్ 'స్టోమా' - మెట్టు రవీందర్

క్లాసిక్స్ పరిచయం: కుటుంబం-సొంత ఆస్తి-రాజ్యాంగయంత్రం 3- వెంకటరావు

కవి నడిచిన దారి: ఒక్కడుగు - శ్రీరాం పుప్పాల

వ్యాసం

కార్పోరేట్లకు ప్రజల ఆస్తులు - అరుణ్

రాజును చంపడం ఎందుకు తప్పు? - పి. వరలక్ష్మి

కథ: పోలీసు దాడి - సాహు

కవిత్వం

బాల్యమే సరికొత్త ప్రపంచం- ఆర్. శశికళ

విలక్షణ యుద్ధంలోకి..!! - ఇక్బాల్

ఈ బుక్స్ : జగిత్యాల జంగల్ మహల్ - విరసం ప్రచురణ

మీరీ పుస్తకం చదివారా?: భారత దేశంలో ఉత్పత్తి సంబంధాలు - విరసం ప్రచురణ

అక్టోబర్ 1, 2021 సంచిక

సంపాదకీయం: జీతన్ మరాండీకి జోహార్లు - విరసం

కాలమ్స్ :

కవిత్వంలోకి: నిషేధాల మధ్య ఆవిర్భవించిన కవి- కెక్యూబ్

ఆర్థికం: ఇండో- పసిఫిక్ లో ఆకస్ చిచ్చు - ఎ. నరసింహారెడ్డి

కొత్త కవిత్వం: తూర్పు ముఖం - అరసవిల్లి కృష్ణ

లోచూపు: ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో విరసం - మెట్టు రవీందర్

కవి నడిచిన దారి: నిర్వాసిత వాక్యం - నరేష్కుమార్ సూఫీ

కథ..కథయ్యిందా! : అధివాస్తవికతను ఎంచుకొని వాస్తవికతను చెప్పిన కథ- జి. వెంకటకృష్ణ

క్లాసిక్స్ పరిచయం: కుటుంబం-సొంత ఆస్తి-రాజ్యాంగయంత్రం- 4 - వెంకటరావు

ఓపెన్ పేజీ:

ఆఫ్ఘనిస్తాన్‌ను ఎలా అర్థం చేసుకోవాలి?- అంకాళ్ళ పృథ్వి రాజ్

వ్యాసాలు :

సంక్షేమ హాస్టళ్ళు, గురుకులాల భవితవ్యం? - కె. ఆనంద్

వివాదాస్పద వ్యక్తిత్వం - పాణి

పంజరంతో పక్షి యుద్ధం పాలస్తీనా మహిళల కవిత్వం - ఉదయమిత్ర

సంభాషణ :

రాంచీ బిర్సాముండా కేంద్రకారాగారం నుంచి సాంస్కృతిక కళాకారుడు జీతన్ మరాండీ విజ్ఞప్తి! - జీతన్ మరాండీ (పునర్ముద్రణ)

రాజ్యం ఆ 'సంథాలీ సిరింగ్' గొంతు నులమకుండా ఆపాల్సింది మనమే - అమృత(పునర్ముద్రణ)

కవిత్వం :

- పాడె పై ప్రజాస్వామ్యం - గిరి ప్రసాద్ చెలమల్లు

అడవి నేను - వడ్డెబోయిన శ్రీనివాస్

పత్రికా ప్రకటన :

కమ్యూనిస్ట్ వ్యతిరేక "పవిత్ర విచారణ"ను తిరస్కరించండి! - గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు-లెనినిస్టు)

(3వ పేజీ తరువాత...)

హెచ్చరికలు లేవు. అదుపు తప్పుతుందనుకొంటే లాఠీచార్జి, బాష్పవాయు ప్రయోగం వంటివి జరిపి గుంపులను చెదరగొట్టాలి. కానీ, పోలీసులు నేరుగా కాల్పులు జరిపారు. మోకాలి కిందిభాగంలో కాల్చాలనే మాన్యువల్‌ను కూడా పక్కనపడేసి... నేరుగా తూటాలను ఛాతికి గురిపెట్టి కాల్చారు. పోలీసులు చంపేసిన ఇద్దరిలో సద్దాం హుస్సేన్‌కు అదేరోజు రేషన్‌కార్డు చేతికి వచ్చింది. రెండో మృతదేహం షేక్ ఫరీద్ (10)ది.

అనంతరం ఎస్పీ బిశ్వాస్ శర్మ విజయగర్వంతో ప్రకటన విడుదల చేశాడు. 800 కుటుంబాలు ఆక్రమించిన 600కుపైగా హెక్టార్ల భూమిని తిరిగి ప్రభుత్వ స్వాధీనం చేసినట్టు ప్రకటించాడు. అయితే, స్వాధీనం చేసుకున్న ఈ భూములను ఏం చేస్తారు? ఈ ప్రశ్నకు జవాబు దొరికితే 'ఆక్రమణల తొలగింపు' అసలు ఉద్దేశ్యం బయటపడుతుంది. ఇలా సేకరించే భూములను అస్సాం మూలవాసులకు పంచుతామని రెండోసారి అధికారంలోకి వస్తూనే... బీజేపీ ప్రకటించింది. ఎవరి మూలవాసులు? ఈశాన్య రాజ్యాల చరిత్ర, అస్సాం సామాజిక, రాజకీయ ఉద్యమ గతం మనకు సూచించినట్టు... సరిహద్దులకు అనుకుని ఉండే ఆదిమ తెగలను మూలవాసులుగా బీజేపీ గుర్తించదు. వారి దృష్టిలో మూలవాసులంటే అస్సాంలోకి వలసలు వచ్చిన బెంగాలీ హిందువులు.

తేతోటల సుక్షేత్రం, చేసుకోవడానికి ఏడాదంతా పని దొరికే అస్సాం నేలకు ఎవరు వలస రాలేదని? ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్రవాసులు మొదలు ఒడిసా, బిహారీ, యూపీకూలీల వరకు ఎన్ని ప్రాంతాల నుంచి అస్సాంకు వలసలు సాగలేదు? అలా చూసినా... అస్సాంలో బెంగాలీ హిందువులదే అతి విస్తారమైన వలసల చరిత్ర. మొత్తం ఈశాన్యంలో వీరే బీజేపీకి రాజకీయ బలం. ఈ బలం చూసుకునే గత ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లో గెలిచేసినంతగా బీజేపీ నేతలు హడావుడి చేశారు.

ముస్లిం ప్రాబల్య దరాంగ్ జిల్లాలో సామాజిక సంక్షోభం తెచ్చేందుకు చాన్నాళ్లుగానే బీజేపీ కుట్రలు చేస్తోంది. బెంగాలీ హిందువులకు వేలాది ఎకరాల భూములను కట్టబెట్టే కార్యక్రమానికి స్వయంగా ముఖ్యమంత్రి హిమంత బిశ్వాస్ శర్మ నాయకత్వం వహిస్తున్నాడు. కరోనాకు ముందు సీఏఏ, ఎన్ఆర్సీ ప్రక్రియ మొదలుపెట్టిందే అస్సామీ ముస్లిములను గెంటేయడానికే అని అందరికీ తెలిసిందే. అయితే దేశం నుంచి గెంటేయాలి.. లేదంటే తాత్కాలిక కారాగారాల్లో సుదీర్ఘకాలం బంధించాలనే హిందుత్వ ఎజెండాను అస్సాంలో బీజేపీ అమలుచేయాలని తహతహలాడింది.

కానీ, 'అక్రమ వలసల' జాబితాలో మూడొంతులు బెంగాలీ హిందువుల పేర్లే నమోదయ్యాయి. ఈ ప్రక్రియను ఇంకా ముందుకు తీసుకెళితే... మొదటికే మోసం వస్తుందని ప్రభుత్వం తెలుసుకుంది. అర్థాంతరంగా ఈ కార్యక్రమాన్ని నిలిచివేసింది. నిజానికి, పేదలంటే 'ఆక్రమణదారుల'ని, ముస్లిములంటే 'చొరబాటుదారుల'ని ముద్రవేసి, తేలిగ్గా ఒప్పించేయొచ్చు. సరిహద్దుల్లో జరిగే 'ఎన్‌కౌంటర్ల'ను ఊళ్ల మధ్యకు మోసుకురావచ్చు. ఈ సానుకూలత సమాజంలో దొరుకుతున్నంత కాలమూ ఫాసిస్టు పాలకవర్గం నరమేధాలకు తెగబడుతూనే ఉంటుంది. 'అస్సాం కాల్పులు' నేర్పే పాఠం ఇదే! ☆

టూల్ కిట్

జి. ఉమామహేశ్వర్

"పాల్ స్వామి చనిపోయారు రామ్" చాలా ఆప్తుణ్ణి కోల్పోయినట్టు బాధగా చెప్పింది ఫోన్లో అవతలనుండి దేవి "పాల్ స్వామా, ఆయనెవరు? అయినా ఆరుగంటలకి వస్తానన్నదానివి రాకపోగా, ఫోన్ చేస్తే తీయకపోగా ఇప్పుడు ఫోన్ చేసి ఎవరో పాల్ స్వామి చనిపోయారని చెబుతావా" కొంచెం కోపాన్ని కనబరుస్తూ అన్నాడు రామ్.

"పాల్ స్వామి తెలియదా? నీకు గుర్తుందా, పోయినేడాది ఒక ఎనభయ్యేళ్ళ పెద్దాయనని రాజద్రోహం కేసులో అరెస్ట్ చేసారని మేము ధర్నా చేశాము, నువ్వే కరపత్రాలు, ప్రెస్ నోట్లు డిజైన్ చేసి ఇచ్చావు... గుర్తొచ్చిందా ? మెదడుని నీ సైబర్ టెక్నాలజీ కెరీర్ కి అప్పగించినా, మనసుని కొంచెం మనుషుల కోసం కేటాయించు.." మురిపెంగా దండించింది దేవి.

సరే, ఆయన ఎక్కడో చనిపోతే, ఇక్కడ నీకేంటి పని ?

"స్వామి గారు చనిపోలేదు రామ్, చంపేశారు. పాపం, ముసలాయన వృద్ధాప్య వ్యాధులతో బాధపడుతుంటే కనీస ఆరోగ్య వసతి కూడా కల్పించకుండా, ఆయనను చంపేశారు" కొంచెం ఆవేశం, దిగులు కలగలసిన స్వరంతో చెప్పింది దేవి.

"ముసలాయన పోతే ఇంత బాధపడాలా? ఎనభై ఏళ్ల మనిషి ఇంకెంత కాలం బతుకుతాడు"

"ఎంతకాలం బతుకుతాడు అన్నది ప్రశ్నకాదు, బతికినన్ని నాళ్ళు మనిషిగా, ఒక పౌరుడిగా తన స్వేచ్ఛని అనుభవించేలా బతకనిచ్చామా లేదా అన్నదే ప్రశ్న. చివరి రోజుల్లో నడవలేక, ఒక చేతి కర్ర ఆసరాగా కావాలని అడిగితే తిరస్కరించేంత దుర్మార్గంగా, క్రూరంగా వ్యవస్థలు ఉండొచ్చా?"

"ఓకే, ఓకే, అర్థమయ్యింది, ఈ రోజు రావడానికి కుదరడం లేదు, అంతే కదా"

"అంతే కాదు, ఇంకొంచెం కూడా ఉంది. రేపు ఉదయం ప్రెస్ మీట్ ఉంది, కొంచెం ప్రిపేర్ అవాలి. సోషల్ మీడియా ద్వారా ఈ విషయాలను వీలైనంత ఎక్కువ మందికి తెలియపరచాలి. ఇంకా ఏమేం చేయాలో ఆలోచిస్తున్నాము. రాత్రి ఒక టూల్ కిట్ మెయిల్ చేస్తాను, కంటెంట్ కొంచెం ఫైన్ ట్యూన్ చేసి ఇవ్వాలి" అన్నది దేవి.

"సరే, ఈ కాఫీ బిల్లు నీ అకౌంట్‌లో వేస్తున్నాను, బై" అంటూ సంభాషణ ముగించాడు రామ్.

నీరసంగా లేచి కౌంటర్‌లో బిల్లు కట్టేసి బయటకొచ్చాడు. ఇదేదో ముందే చెప్పి వుంటే, ఎవరైనా ఫ్రెండ్‌తో కలిసి బయటకెళ్ళేవాడు. ఇప్పుడు ఎవరిని పిలిచినా ఈ ట్రాఫిక్‌లో రావడానికి గంటపైనే పడుతుంది. ఏం చేయడం? ఈ పిల్లతో పెట్టుకుంటే ఇంతే! ఇదేమీ మొదటిసారి కాదు. ప్రతిసారీ కోపమొస్తుంది, కానీ తాను చెప్పే కారణాలు చూస్తే ఏమీ అనబుద్ధి కాదు. ఉదయం తనే ఫోన్ చేసి, చాలా కాలమైంది మనం కలిసి, సాయంత్రం కాఫీకొస్తావా? అనడిగింది. తనతో మాటలు చెప్పుకుంటూ (చెప్పుకుంటూ ఎక్కడ, వింటూ) కూర్చోడం బాగుంటుంది. కొత్త విషయాలు తెలుస్తుంటాయి, కొత్త ఆలోచనా విధానాలు బోధపడుతూ ఉంటాయి.

అసలు ఆమె పరిచేయమే వింతగా జరిగింది. ఇంజనీరింగ్ ముగించి, రెండేళ్ళ ఉద్యోగం తర్వాత, ఏదైనా స్పెషలైజేషన్ చేస్తే బాగుంటుందని నల్సర్‌లో సైబర్ సెక్యూరిటీ కోర్సులో చేరాడు.

అప్పటికామె అక్కడే బీఎల్ పూర్తి చేసి మాస్టర్స్ చేస్తోంది. కాలేజీలో వారం వారం జరిగే లీగల్ డిబేట్‌లలో, చాలా విషయపరిజ్ఞానంతో లాజికల్‌గా ఆమె మాట్లాడే తీరు ఆకర్షణీయంగా ఉండేది. ఏదైనా విషయాన్ని వివరించాల్సి వచ్చినప్పుడు తల్లి పిల్లలతో మాట్లాడినట్టు, ఆరవ తరగతి పిల్లలకు సోషల్ టీచర్ పాఠం చెప్పినట్టు ఎంతో వినసొంపుగా ఉండేది. బాలగోపాల్, కన్నాభిరాన్‌ల పేర్లు మొదటి సారి విన్నది ఆమె దగ్గరే!

అంతకు ముందు, డిబేట్లలో, కాంటీన్‌లో, వాకింగ్‌లో ముఖపరిచయం ఉన్నా, ఒకరోజు 'న్యాయ వ్యవహారాలలో సాంకేతిక పరిజ్ఞానపు పాత్ర' మీద జరిగిన చర్చలో ఆ పరిచయం మరింత పెరిగింది. కాలేజీ ఏర్పాటుచేసిన ఒక అంతర్జాతీయ కాన్ఫరెన్స్ నిర్వహణలో ఇద్దరూ చురుకైన పాత్ర పోషించారు. ఆమె సబ్జెక్ట్ మీద దృష్టి పెడితే, అతను కంప్యూటర్ మీద అందమైన ఆహ్వానాలు, బ్యానర్లు, సర్టిఫికెట్లు డిజైన్ చేసి ఇచ్చేవాడు. శ్రీరామ్ తన కోర్సు పూర్తయిన తరువాత హ్యాకింగ్‌లో సర్టిఫికేషన్ చేసి సైబర్ సెక్యూరిటీ నిపుణుడిగా స్థిరపడ్డాడు. ఒకరోజు ఆఫీస్ పనిమీద ఢిల్లీ వెళుతుంటే ట్రైన్‌లో కలిసింది దేవి. వాళ్ళ నాన్నగారి ఉద్యోగరీత్యా కుటుంబం చండీఘర్లో ఉందని, మరుసటి వారంలో అక్క ఎంగేజ్మెంట్ ఉందని అందుకే ఆ ప్రయాణమని చెప్పింది. ఇరవై గంటల ప్రయాణంలో చాలా విషయ వినిమయం జరిగింది. తాను హైకోర్టులో ఒక సీనియర్ దగ్గర చేరింది. సంపాదన కోసం కొన్ని గంటలు కేటాయిస్తూ మిగిలిన సమయాన్ని ఆమె సీనియర్లతో కలిసి ప్రారంభించిన ఒక ఎన్జీవో కోసం వెచ్చిస్తున్నానని చెప్పింది.

ఆ తరువాత ఎప్పుడన్నా ఫోన్ చేసుకుని ఇలా కలుసుకోవడం.. అంతే..

ఇప్పుడేం చేయడం? చేయడానికేమీ లేదు, ఛలో రూమ్ అనుకుని బండి స్టార్ట్ చేసి ఇంటి దారి పట్టాడు రామ్.

* * *

భోంచేసుకుని ఇంటికొచ్చేపాటికి తొమ్మిదయింది. ఆఫీస్ పని కూడా ఏమీ లేదు. మొబైలు తీసి మెసేజీలు చూస్తుంటే ఆశ్చర్యంగా ఇంజనీరింగ్ ఫ్రెండ్స్ బ్యాచ్‌లో, హైస్కూల్ బ్యాచ్‌లో కూడా పాల్ స్వామి మరణం గురించి మెసేజీలు పెట్టారు. ఏ గ్రూప్‌లో చూసినా ఒకటి అర వివరాలు రిప్ మెసేజీలతో పాటు కనిపిస్తున్నాయి. వివరంగా ఉన్న ఒక మెసేజి తెరచాడు "ఎనభయ్యేళ్ళ పాల్ స్వామి రాయలసీమ జీవితాన్ని యథాతథంగా చిత్రించడం దగ్గర ఆగిపోకుండా, ఆ జీవితం అలా వుండడానికి కారణమైన ఆర్థిక, భౌతిక, సామాజిక, రాజకీయ శక్తుల్ని దృశ్యమానం చేయడానికి ప్రయత్నించడం వల్ల మాత్రమే అది సాధ్యమైంది. కేరళలోని ఒక మారుమూల గ్రామంలో జన్మించాడు. పేదరికం, వెనుకబాటుతనాలను ధైర్యంగా ఎదుర్కొన్నాడు. దగ్గరలో ఉన్న పట్టణంలో కాలేజీ విద్య పూర్తిచేశాడు. యూనివర్సిటీలో ఉపన్యాసకుడిగా ఉద్యోగం చేస్తున్నా, చుట్టూ ఉన్న వాతావరణం అతన్ని స్థిరంగా ఉండనీయలేదు. ప్రభుత్వాలు అటవీ చట్టాల అమలులో కనబరుస్తున్న నిర్లక్ష్య వైఖరి, ఏజెన్సీ ప్రాంతాలలో, ఆదివాసీల ఇబ్బందులు, కనీస అవసరాలు కూడా తీర్చని నాయకులు, ఎవరైనా గట్టిగా మాట్లాడితే, వాళ్ళని నిర్బంధించి భయభ్రాంతులను చేసే అధికారులు ఆయనను కలవరపరిచారు. ఏదో కేసులో నిందితులుగా జైలుకెళ్ళి వాళ్ళ కేసులు విచారణకు రాక సంవత్సరాల కొద్దీ జైళ్లలోనే మగ్గుతున్న వేలాది నిరపరాధుల కుటుంబాలు అతన్ని ప్రశ్నించే గొంతుకను చేశాయి, పోరాడే ఆయుధాన్ని చేశాయి. అడవి బిడ్డల ఆక్రందనల్ని పట్టించుకునేందుకు ఆయన తన జీవితమంతా యుద్ధం చేశాడు. యాభయ్యేళ్ళ ఉద్యమ ప్రస్థానంలో ఎన్నోసార్లు జైలుకెళ్లాడు, పోలీసు దెబ్బలు తిన్నాడు. కేరళ మొదలుకుని, ఆంధ్ర, తెలంగాణ, ఒరిస్సా, బీహార్, ఝార్ఖండ్ , ఛత్తీస్‌ఘడ్.. ప్రతీచోట అడవిబిడ్డల తండ్రిగా మారిన పాల్ స్వామిని పోయిన సంవత్సరం రాజద్రోహ నేరం కింద అరెస్ట్ చేసి జైలులో నిర్బంధించారు. అతని బెయిల్ పిటీషన్‌ను నిరాకరించారు. వయోధికుడైన పాల్ స్వామి ఆరోగ్యం క్రమక్రమంగా క్షీణించి చివరికి ఈ రోజు జైల్లోనే తుది శ్వాస విడిచారు."

చదవడం పూర్తి చేసి ఒక్క క్షణం కళ్ళు మూసుకున్నాడు శ్రీరామ్. పాల్ స్వామి జీవితమంతా మనోనేత్రాల ముందు కదలాడింది. కొందరికి ఎందుకలా జీవించాలనిపిస్తుంది? ఆశ కంటే ఆశయం గొప్పదని, జీవితాలను సైతం ఫణంగా పెట్టవచ్చని ఏ విశ్వాసం వాళ్ళకు ధైర్యాన్ని, త్యాగాన్ని నూరిపోస్తుంది ? ఇరవై ఎనిమిదేళ్లు వచ్చాయి, ఇంకెప్పుడు పెళ్లి చేసుకుంటావ్ అని ఇంట్లో తనను తొందర పెడుతుంటారే? ఈ మధ్య తరగతి భద్రజీవితానికి, ప్రాణాలను తృణప్రాయంగా భావించేవాళ్ళ జీవితానికి ఎంత తేడా !!

ఆలోచనల నుండి తప్పించుకునేందుకు టీవీ ఆన్ చేశాడు. ఛానల్స్ తిప్పుతుంటే, అన్నిట్లోనూ ఇదే వార్త, దీని చుట్టూ చర్చలు. ఒక చోట ఆపాడు - చర్చ నడుస్తోంది. టీవీ స్క్రీన్ ఒక సగంలో పాల్ స్వామి జీవితానికి సంబంధించిన ఛాయాచిత్రాలను, పార్థివశరీరాన్ని, సందర్శకులను వేరొక సగంలో వేడి వాడి సంభాషణలు, సంవాదాలు చూపుతున్నారు. ఒకతను అంటున్నాడు.

"ప్రతి చిన్నవిషయానికి ప్రభుత్వాలను ఆడిపోసుకోవడం అలవాటైపోయింది. ఎనభై ఏళ్ల ముసలాయన వంట్లో బాగలేక చనిపోయినా ప్రభుత్వానిదే తప్పు, తాగి వాహనం నడిపి యాక్సిడెంట్ చేసినా ప్రభుత్వానిదే తప్పు, పరీక్షల్లో ఫెయిలయి ఆత్మహత్యలు చేసుకున్నా, అప్పులు కట్టలేక పురుగు మందులు తాగినా, అన్నిటికీ ప్రభుత్వమే జవాబుదారీ అంటే ఎలాగండి? మీ పాలనలో ఇవేమీ జరగనట్లు శుద్ధపూసల్లా మాట్లాడుతారే ?"

"ఎనభయ్యేళ్ళ పాల్ స్వామి ప్రభుత్వాన్ని కూల్చేస్తాడా? ఆయన వయసుని చూసైనా బెయిల్ ఇవ్వవచ్చుకదా?"

"చట్టం తనపని తాను చేసుకుంటుందండి, రూల్ ప్రకారం బెయిల్ మంజూరు అయ్యే అవకాశముంటే కోర్టులు ఇచ్చి వుండేవి"

"దొంగ కేసులు పెట్టి, దొంగ సాక్ష్యాలు సృష్టించి బెయిల్ రాకుండా చేశారు. అందుకే పాల్ స్వామి మరణించారు. ఆయనది సహజ మరణం కాదు, ఆయనను హత్య చేశారు"

ఒక ముసలాయన కోసం దొంగ సాక్ష్యాలు సృష్టిస్తారా?

జనాలకి వేరే పని లేదా? అని శ్రీరామ్ మనసులో అనుకుంటూ ఛానల్ తిప్పుదామనుకునే లోపు, పాల్ స్వామికి శ్రద్ధాంజలి ఘటించడానికి వచ్చే సందర్శకులను కవర్ చేస్తున్న దృశ్యాలను చూపుతుంటే ఆసక్తిగా ఉందని ఆగాడు. అలా చూస్తుంటే, ఉన్నట్టుండి శ్రీరామ్ చూపు ఒక మనిషి దగ్గర ఆగిపోయింది. ఆ వీడియో క్లిప్ మళ్ళీ మళ్ళీ వస్తున్న కొద్దీ అతన్ని పట్టి పట్టి చూస్తున్నాడు. అతన్ని ఎక్కడో చూసిన జ్ఞాపకం. ఎక్కడ? ఎక్కడ? ఎక్కడ?.. ఆలోచిస్తున్నాడు. ఊహూ, గుర్తు రావడం లేదు. కళ్ళు మూసుకున్నాడు. మెదడు చురుకుగా మెమొరీలో నిక్షిప్తమైన కొన్ని లక్షల చిత్రాలతో దీన్ని పోల్చి చూస్తూ ఎక్కడో అట్టడుగు పొరల్లో దాక్కున్న ఛాయాచిత్రాన్ని తవ్వి తీయాలని ప్రయత్నిస్తోంది.

ఇటీవలే కలిసినట్టు జ్ఞాపకం . .

ఆఫీస్?.. హొటల్?... పెళ్ళి?... జర్నీ ?

ఊహూ.. ఊహూ,

కస్టమర్.. హా.. ఎస్.. కస్టమర్..

ఎక్కడా? రీసెంట్‌గా తాను ఎక్కడికెళ్లాడు? జైపూర్ – నో, భువనేశ్వర్.. నో

ఢిల్లీ, ఎస్.. అవును, మెల్లగా జ్ఞాపకం వస్తోంది. ఢిల్లీలో.. అవును, హాకింగ్ అసైన్మెంట్..

జరిగిన సంఘటనలన్నీ ఇప్పుడు వరుస క్రమంలో మెదలుతున్నాయి....

* * *

" శ్రీరామ్, సర్టిఫైడ్ ఎథికల్ హ్యాకర్" శ్రీరామ్ విజిటింగ్ కార్డ్ చేతిలో తిప్పుతూ అడిగాడు ఆ వ్యక్తి. శ్రీరామ్ అవునన్నట్టుగా తల ఊపాడు.

"అంటే, అనెథికల్ హ్యాకర్స్ కూడా ఉంటారా? హహహా" తన జోక్‌కి తనే నవ్వుతూ అన్నాడు

"దొంగగా ఇంట్లో చొరబడటానికి, సెర్చ్ వారంట్‌తో ఇల్లు సోదా చేయడానికి ఉన్నంత తేడా ఉంది సార్" అన్నాడు శ్రీరామ్ వినయంగానే. పక్కనే కూర్చున్న ఇద్దరు ముగ్గురు ముసిముసిగా నవ్వడం శ్రీరామ్ గమనించాడు.

ఎదురుగా కూర్చున్న వ్యక్తి కాస్త సర్దుకుని ఇబ్బందిగా మొహం పెట్టి "ఓకే, లెటస్ కామ్ తు ద పాయింట్. మీరు చెప్పిన సాఫ్ట్‌వేర్లన్నీ ఇన్స్టాల్ చేయించిన ల్యాప్టాప్ రెడీగా ఉంది. మీ కోసం ఒక రూమ్ బుక్ చేసి వుంచాము. ఇదిగో, ఇవి, మీరు మాకు హ్యాక్ చేసి ఇవ్వాల్సిన మెయిల్ ఐడీలు. ఇంకా మీకు ఏమి కావాలన్నా ఇదిగో, ఈ తివారిని అడగండి" అని తివారీ అనే వ్యక్తిని చూపిస్తూ చెప్పాడు.

శ్రీరామ్ ఆ మెయిల్ ఐడీ పేపర్ చూసి, "వీళ్ళు ఎవరో, మనం వీరి మెయిల్స్ ఎందుకు హ్యాక్ చేస్తున్నామో కొంచెం చెప్పగలరా?" మర్యాదగా అడిగాడు.

వెంటనే, బుల్లెట్ వేగంతో

"అది మీకనవసరం" అన్నాడు అవతల వ్యక్తి అసహనాన్ని కనబరుస్తూ.

"సారీ, నేను ఎథికల్ హ్యాకర్ని. నేనెవరి అకౌంటన్నా హ్యాక్ చేస్తుంటే, ఎందుకో తెలుసుకోవాలి, వాళ్లెవరో కూడా తెలియాలి. అది నా వృత్తి ధర్మం" స్థిరంగా అన్నాడు శ్రీరామ్

అతను ఏదో చెప్పబోతూ, మరేదో స్ఫురించినవాడిలా "నాతో రండి" అని శ్రీరామ్‌ని వాళ్ళ బాస్ రూమ్‌కి తీసుకెళ్ళాడు. ఆయన చాలా సాత్వికంగా కనిపించాడు. వెనక్కి దువ్విన జుట్టు, నుదుటిన బొట్టు, పచ్చటి మొహాన మెరుస్తున్న కళ్ళు, చూడగానే శ్రీరామ్ తల వంచి విష్ చేశాడు. ప్రత్యభివాదం చేస్తూ ఆయనన్నాడు

"ఇప్పుడే, మనోజ్ చెప్పాడు, గుడ్, ఐ లైక్ యువర్ ప్రొఫెషనల్ అప్రోచ్ అండ్ సిన్సియారిటీ. మీ ఎథికల్ హ్యాకింగ్ విలువలకి నేను ఇంప్రెస్ అయ్యాను"

కొంచెం ఆగాడు.

శ్రీరామ్ కొంచెం మెత్తబడి అతని వంకే చూస్తుండటంతో,

"కానీ శ్రీరామ్ గారూ, మీకున్నట్లే మాకూ కొన్ని వృత్తి ధర్మాలుంటాయి. మేము కొన్ని నియమనిబంధనలకి లోబడే పనిచేయాల్సి వుంటుంది. మీరడుగుతున్న వివరాలు చాలా కాన్ఫిడెన్షియల్. మేము మీకవి ఇవ్వలేము. అయితే, ఎందుకు చేస్తున్నామో, వాళ్లెటువంటివారో చెబుతాను, మీరే నిర్ణయించుకోండి" అన్నాడు. చెప్పమన్నట్టు చూశాడు శ్రీరామ్.

"భారతదేశం అభివృద్ధి చెందాలని మీరు కోరుకుంటారు కదా? దేశం అన్నిట్లో ముందంజ వేయాలని, ప్రగతి పథంలో నడవాలని కోరుకునే నాయకులు మనకి దొరకడమే అరుదు. అలాంటి వాళ్ళు ఏదో చేద్దామని పూనుకుంటే, ఇదిగో ఇలాంటి వాళ్ళు మోకాలడ్డుతూ ఉంటారు. భారతదేశం రత్నగర్భ అందరం చెప్పకుంటూ ఉంటాం కదా! మన ఖనిజసంపదను ఉపయోగించి పరిశ్రమలు పెట్టి ఉద్యోగావకాశాలు కల్పించడం, విదేశీ ఎగుమతులు ప్రోత్సహించడం నేరమా? కాదు కదా? ఇదిగో, సరిగ్గా ఇక్కడే వీళ్ళు ప్రవేశిస్తారు. ఏమీ తెలియని అమాయకులైన ఆదివాసీలను వెంటేసుకుని మనము వాళ్ళకి అన్యాయం చేస్తున్నట్టు ధర్నాలు, దీక్షలు, వినతి పత్రాలు.. అబ్బో!"

మనిషి బాగా నాటకీయంగా మాట్లాడుతున్నాడు.

"ఖనిజాలు తవ్వాలంటే, వాళ్ళని ఆ ప్రాంతాలనుండి ఖాళీ చేయించాలి. అలా ఖాళీ చేయించి మనం వాళ్ళని తరిమేస్తున్నామా? లేదే, వాళ్ళకి వేరే ప్రాంతంలో స్థలమిస్తాము, ధన సహాయం చేస్తాము. వాళ్ళ యోగ్యతకు తగిన ఉద్యోగమిస్తాము. పాపం, ప్రజలు మంచివాళ్ళు, ఒప్పుకుంటారు. మా వాళ్ళు ఇలా మాట్లాడి వస్తారో లేదో, వీళ్ళు వెళతారు. విషం నూరిపోస్తారు. ఏవేవో అక్కడక్కడా జరిగిన ఒకటీ అరా సంఘటనలు చెప్పి వాళ్ళ మనసులు విరుస్తారు. దేశ ప్రగతికి అడుగడుగునా అడ్డుపడే ఇలాంటి అభివృద్ధి నిరోధక శక్తులని ఏం చేయాలో మీరే చెప్పండి. మేమేమీ వాళ్ళను ఎన్కౌంటర్ చేయట్లేదు. ప్రజలనుండీ దూరం చేసి జైళ్ళలో ఉండేలా చేస్తే, బెయిల్ కూడా పుట్టకుండా చేస్తే, మన ప్రగతి రథచక్రాలు ముందుకు సాగుతాయి. ఇప్పుడు చెప్పండి. ఈ మహోన్నత అభివృద్ధి యజ్ఞానికి ఆటంకం కలిగిస్తున్నవారిని నిరోధించడంలో మీ వంతు సహకారం అందించడానికి

వెనుకాడుతారా?" సౌమ్యంగా, సవివరంగా, సానుకూలంగా, సమాయానుకూలంగా నోటితో అభ్యర్థిస్తు, నొసటితో ఆజ్ఞాపిస్తు చెప్పాడు.

శ్రీరామ్ ఏమీ మాట్లాడక ముందే

"ఆల్ ద బెస్ట్" అని శ్రీరామ్ చేయి నొక్కి బయటకి వెళ్ళిపోయాడు.

ఆ తరువాత ఒకరిద్దరు టెక్నీషియన్‌ల సహాయంతో శ్రీరామ్ వాళ్ళకు మెయిల్ ఐడీస్ క్రాక్ చేసి ఇచ్చాడు.

అంతే..... ఆ తరువాత ఏం జరిగిందో అతనికి తెలియదు. ఆ విషయమే పూర్తిగా మరచిపోయాడు.

* * *

ఇప్పుడు తలచుకుంటే ఆ వరుస క్రమం అంతా అతనికి సవ్యంగా పోతూ, పోతూ ఎక్కడో దారి తప్పినట్టు, అంతవరకూ నిర్మలంగా ఉన్న ఆకాశంలో ఉన్నట్టుండి కారు మబ్బులు కమ్ముకున్నట్టు, వేసవిలో ఫ్యాన్ లేని గదిలో ఉక్కపోతకు మగ్గుతున్నట్టు, ఉక్కిరిబిక్కిరవుతున్న భావన కలుగుతోంది.

ఇంతకీ ఆ మనోజ్ ఇక్కడెందుకున్నాడు?

టీవీ చర్చ ఇంకా కొనసాగుతోంది. ఒకతను తీవ్ర స్వరంతో "దొంగ సాక్ష్యాలు పుట్టించి, లేని ఈ మెయిల్స్ సృష్టించి, అతని కంప్యూటర్లో ఆక్షేపణీయమైన డేటా ఉంచారు. ఆ డేటా ఎట్లా వచ్చిందో తనకు తెలియదు మొర్రో అని అతను ఎంత మొత్తుకున్నా వినరు? కోర్టులదేముంది? సాక్ష్యాధారాలున్నా? అది నిజమా, దొంగ సాక్ష్యమా అనవసరం, బెయిల్ ఇవ్వలేమన్నాయి! ఇంత పకడ్బందీగా ఈ మెయిల్ హ్యాక్ చేసి దొంగ డేటా సృష్టించిన యంత్రాంగాలే బెయిల్ రాకుండా చేసి పాల్ స్వామిని హత్య చేశారు"

శ్రీరామ్ ఆలోచనలో పడ్డాడు. పాల్ స్వామి పార్థివ దేహం దగ్గర మనోజ్ ఎందుకున్నాడు ? మనోజ్ తనను పురిగొల్పి, హ్యాక్ చేయమన్న మెయిల్ ఐడీలలో ఒకటి పాల్ స్వామిదా?

ఈ విషయం తట్టగానే శరీరం గగుర్పొడిచింది. రోమాలు నిక్కబొడుచుకున్నాయి. సన్నగా శరీరం కంపించింది. తను పాల్ స్వామి మెయిల్ హ్యాక్ చేశాడా?

బెయిల్ రాని కారణంగానే ఆరోగ్యం క్షీణించి చనిపోయాడని చెబుతున్నారు.. అంటే ఆ బెయిల్ రాకుండా జరిగిన ప్రక్రియలో తనకు కూడా భాగస్వామ్యముందా? తాను పాల్ స్వామి చనిపోవడానికి పరోక్ష కారకుడా? ఈ ఆలోచన వదలడం లేదు.. అంటే మనోజ్, పాల్ స్వామి కేసును విచారిస్తున్న అధికారా? అందుకే పాల్ స్వామి చివరి చూపు కోసం వచ్చేవారిని కనిపెడుతూ ఉండటం కోసం మఫ్టీలో అక్కడ ఉన్నాడా? శ్రీరామ్‌కి అంతా సినిమాలో చూసినట్టుగా అనిపిస్తోంది, కానీ అది నిజం. ఆరునెలల క్రితం తాను ఢిల్లీకి వెళ్ళింది నిజం, మనోజ్‌తో, వాళ్ళ బాస్‌తో మాట్లాడింది నిజం.. ఆయన తేనెపూసిన మాటలు వినడం నిజం, ఆయన మాయలోపడి , ఆడమన్నట్లల్లా ఆడటం నిజం.. అంటే పాల్ స్వామి చనిపోవడంలో తానూ ఒక పాత్ర పోషించడం నిజం.

శ్రీరామ్‌కి తలచుకుంటుంటే భయం పుడుతోంది, అగాధంలోకి జారిపోతున్న భావన. నిముష నిముషానికి అధికమౌతున్న అపరాధ భావన. తాను తెలిసి చేశాడా? లేదు, చాలా కాకతాళీయంగా జరిగిపోయింది. ఇందులో తన ప్రమేయమేముంది? ఒక క్లయింటు వచ్చి తన సేవలు అడిగాడు. ఒక ఉద్యోగిగా, తన పై అధికారి చెప్పిన పని తాను చేశాడు. ఆ తరువాత జరిగిన పరిణామాలకు తనకు సంబంధముంటుందా? డాక్టరు ఒక సర్జరీ చేస్తాడు, ఒక్కోసారి అది ఫెయిలవచ్చు, అంత మాత్రాన అతను హంతకుడవుతాడా? ఒక పోలీస్ ప్రాణ రక్షణ కోసం, జనాల సంరక్షణ కోసం ఫైరింగ్ చేస్తే అందులో ఎవరన్నా మరణిస్తే, అది ఆ ఆఫీసర్ నేరమౌతుందా? లేదు లేదు, ఇవన్నీ వృత్తిజీవితంలో జరిగే సాధారణ విషయాలే ! అందులో వాళ్ళెవరికీ ఏ మాత్రమూ బాధ్యత లేదు. అలాగే, తనకీ లేదు. ఇదిగో.. ఇక్కడే, ఇక్కడే, నిన్ను నువ్వు, సమర్థించుకోవడానికి ఏవేవో పోలికలు తెస్తున్నావ్, అవి వేరు, నీ విషయం వేరు. నిన్ను వాళ్ళు మాటల మాయలో పడేసి నీతో పని చేయించుకున్నారు. పాల్ స్వామి నిర్దోషి అయి ఉంటాడు, అందుకే, అతనికి బెయిల్ రాకూడదని వేరే మెయిల్ ఐడి నుండి అతనికి కొన్ని పుస్తకాలో, ఏవో కల్పిత కుట్రల పత్రాలో పంపి, అతని కంప్యూటర్లో డౌన్లోడ్ చేసి, ఇవిగో సాక్ష్యాలు.. అంటూ కోర్టుకు సమర్పించారేమో..

మరి.. అలాంటప్పుడు, వాళ్ళు పన్నిన ఆ కుట్రలో తాను చేసిన సహాయం నేరం కాదా? అప్పటికీ తాను అడిగాడు, వివరాలు కావాలని? అతను ఎలా మాట్లాడాడు? ఒకవేళ అతను నిజం చెప్పినప్పటికీ తాను పెద్దగా ఏమీ స్పందించేవాడు కాదేమో, ఎందుకంటే, అప్పటికి తనకి ఈ పాల్ స్వామి ఎవరో తెలియదు! ..కానీ ఆ రోజు మనోజ్ వాళ్ళ బాస్, ఎంత లౌక్యంగా మాట్లాడాడు? ఎన్ని కన్విన్సింగ్ వివరణలు ఇచ్చి తనను మాట్లాడనీయకుండా చేశాడు! తనని ఏకంగా రాముడితో పోల్చాడు . విశ్వామిత్రుడి యాగానికి ఆటంకం కలిగిస్తున్న రాక్షసులను సంహరించడానికి రాముడు వెనుకాడాడా? అంటూ ప్రశ్నించాడు. రాముడికి లేని సంకోచం, రాముడికి అంటని పాపం నీకొస్తుందా అంటూ ఏమేమో మాట్లాడి, ఎక్కడికెక్కడికో తీసుకెళ్ళాడు... మరి రాముడికి లేని బాధ తనకెందుకు? అయినా రాముడికి బాధలేదని తనెలా చెప్పగలడు? ఏమో, రాముడెప్పుడైనా బాధపడిఉంటాడా? అయినా, రాముడికి తనకు పోలికెందుకు? రాముడు రాజు, కాబట్టి చంపడం, యుక్తులు, వాటి ధర్మాధర్మాలు వేరే ఉంటాయేమో? అయినా రాముడు బాధ పడితే ఎంత, పడకపోతే ఎంత, తన బాధని ఎవరితో చెప్పుకోవాలి? ఎందుకు, తనుకూడా రాముడిలాగే సమర్థించుకోవచ్చు కదా. నో, కుదరదు, తానేమీ రాజు కాదు, ఇది రాజరికం అంతకంటే కాదు. ఈ ప్రజాస్వామ్యంలో తాను చేసింది తప్పే కావచ్చేమో? అంతేనా, అంటే, తాను పరోక్షంగా పాల్ స్వామి మరణానికి కారణమని తాను నమ్ముతున్నాడా?

• ఎంత సమర్థించుకుంటున్నా ఏదో అపరాధ భావన, గిల్టీ ఫీలింగ్ మనసులో తిష్ట వేసుకుపోయింది. పాల్ స్వామి జీవితం

గురించి ఎక్కువ విషయాలు తెలుస్తున్నకొద్దీ అది మరింత ఎక్కువవుతూ పోతోంది. తాను పుట్టి పెరిగిన వాతావరణంలో, అలాంటి వాళ్ళు చాలా అరుదు. ఏ సంబంధం లేకుండా, ఏ ప్రత్యుపకారాన్ని ఆశించకుండా నిబద్ధతతో పనిచేసే మనుషులు ఉంటారంటే నమ్మబుద్ధి అయ్యేది కాదు. దేవి పరిచేయమయ్యాకే అలాంటి వాళ్ళని గురించి వినడమైనా, చూడటమైనా.

టీవీలో పాల్ స్వామిని సమర్థిస్తూ మాట్లాడుతున్న వ్యక్తిని అలానే చూస్తూ చూస్తూ ఉంటే ఉన్నట్టుండి ఒక ఆలోచన వచ్చింది. "ఇప్పుడు నేను ఈ టీవీ ఛానెల్ వాళ్ళకు ఫోన్ చేసి, పాల్ స్వామి మెయిల్ అకౌంట్ హ్యాక్ అయ్యింది, అతని కంప్యూటర్‌లో లభించిన పత్రాలు దొంగవి అని చెబుతూ, ఆ మెయిల్ హ్యాక్ చేసింది తానే అని చెబితే?" "సరే, నేనే అని చెబుతాను, 'నువ్వే హ్యాక్ చేశావని చెప్పటానికి ఆధారాలేమయినా వున్నాయా' అని అడిగితే? ఋజువు చేయడానికి తన దగ్గర ఏ సాక్ష్యాలున్నాయి?" ఒక్కసారి డిల్లీ సంఘటన మననం చేసుకున్నాడు.

నిరూపించే అవకాశమే కనిపించలేదు.

ఆహా, ఎంత తెలివిగా, ఎంత పకడ్బందీగా ప్రణాళిక వేశారు!

ఎవరి పేరు మీదో రూమ్ బుక్ చేశారు. వాళ్ళ ల్యాప్‌టాప్ ఇచ్చారు. వాళ్ళ వైఫై రౌటరే వాడమన్నారు. అన్నీ ఏర్పాట్లు వాళ్ళే చేసి తన తెలివిని మాత్రం చాలా తెలివిగా వాడుకున్నారు. పైపెచ్చు ఆ నిర్వాకానికి మనోజ్ వాళ్ళ బాస్ చెప్పిన కారణం ఇంకా గుర్తుంది. 'చూశావా శ్రీరామ్, ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామో! నీ భద్రత గురించే ఇన్ని ఏర్పాట్లు, ఇంత గోప్యత! ఈ విషయంలో నువ్వు సహకరించావని తెలిస్తే, ఆ రాక్షసులు నీ ప్రాణాలు తీయడానికైనా వెనుకాడరు! డోంట్ వర్రీ, వి విల్ టేక్ కేర్ ఆఫ్ యు!' ఎంతలా నమ్మించాడు! తనకిప్పుడు అర్థమవుతోంది.. రక్షకులెవరో, రాక్షసులెవరో!!

ట్రింగ్, ట్రింగ్ అని వాట్సప్ శబ్దం చేసింది. చూస్తే – దేవి నుండి మెసేజి – 'సారీ , బాగా లేటయ్యింది . నీ మెయిల్‌కి అన్ని వివరాలు పంపాను. కొంచెం మంచిగా సెట్ చేసి ఇస్తే, ఈ రాత్రే అందరికీ పంపాలని అనుకుంటున్నాను'

ల్యాప్‌టాప్ తెరచాడు, మెయిల్ చూశాడు. దయామయుడిలా కనపడుతున్న పాల్ స్వామి ఫోటో శ్రీరామ్‌ని మరింత ఇబ్బందికి గురిచేసింది. తనవైపే.. చూస్తున్నట్టు కనబడుతుంటే.. అప్రయత్నంగానే అతని నోటినుండీ, 'అయాం సారీ పాల్ గారూ, ఇలా జరుగుతుందని నాకు తెలియదు. అయాం ఇన్నోసెంట్. ఐ ఫీల్ వెరీ సారి ఫర్ దిస్ అన్ఫార్చునేట్ ఇన్సిడెంట్... రియల్లీ సారీ' తనలో తానే పశ్చాత్తాపంతో గొణుక్కున్నట్టుగా మాట్లాడాడు. తెరచిన పుస్తకం లాంటి అతని జీవితంలో జైలుకెళ్లాల్సిన నేరాలేవీ కనబడలేదు. దేవి పంపిన పవర్ పాయింట్ తెరచి, అందులో వున్న విషయాలను, కరపత్రంలో ఎక్కడెక్కడ ఉంచాలో ఆలోచించి అవన్నీ సెట్ చేసి, పీడిఎఫ్‌లోకి మార్చి, టాగ్ చేయాల్సిన అంశాలను మరొకమారు సరిచూసి, స్పెల్ చెక్ చేసి తిరిగి తనకి మెయిల్ చేసేపాటికి రాత్రి పన్నెండు కావస్తోంది.

దేవికి ఫోన్ చేయాలా? ఆలోచించాడు. ఫోన్ చేసి, జరిగిన విషయాలన్నీ తనకి చెబితే, తన భారం కొంత తగ్గుతుంది. ఆమెది లాయర్ బుర్ర. హ్యాకింగ్‌కి సంబంధించిన విషయాలను నిరూపణ చేయడానికి వేరే మార్గాలేమయినా చెబుతుందేమో! ఒక వేళ అసహ్యించుకుంటే? ఛ, ఛ, దేవి అలాంటిది కాదు, అర్థం చేసుకుంటుంది. తనని ఈ అవరాధ భావన నుండి బయటపడేయగల మనిషి ఆమె ఒక్కతే!

ఫోన్ కలిపితే?

మళ్ళీ ఈ విషయాలన్నీ మాట్లాడుతూ కూర్చుంటే ఆమె చేయాల్సిన ఇతర పనులు ఆగిపోతాయి. అందరికీ ఇంకా మెయిల్స్ పంపాలని చెప్పింది కదా, ఆమె పని ముగిసిన తరువాత, రేపటి ధర్నా పూర్తయిన తరువాత, సాయంత్రం కలుద్దామని చెప్పాలి.

ఆలోచిస్తూ టీవీ చూస్తూ అలాగే నిద్రలోకి జారుకున్నాడు.

నిద్రలో ఒకటే కలలు!

దట్టమైన అడవి.. చుట్టూ ఆకాశాన్నంటుతున్న వందల వృక్షాలు.. వాటి మధ్య ఒక చెట్టు కింద, కొన్నివందల మంది ఆదివాసీలు శూలాలు బరిసెలతో తనని చంపడానికి తయారుగా వున్నారు. శిలువ వేయబడిన పాల్ స్వామి కరుణామయుడిలా నవ్వుతూ వద్దు అని వారిస్తున్నాడు. దూరంగా మనోజ్, వాళ్ళ బాస్ తమాషాగా నవ్వుతూ వేడుక చూస్తున్నారు. దేవి ఎవరికో ఫోన్ చేసి హక్కుల ఉల్లంఘన గురించి మాట్లాడుతోంది. తనకి ఏమీ దిక్కుతోచక శూన్యంలోకి చూస్తున్నాడు.

మగత నిద్ర, నిద్రలో మగత.. మెలకువ రాగానే, కల అని తెలియడం, కలల మధ్యలో మెలకువ రావడం.. భయంతో ఉలిక్కిపడటం, పైనుండి కిందకి పడినట్లు భ్రమించి కళ్ళు తెరవడం, తెరిచిన కళ్ళలోకి వెలుతురు పడి నిద్ర దూరం కావడం.. మళ్ళీ నిద్ర కోసం టీవీ చూస్తూ కళ్ళు మూసుకోవడం.. ఇలాంటి అవస్థలతోనే రాత్రంతా గడిచి ఎప్పుడో తెల్లవారుఝామున నిద్ర పట్టింది.

ఎనిమిది గంటలకు లేచి బద్ధకంగా వళ్ళు విరుచుకుని రాత్రి జరిగినదంతా గుర్తుకు తెచ్చుకుని దేవికి ఫోన్ చేద్దామని మొబైల్ చేతిలోకి తీసుకుంటుంటే.. రాత్రంతా ఆర్పని టీవీ న్యూస్ చానల్‌లో బ్రేకింగ్ న్యూస్ చూసి అవాక్కయ్యాడు. మళ్ళీ మళ్ళీ, కళ్ళు నులుముకుని చూశాడు. నోట మాట రాలేదు. దిగ్గుమని మంచం నుండి కిందకు దూకి టీవీ దగ్గరగా వచ్చి మరీ చూశాడు .

"పాల్ స్వామి మరణంపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ ప్రజల అభిప్రాయాలను సమీకరిస్తున్న హక్కుల కార్యకర్త దేవి అరెస్ట్. నిరసన కార్యక్రమానికి సంబంధించిన టూల్ కిట్లు పంపిణీ చేస్తున్న ఆరోపణలపై విచారణ నిమిత్తం డిల్లీ అధికారుల బృందం దేవిని అరెస్టు చేసినట్టు విశ్వసనీయవర్గాల భోగట్టా" ☆



కామేశ్వరి

భాగ్య

ఏవోబీ విప్లవోద్యమం మరొక అమూల్యమైన కామ్రేడ్‌ను కోల్పోయింది. మే 8న కోరాపుట్ జిల్లా కితుబా గ్రామం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో దాసు, క్రిష్ణ, క్రాంతి, గీత అనే కామ్రేడ్స్‌తో పాటు కామ్రేడ్ కామేశ్వరి అమరురాలైంది. అమరుల్లో గీత మాత్రమే కొత్త కామ్రేడ్. దాసు, కిష్ణ క్రాంతి ఏసీ స్థాయి కామేడ్స్. దీర్ఘకాలం పాటు విప్లవోద్యమంలో విలువైన సేవలందించిన వాళ్లు. అయితే కామ్రేడ్ కామేశ్వరితో మాత్రమే నాకు సన్నిహిత పరిచయం వుంది. అందుకే తన గురించి కొన్ని విషయాలనైనా కామ్రేడ్స్‌తో, ఉద్యమ శ్రేయోభిలాషులతో, తన బంధుమిత్రులతో పంచుకోవాలనిపిస్తోంది. తన జీవిత చరిత్రను ఏవోబీ పార్టీ, తన జ్ఞాపకాలను తనతో కలిసి మెలిసి పని చేసిన కామ్రేడ్స్ వివరంగానే రికార్డ్ చేసే అవకాశం వుంది. అయినప్పటికీ తన గురించి కొంతైనా చెప్పాలనే ఆరాటం. వైవిధ్యభరితమైన తన జీవితం నుంచి పాఠాలుగా నేర్చుకునే ఎన్నో విషయాలున్నాయి.

కామ్రేడ్ కామేశ్వరి స్వరూప పేరుతో ఒడిశాలో, రింకీ పేరుతో ఏవోబీలో పని చేసింది. ఏవోబీలో కూడా తను పని చేసింది ఒడిశా భూభాగంలోనే. అలా చూసుకుంటే తను బయట పనిచేసింది ఆంధ్రాలో అయితే అటవీ ఉద్యమంలోకి వచ్చాక పనిచేసింది పూర్తిగా ఒడిశా రాష్ట్రంలోనే. ఏవోబీలో మల్కన్‌గిరి, కోరాపుట్ సరిహద్దు ప్రాంతం ఆమె కార్యక్షేత్రంగా వుండింది. రింకీతో నేను భౌతికంగా కలిసి వున్నది కొద్ది కాలమే అయినప్పటికీ మనసు విప్పి అన్ని విషయాలు మాట్లాడుకోగలిగిన, కష్ట సుఖాలు పంచుకోగలిగిన సాన్నిహిత్యం మా మధ్య ఏర్పడింది. తనలో నాకు నచ్చిన, నన్ను ఇన్‌స్పైర్ చేసిన విషయాలు ఎన్నో తన అమరత్వపు వార్త తెలిసినప్పటి నుండీ ఉద్యమానికి ఇంకెంతో సేవలను అందించగలిగిన కామ్రేడ్‌ను కోల్పోయిన బాధతో బాటు వ్యక్తిగతంగా కూడా పూడ్చుకోలేని ఒక వెలితి నన్ను వెంటాడుతూ వుంది.

రింకి మనసులో మెదిలినప్పుడల్లా నాకు మరి కొందరు అమరులు కూడా గుర్తుకొస్తారు. వాళ్ల ప్రస్తావన లేకుండా తన గురించి చెబితే అది అసమగ్రమే అవుతుంది. వాళ్లు కామ్రేడ్స్ విశ్వం, శ్వేత, శ్రీను. కామ్రేడ్ శ్వేత రింకీకి తోడబుట్టిన చెల్లి. కామ్రేడ్ శ్రీను రింకీ జీవిత భాగస్వామి. కామ్రేడ్ విశ్వం రింకీకి అభిమానపాత్రుడైన నాయకుడు. ఆ ముగ్గురూ ఆమె జీవితాన్ని రాజకీయంగా చాలా ప్రభావితం చేసారు, మలుపు తిప్పారు.

నేను మొదటగా రింకీ గురించి విన్నది కామ్రేడ్ విశ్వం ద్వారానే. అప్పుడు విశ్వం విశాఖ సిటీ కమిటీ సభ్యుడిగా రాజమండ్రిలోని ఆర్‌టీసీ రంగాన్ని గైడ్ చేస్తుండె. రింకీ ఉద్యమ జీవితంలోకి వెళ్లే ముందు ఆమె వ్యక్తిగత జీవితాన్ని కొంత పరిచయం చేస్తాను. నిజానికి తన గురించి తాను చాలా వివరంగానే చెప్పుకుంది. ఇప్పుడనిపిస్తుంది - దాన్ని మంచిగా రికార్డ్ చేసి వుంటే బాగుండునని. కానీ అప్పుడు నాకేం తెల్సు, నా కంటే వయసులో చిన్నదైన తన గురించి రాయాల్సిన దుస్థితి వస్తుందని. నా జ్ఞాపకశక్తిపై ఆధారపడి రాసే విషయాల్లో కొన్ని పొరపాట్లు దొర్లవచ్చు. ఆ పొరపాట్లను ఎవరైనా సవరిస్తే మరీ మంచిది.

కామ్రేడ్ కామేశ్వరి పుట్టింది తూర్పు గోదావరి జిల్లాలో. అమలాపురం తాలూకా ముమ్మిడివరం వాళ్ల స్వగ్రామం అని పేపర్లో వచ్చింది. బహుశా నిజమే కావొచ్చు. కానీ వాళ్ల కుటుంబం స్థిరపడింది మాత్రం అమ్మ పుట్టిల్లు శ్రీకాకుళం జిల్లా బుడితి గ్రామంలో. కామేశ్వరి యింటికి పెద్ద బిడ్డ. ఆమెకు ముగ్గురు చెల్లెళ్లు. తండ్రి అకాల మరణంతో తల్లే చిన్న ఉద్యోగం చేస్తూ పిల్లల్ని పెంచి పోషించుకుంది. రింకీ తరచుగా "చిన్నప్పుడు బలాదూర్‌గా తిరిగేదాన్ని బుద్ధిగా, కుదురుగా కూర్చొని చదువుకోడం అంటే బొత్తిగా పడేది కాదు నాకు. ఎప్పుడూ ఆటపాటలతోనే గడిపేసేదాన్ని. ఇంటి పని కూడా చేసేదాన్ని కాదు. అసలు నాకు ఆడపిల్ల లక్షణాలే లేవు. మగరాయుడిలా తిరిగేదాన్ని. శ్వేత నాకు పూర్తిగా వ్యతిరేకం. కుదురుగా వుండేది. ఇంటి పనులన్నీ మీదేసుకొని ఓపిగ్గా చేసేది. ఇంటికి పెద్ద కూతురులాగా చాలా బాధ్యతగా వుండేది" అని చెప్పేది.

పదో తరగతో, ఇంటర్ మీడియటో చదివిన తర్వాత రింకీకి మేనమామతో పెళ్లయింది. తర్వాత తను ఆర్‌టీసీలో కండక్టర్‌గా ఉద్యోగంలో చేరింది. ఒక పాప - ముద్దు పేరు చిన్నారి - పుట్టింది. ఇలా యించుమించు సాఫీగా సాగిపోతున్న వాళ్ల కుటుంబం ఒక తీవ్రమైన కుదుపుకు గురైంది. శ్వేత జీవితం ఆ కుదుపుకు కేంద్రం అయింది. ఇతర రాష్ట్రం (ఏరాష్ట్రమో గుర్తు లేదు. బీహార్ లేదా ఉత్తరప్రదేశ్ అయివుంటుంది)లో సెటిల్ అయిన ఒక తెలుగు కుటుంబంలోని వ్యక్తితో శ్వేత పెళ్లయింది. పెద్దగా కట్నం ఆశించని ధనిక కుటుంబంతో పెళ్లి సంబంధం అంటే సాధారణంగా ఏ మధ్య తరగతి కుటుంబమయినా సంతోషించడం సహజమే కదా. శ్వేత అదృష్టవంతురాలని అందరూ మురిసిపోయారు. కానీ ఆ మురిపెం మూడు రోజులు కూడా మిగలలేదు. పెళ్లయిన రోజే శ్వేతతో పాటు, తోడుగా ముగ్గురు అక్కా చెల్లెళ్లూ మగపెళ్లివారింటికి వెళ్లారు. ఆ తర్వాత ఏం జరిగిందో నేను కామేశ్వరి స్వరంలోనే చెప్పే ప్రయత్నం చేస్తాను.

"ఫస్ట్ నైట్ జరిగిన తెల్లవారి శ్వేత మొహంలో నాకు ప్రేతకళ కనబడింది. నేను వర్రీ అయిపోయాను. ఏమై వుంటుంది? తనతో మాట్లాడుదామంటే నాకు అవకాశమే దొరకలేదు. ఇంటి నిండా మనుషులు. ఒంటరిగా తనతో మాట్లాడే అవకాశమే చిక్కలేదు. నేను మామూలుగానే ఉండడానికి ప్రయత్నించాను. తన మొహంలోని భావాలను పసిగట్టనట్టుగానే వుండిపోయాను. తొందరపడకుండా అవకాశం కోసం ఎదురుచూశాను. సాయంత్రం

గుడికి వెళ్దామని బయల్దేరతీశాను. ఆ యింటి మహిళలు కూడా మాతో వచ్చారు. గుడిలో ఏదోలా వీలు చేసుకొని ఏమైందని అడిగాను. దానికది 'వాడసలు మగాడే కాదు. వాడో పెద్ద గూండా, శాడిస్టు. వాళ్లింట్లో దేవుడి గదిలో కత్తులూ, కటార్లూ, తుపాకులు కూడా వున్నాయి. నా జీవితం సర్వనాశనం అయింది. ఈ విషయం బయటకు పొక్కితే మనల్నందరినీ చంపేస్తానన్నాడు" అంది. అంతకంటే చెప్పే అవకాశం లేదక్కడ. నేను షాక్ తిన్నాను. ఎలాగో తేరుకొని "నువ్వు మామూలుగా వుండు. నేను చూసుకుంటాను. నేను ఏదో విధంగా నిన్నిక్కడి నుండి తీసుకెళ్లిపోతాను" అని చెప్పాను.

చెప్పడమైతే చెప్పాను కానీ ఏం చేయాలో నాకు పాలుపోలేదు. ఆ రాత్రి నాకు కాళరాత్రే అయింది. ఆ రాత్రి వాడి గదిలోకి వెళుతున్న శ్వేతను చూస్తే పులిబోనులోకి వెళ్తున్న లేడిపిల్లే గుర్తొచ్చింది. కానీ దాన్ని వెళ్లకుండా ఎలా ఆపగలను? రూంలో దాన్నెంత హింసపెడుతున్నాడోనని తలుచుకుని వణికిపోయాను. అర్ధరాత్రి దాటాక ఇంటి ముందు ఏదో అలికిడయినట్టనిపిస్తే లేచి తలుపులు తీసుకొని బయటకు వెళ్లాను. కార్ షెడ్ వద్ద కారుకు ఆనుకొని శ్వేత నిలబడి వుంది. దానికి ఎదురుగా వాడు నిలబడి వున్నాడు. ఇద్దరూ ఏదో వాదించుకుంటున్నట్టుగా అనిపించింది. అదేమీ గమనించనట్టుగా నేను గభాలున అక్కడికి వెళ్ళాను. శ్వేతను వాడితో వంటరిగా వదిలేయొద్దనుకున్నా.

"ఏంటండీ మరిది గారూ, చల్లగాలి కోసం బయటకొచ్చారా? కొత్త ప్లేస్ కదా నాక్కూడా నిద్దర్రావడం లేదు" అంటూ వాళ్ల మధ్యలో దూరిపోయి కబుర్లు మొదలుపెట్టాను. జోకులు, పరిహాసాలతో దాదాపు వేకువ రూము వరకూ ఏదో ఒకటి వాగుతూనే వున్నా. శ్వేతను మళ్లీ వాడి గదిలోకి వెళ్లనీయకుండా చేయాలనుకున్నా. వాడికేమీ మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదు. అఖరులో మెల్లగా 'మా చెల్లి చాలా లక్కీ అండీ. మాక్కూడా మీ యింట్లో చాలా సరదాగా గడిచింది. ఇంకా వుండిపోవాలనుంది కానీ నాకు లీవ్ దొరకదు. అందుకే వెళ్లాలి. మాతో పాటు మీరిద్దరూ కూడా రావాలి. ఓ నాలుగు రోజులు సరదాగా గడిపి వచ్చేద్దురు గానీ" అన్నాను. దానికి వాడు ససేమిరా అన్నాడు. 'పొద్దున పెళ్లయిందంటే సాయంత్రం బయల్దేరి వచ్చేశారు. మా బంధువులకన్నా పరిచయం కాలేదు. మాకూ అచ్చటా, ముచ్చటా వుంటుంది కదండీ" అన్నాను.

అప్పటికీ వాడు ఒప్పుకోలేదు. కుదరదంటూ ఇంట్లోకి వెళ్లిపోయాడు. అప్పుడు శ్వేత దుఃఖాన్ని అదిమిపడుతూ మెల్లగా చెప్పింది "అదిగో ఎదురుగా కొండమీద లైట్లు కనబడుతున్నాయి చూడు. అది గెస్ట్ హౌస్ అట. దాంట్లో వాడి ఫ్రెండ్స్ వున్నారట. వాళ్ల దగ్గరికి నన్ను తీసుకెళ్లడానికి బయల్దేరతీశాడు.'

నోట మాట రాలేదు నాకు. నేను బయటకు రాకుంటే దాని బతుకేమైవుండేదోననే ఊహకే వణికిపోయాను. అప్పటికి దానికి అంతకంటే చెప్పే అవకాశం లేదు. కానీ ఆ తర్వాత తెలిసిన విషయం ఏంటంటే వాడొక మాఫియా గూండా. ఆ ఫ్యామిలీనే అటువంటిది. అయితే వాడి శారీరక లోపం గురించి వాడి కుటుంబానికి కూడా తెలియదు. తన లోపం బయట పడకుండా వుండడం కోసం భార్యా, పిల్లలు కావాలనుకున్నాడు. అందుకే శ్వేతను వాడి ఫ్రెండ్స్ దగ్గరకు తీసుకెళ్లాలనుకున్నాడు. ఆ సుడిగుండం నుండి దాన్నెలాగయినా బయటపడేయాలనుకున్నాను. వాడు దాన్ని పంపించేలా లేడనిపించాక వాడి నాయనమ్మను కన్విన్స్ చేయడం మొదలుపెట్టాను. ఆచారాలూ, సాంప్రదాయాలను ఏకరువు పెట్టాను. పంపించం అని చెప్పడానికి వాళ్లకు కారణం కనబడలేదు. నాయనమ్మ మనవడిని ఒప్పించింది. చివరికి శ్వేతను మూడు, నాలుగు రోజుల కోసం పంపడానికి వాడు బలవంతంగా ఒప్పుకున్నాడు.

"మీరు రాకుండా తనను ఒక్కదాన్నే పంపడం ఏమీ బాలేదండీ. తీసుకెళ్లడానికి మాత్రం మీరు తప్పకుండా రావాలి మరి. మీరు రాకుంటే మా చెల్లిని పంపించం' అంటూ పరిహాసాలాడుతూనే వేం ఆ గడపదాటేశాం. మమ్మల్ని దిగబెట్టడానికి కారును పంపించారు. కారు ఏపీ బార్డర్‌లోకి వచ్చాక నాక్కొంచెం ధైర్యం వచ్చింది. ఇంతలో కారుకు ఏదో చిన్న ట్రబుల్ రావడంతో కారు డ్రైవర్‌తో 'ఇక్కడి నుండి మేం వెళ్లిపోతాం. నువ్వు కారును తీసుకొని వెనక్కి వెళ్లు' అని చెప్పాను. 'మిమ్మల్నిలా మధ్యలో వదిలేసి పోతే నన్ను చంపేస్తారండీ' అన్నాడతను. ఏం కాదు, నేను చెబుతానులే. నేను ఆర్‌టీసీలో పని చేస్తానుగా. బస్ ఛార్జీలు కూడా వుండవు. కారు ఎందుకు? పెట్రోల్ ఖర్చు దండగ' అంటూ కన్విన్స్ చేశాను. అతను అయిష్టంగానే, భయం భయంగానే వెళ్లిపోయాడు.

అతను వెళ్లిపోయాక కానీ నేనూ, శ్వేతా ఫ్రీగా మాట్లాడుకోలేకపోయాం. ఎలాగోలా దాన్ని తెచ్చాను గానీ ఆ తర్వాత ఏం చేయాలో నాకు పాలుపోలేదు. వాడు గూండాలను వెంటేసుకొచ్చి మా యింటి మీద బాంబులేసైనా దాన్ని తీసుకెళ్లగలడనిపించింది. బాగా ఆలోచించాను. నాకప్పుడు శ్రీను గుర్తొచ్చాడు. నాకప్పటికి తనతో పెద్దగా పరిచయం లేదు. తను యూనియన్ లీడర్ అని మాత్రం తెల్సు. నేను యూనియన్ ఆక్టివిటీస్‌లో పెద్దగా పాల్గొనేదాన్ని కాదు. ఇంట్లో మా చెల్లి వాళ్లను దింపేసి నేను క్షణం ఆలస్యం చేయకుండా శ్రీను దగ్గరకు వెళ్లాను.

విషయమంతా విని తను నాకు ధైర్యం చెప్పాడు. భరోసానిచ్చాడు. మూడు నాలుగు రోజుల తర్వాత శ్వేతను తీసుకెళ్లడానికి వాడొచ్చాడు. మరికొందరు కుటుంబసభ్యులు కూడా వచ్చారు. శ్రీను వాళ్ల టీం తయారుగా వుంది. వచ్చిన వాళ్లందరినీ కట్టేశారు. నక్సలైట్లమని చెప్పారు. పిచ్చి పిచ్చి వేషాలేస్తే చంపేస్తామని బెదిరించారు. వాడితో విడాకుల పేపర్ మీద సంతకం చేయించారు. ఆ తర్వాత మ్యూచువల్ కన్‌సెంట్‌తో కోర్టులో విడాకులకు అప్లై చేశాం. జడ్జ్‌మెంట్ వచ్చే రోజున కోర్టులో వాడొస్తాడని ఎదురుచూసాం. వాడు రాలేదు. వాడి అబ్‌సెన్స్‌లోనే విడాకులు మంజూరు అయ్యాయి. అయితే మేం ఇంకా కోర్టు ఆవరణలో వుండగానే మాకు తెల్సిన విషయం ఏంటంటే, వాడు కోర్టుకు రావడానికి కారులో బయల్దేరాడట. మధ్యలో ఒక రైల్వే క్రాసింగ్ వద్ద కార్‌కు ఆక్సిడెంట్ అయి వాడు చనిపోయాడట. శ్వేత ఎంత పిచ్చిదంటే విషయం తెలిసి పీడా విరగడయిందని సంతోషించాల్సింది పోయి ఏడవడం మొదలు పెట్టింది.

సెంట్‌మెంట్‌తో కాదు, ఒక మనిషి ప్రాణం పోయింది కదా అని"

శ్వేతనూ, తమ కుటుంబాన్నీ ఆ గండం నుండి గట్టెక్కించిన కామ్రేడ్ శ్రీనుపై, అతడి కార్యకలాపాలపై కామ్రేడ్ రింకీకి మంచి గురి ఏర్పడింది. స్వభావరీత్యా చొరవ, సామాజిక విషయాల పట్ల స్పందన వున్న మనిషి కావడంతో యూనియన్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనడం మొదలుపెట్టింది. అట్లా శ్వేత వ్యక్తిగత జీవితంలో చోటుచేసుకున్న పీడకల లాంటి ఘటన రింకీని ఉద్యమాలకు దగ్గర చేసింది. దానితో ఆమె వ్యక్తిగత జీవితంలో అశాంతి మొదలైంది. నిజానికి మొదటి నుండీ రింకీకీ, ఆమె భర్తకూ నడుమ మంచి సంబంధాలు లేవు.

ఆమె భర్త సగటు మగవాడు. సగటు మగవాడు మహిళ అస్తిత్వం ఇంటి నాలుగు గోడలకే పరిమితం కావాలనుకొంటాడు. ఇంటి బయట చేసే ఉద్యోగమైనా, మరే పనయినా ఇంట్లో ఆమె నిర్వర్తించే పాత్రకు దోహదం చేయాలనే అనుకుంటాడు. అందుకే కామ్రేడ్ రింకీలో వికసిస్తున్న చైతన్యాన్ని అతను భరించలేకపోయాడు. ఆమె సామాజిక కార్యకలాపాలను అడ్డుకోవాలని చూశాడు. మహిళల క్రియాశీలతను దెబ్బకొట్టడానికి పితృస్వామ్య సమాజం చేతిలో తయారుగా వుండే ఒకానొక ఆయుధం వాళ్ల శీలంపై బురద చల్లడం. యూనియన్ కార్యకలాపాల్లో భాగంగా ఇంటికి వచ్చి పోయే శ్రీనుతో సంబంధం అంటగట్టి ఆమెను వేధించడం మొదలుపెట్టాడు. కామ్రేడ్ రింకి ఆ అవమానాన్ని భరించలేకపోయింది. తన జీవితంపై అతని పెత్తనం ఇక చెల్లదనుకుంది. తన జీవితాన్ని తీర్చిదిద్దుకునే అధికారాన్ని తన చేతుల్లోకే తీసుకోవాలనుకుంది. అందుకే విడాకులు తీసుకొంది. చిన్నారిని తనతోనే వుంచుకొంది. ఆ తర్వాత ఆమె యూనియన్ కార్యకలాపాల్లో మరింతగా నిమగ్నమైంది.

ఆ సమయంలో ఆమెకు కామ్రేడ్ విశ్వం పరిచయమయ్యాడు. కామ్రేడ్ విశ్వం ఆమెను చాలా ప్రభావితం చేశాడు. రాజకీయంగా ఆమెను తీర్చిదిద్దడంలో విశ్వం పాత్ర చాలా ముఖ్యమైంది. వాళ్లిద్దరికీ ఒకరి పట్ల ఒకరికి విశ్వాసం, అభిమానం మెండుగా వుండేవి. ఆ సమయంలోనే కామ్రేడ్ శ్రీను అజ్ఞాత జీవితంలోకి వెళ్లాడు. ఒడిశా రాష్ట్రంలోని వట్టణోద్యమంలో ఆయన భాగమయ్యాడు. ఆర్‌టీసీ రంగంలో శ్రీను నిర్వహించిన బాధ్యతలను కామ్రేడ్ కామేశ్వరి తన భుజానికెత్తుకుంది. విశ్వం మార్గదర్శకత్వంలో కార్మికరంగ నేతగా ఆమె ఆ రంగానికి సమర్థవంతమైన నాయకత్వాన్ని అందించింది. తోటి ఉద్యోగుల అపార విశ్వాసాన్ని చూరగొంది. పురుషాధిక్య సమాజంలో ట్రేడ్ యూనియన్ రంగంలో ఒక మహిళ నాయకత్వంలోకి రావడం సాధారణ విషయమేమీ కాదు. తన చొరవ, కలుపుగోలు స్వభావం ఆమెను అందరికీ సన్నిహితురాలిని చేశాయి. ఆమె ఒక మిలిటెంట్ ఆందోళనాకారిణి. డేషింగ్ నాయకురాలు. మంచి వక్త.

అజ్ఞాతవాసంలోకి వెళ్తున్న శ్రీనుకు సెండాఫ్ ఇవ్వడంలో భాగంగా కామ్రేడ్ కామేశ్వరి అతనితో పాటు కొద్ది దూరం బస్సులో ప్రయాణించింది. శ్రీనుతో తన జీవితాన్ని పంచుకోవాలనుకుంటున్నట్టు ఆ బస్సులోనే ఆమె శ్రీనుకు తెలియజేసింది. శ్రీను వెంటనే ఒప్పుకోలేదు. తన పాజిటివ్స్, నెగటివ్స్ చెప్పి కొంత టైం తీసుకొని లోతుగా ఆలోచించి నిర్ణయం తీసుకోమన్నాడు. కానీ ఆమె తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. కొద్ది కాలం తర్వాత పార్టీ అనుమతితో వాళ్లిద్దరూ జీవిత సహచరులయ్యారు.

ఈ క్రమంలోనే కామ్రేడ్ శ్వేత కూడా విశ్వం పరిచయంలోకి వచ్చింది. కొద్ది కాలంలోనే శ్వేత తన జీవితాన్ని పూర్తిగా విప్లవానికే అంకితం చేయాలని నిర్ణయించుకుంది. చెల్లి నిర్ణయాన్ని రింకీ హృదయపూర్వకంగా స్వాగతించింది. 2004లో శ్వేత గెరిల్లా జీవితంలోకి అడుగుపెట్టింది. తాను అమితంగా ప్రేమించే చెల్లి, వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొన్న చెల్లి తన జీవితాన్ని అర్థవంతంగా మార్చుకుందనే సంతృప్తి, సంతోషాలను రింకీ హృదయం పూర్తిగా ఇముడ్చుకోకముందే ఆమె నెత్తిన పిడుగుపడింది. గెరిల్లా జీవితంలోకి అడుగుపెట్టి సంవత్సరం తిరగకుండానే 2005 ఫిబ్రవరిలో మల్కన్‌గిరి జిల్లాలో జరిగిన ఒక శత్రు దాడిలో కామ్రేడ్ శ్వేత అమరురాలైంది. ఈ ఎన్‌కౌంటర్ వార్త పేపర్లలో వచ్చింది కానీ మృతుల పేర్లను పోలీసులు ప్రకటించలేదు. బహుశా శత్రువు కూడా శ్వేతను గుర్తించలేదు. అందువల్ల శ్వేత మృతదేహం అనామకంగానే మట్టిలో కలిసిపోయింది. ఆమె అమరత్వపు వార్త కూడా రింకీకి చాలా రోజుల వరకూ తెలియలేదు. వాళ్లొక పెద్ద ఆందోళనా కార్యక్రమంలో నిమగ్నమై వున్నప్పుడు ఒక రాత్రి పిడుగులాంటి ఆ వార్తను శ్రీను ఫోన్ ద్వారా ఆమెకు తెలియజేశాడు.

శ్వేత గెరిల్లా జీవితంలోకి వెళ్లిందనే విషయం బహుశా వాళ్ల చెల్లెళ్లిద్దరికీ తెలుసనుకుంటా. ఆర్‌టీసీ రంగంలో కామేశ్వరితో పాటు పని చేసే ఒకరిద్దరు పార్టీ సభ్యులకు కూడా తెలుసు. కానీ వాళ్లమ్మకీ, ఇతర బంధుమిత్రులెవరికీ తెలియదు. ఎక్కడో దూరాన ఉద్యోగంలో చేరిందని అందరికీ చెప్పారు. అటువంటి పరిస్థితిలో సడెన్‌గా ఆమె అమరత్వపు వార్తను అందరికీ ఎలా తెలియజేయాలో ఆమెకు అర్థం కాలేదు. పైగా అమ్మ తట్టుకోలేదని ఆమె భావించింది. అందుకని గుండెలు పిండేసే ఆ వార్తను ఆమె రహస్యంగానే వుంచాలని నిర్ణయించుకుంది. అలా గరళంలాంటి ఆ విషాదాన్ని ఆమె తన గొంతులోనే దాచుకుంది. ఆమెతో పాటు పనిచేసే ఒక పార్టీ సభ్యుడికి మాత్రమే విషయం తెలియజేసింది.

వార్త విన్న మరుసటి రోజు ధర్నా కార్యక్రమం వుండింది. ఆ ధర్నాను ఉద్దేశించి ఆమెనే ప్రసంగించాల్సి వుంది. దుర్భరమైన ఆ వేదనను అనుభవిస్తూనే ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం ఆ కార్యక్రమాన్ని నిర్వహించింది. వేదిక ఎక్కి ప్రసంగించింది. ఆ రోజు ఆమెను కొంతమంది "డల్‌గా వున్నారేంటి?" అని మాత్రం అడిగారు. 'జ్వరంగా వుంది" అనే అబద్ధాన్ని అందరూ నమ్మేశారు కానీ ఆమె హృదయంలో రగులుతున్న బడబానలాన్ని ఎవరూ గ్రహించలేక పోయారు. ఈ విషాదాన్ని కొద్ది రోజులకు తన ఇద్దరు చెల్లెళ్లకు చెప్పింది గానీ వాళ్లమ్మకు మాత్రం తాను అజ్ఞాతంలోకి వచ్చేప్పుడు కూడా చెప్పలేదు.

శ్వేత మరణం సహజంగానే ఆమెను చాలా కుదిపేసింది. అయితే ఆమె విప్లవదీక్షను మాత్రం మరింత దృఢపరిచింది. ఆ తర్వాత క్రమంగా శత్రువు నిఘా ఆమెపై బాగా పెరిగింది. దానితో

పార్టీ నిర్ణయం మేరకు ఆమె 2009 సెప్టెంబర్‌లో గెరిల్లా జీవితంలోకి అడుగుపెట్టింది. అప్పటికి శ్రీను కూడా పట్టణోద్యమం నుండి అటవీ ఉద్యమానికి బదిలీ అయ్యాడు. ఒడిశా రాష్ట్రంలోని ఘుంసర దళంలో రింకీ మొదట పని చేసింది. 2010 మార్చిలో నియమగిరి దళంలోకి బదిలీ అయింది. రవి పేరుతో అ దళ కమాండర్‌గా కామేడ్ శ్రీను పని చేస్తుండె. నియమగిరి కొండలను వేదాంత నుండి కాపాడే కర్తవ్యంతో అదివాసీ ప్రజలను సంఘటితం చేస్తూ, ఒక మిలిటెంట్ ఉద్యమాన్ని నిర్మిస్తున్న అ దళం కృషిలో తన సహచరుడితో పాటు భుజం భుజం కలిపి రింకీ పని చేసింది. అయితే తన సహచరుడితో పాటు కలిసి ఎక్కువ కాలం పని చేసే అవకాశం అమెకు దక్కలేదు.

కార్పొరేట్ రంగాలకు సేవ చేసే ప్రభుత్వాలు వేదాంతకు వ్యతిరేకంగా ఉధృతమవుతున్న ఉద్యమాన్ని సహించలేకపోయాయి. నియమగిరి దళాన్ని వేటాడడానికి పెద్ద ఎత్తున పోలీసులను మోహరించాయి. ఫలితంగా 2011 జనవరిలో అ దళంపై జరిగిన దాడిలో కామ్రేడ్ శ్రీనుతో సహా ఏడుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు. కొంత మంది కామ్రేడ్స్‌తో పాటు రింకి కూడా అ దాడి నుండి తప్పుకుంది. ఒకరిద్దరు కామ్రేడ్స్ గాయాలతో బయటపడ్డారు. కొద్ది సేపటి క్రితం వరకూ తమతో కలిసి మెలిసి నవ్వుతూ, తుళ్లుతూ వున్న కామ్రేడ్స్, ఒకరు కాదు, ఇద్దరు కాదు, ఏడుగురు అమరులు కావడం, అందులోనూ కొంతమంది తన కండ్ల ముందే నెత్తురోడుతూ కుప్పకూలడం, అందులో తను ప్రాణాధికంగా ప్రేమించిన తన జీవిత భాగస్వామి కూడా వుండడం, గాయపడి కొన ఊపిరిలో వున్న కామ్రేడ్స్‌కు చివరి వీడ్కోలు కూడా చెప్పే ఓ కన్నీటి చుక్కను రాల్చే అవకాశం కూడా లేకపోవడం... వర్ణనాతీతమైన ఆ వేదనను తనెలా భరించగలిగిందో. అసలు కండ్ల ముందు ఏం జరుగుతున్నదో గ్రహించే, ఏం జరిగిందో నెమరేసుకునే అవకాశం కూడా లేదక్కడ. ఇక జరగాల్సిందేంటి అనేదే తను అలోచించింది.

బయటవడ్డ కామ్రేడ్లందరిలోకీ వయసులోనూ, అనుభవంలోనూ పెద్దదయిన రింకీ ఆ సమయంలోనూ తన కర్తవ్యాన్ని విస్మరించలేదు. ఎన్‌కౌంటర్ నుండి బయటపడ్డాక ఒక గ్రామ పరిసరాల్లో ఆగి కబురు చేస్తే గ్రామస్తులు అంబలి పట్టుకొని వచ్చారు. "ఎన్‌కౌంటర్ జరిగి రెండు, మూడు గంటలైనా గడవక ముందే మేం అంబలి తాగాం తెల్సా" అని చెప్తున్నపుడు తన మొహంలో విషాదమూ, కర్తవ్య నిర్వహణ పట్ల అంకితభావం కలగలిసిపోయాయి. "కామ్రేడ్స్ ఏడుస్తూ అంబలి తాగడానికి మొరాయిస్తుంటే 'మన అమరుల ఆశయాలను బతికించాలంటే మనం అంబలి తాగాల్సిందే" అని నేను కఠినంగా చెప్పాను" అంది తను. ప్రజల సహాయంతో మందులు తెప్పించి గాయపడిన కామ్రేడ్స్‌కు చికిత్స అందించింది. తానే ఒక ఓదార్పునూ, ధైర్యాన్ని కోరుకునే స్థితిలో వుండి, ఇతర కామేడ్స్‌ను ఓదార్చుతూ, ధైర్యం చెప్తూ అ సమయంలో వాళ్లకు పెద్ద అండగా ఆమె నిలబడిన తీరు ఆదర్శనీయం.

ఏవోబీ, ఒడిశా జోన్లకు మధ్య సమన్వయంలో భాగంగా కోరాపుట్ డివిజన్‌కు ఒక అపాయింట్‌మెంట్‌కు వెళ్లాలని ఎన్‌కౌంటర్‌కు ముందే అ దళం కార్యక్రమాన్ని రూపొందించుకుని వుంది. అంత మంది కామ్రేడ్స్ అమరులై, కొందరు గాయపడి, మిగిలిన కామ్రేడ్సంతా కలత చెంది వున్న అ పరిస్థితిలో కూడా ఎన్‌కౌంటర్‌కు ముందు నిర్ణయించుకున్న కార్యక్రమాన్ని అమలు చేయడానికి మిగిలిన సభ్యులను తను సన్నద్ధం చేసింది. గాయపడిన కామేడ్స్‌ను తీసుకొని వెళ్లడం కష్టమనీ, వాళ్లనెక్కడైనా వుంచి వెళ్తమని కొంత మంది కామేడ్స్ మాట్లాడితే తను ససేమిరా అంగీకరించలేదు. వాళ్లను మోసుకొనే వెళ్లడానికి అందరినీ కన్విన్స్ చేసింది. గాయపడిన కామేడ్స్‌కు చికిత్సనూ, సేవలను అందిస్తూ, కామేడ్స్‌కు ధైర్యం చెబుతూ తను కోరాపుట్‌కు చేరుకుంది. ఆమె ఓదార్చింది కేవలం కామేడ్స్‌నే కాదు. నియమగిరి ప్రాంతంలో కామ్రేడ్ శ్రీను చాలా ఆదరణను పొందిన నాయకుడు. అతనితో సహా ఏడుగురు కామ్రేడ్స్ మరణించడం ఆ ప్రాంత ప్రజలను తీవ్ర దుఃఖంలో ముంచెత్తింది. దారిపొడుగూతా గ్రామాల్లో మీటింగ్‌లు చేస్తూ, ప్రజలకు ధైర్యం చెబుతూ వాళ్ల ప్రయాణం సాగింది. కోరాపుట్ డివిజన్‌లో కామ్రేడ్ దయ (రాంగూడ అమరుడు)తో పాటు ఇతర ఎస్‌జడ్‌సీ సభ్యులు కలిసినపుడు మాత్రమే అమెకు తన దుఃఖాన్ని పంచుకొనే అవకాశం దొరికింది. అంతవరకూ తొణకని కుండలా వున్న అమె వాళ్లు కలిశాక దుఃఖప్రవాహమైంది. అ తర్వాత కొన్నాళ్లకు నేనామెను కలిశాను. దాదాపు రెండు నెలలపాటు మేం నారాయణపట్నా ప్రాంతంలో కలిసి వున్నాం. మానసికంగా తానెంత కలతచెంది వుందో నేను గ్రహించాను. కాల్పులూ, పేలుళ్ల శబ్దాలు ఇంకా తన చెవుల్లో మారుమోగుతున్నాయనీ, కామ్రేడ్స్ ఒరిగిపోతున్న దృశ్యం కండ్లల్లో కదలాడుతున్నదని తన వేదనను పంచుకుందామె. ఆ సమయంలో అమె కొన్నాళ్లు చిన్నారితో గడపాలని బాగా కోరుకుంది. కానీ విప్లవోద్యమంలో అటువంటి సాధారణ విషయాలు కూడా అసాధ్యమే అవుతాయి కనుక అమె కోరిక నెరవేరలేదు. అయితే నాయకత్వ కామ్రేడ్స్ అందించిన సహకారం, ఓదార్పుతో కామ్రేడ్ రింకీ క్రమంగా కోలుకుంది. నిలదొక్కుకుంది. అయితే తన సహచరుడు అమరుడైన అ ప్రాంతంలో మాత్రం పనిచేయడానికి నిరాకరించింది. ఆమె మనోభావాలను అర్థం చేసుకున్న పార్టీ ఆమెను ఏవోబీకి బదిలీ చేసింది.

కొద్ది కాలంలోనే ఆమె ఏవోబీ ఉద్యమంలో ఒక ఆధారపడదగిన నాయకురాలిగా ఎదిగింది. డివిజన్ కమిటీ సభ్యురాలిగా పార్టీకి అనేక సేవలనందించింది. ముఖ్యంగా విస్థాపన వ్యతిరేక పోరాటాలకు మార్గదర్శకత్వం వహించింది. అర్గనైజేషనల్‌గానే కాదు ఆమె అనేక సామర్థ్యాలను కలిగి వుండేది. ఆమెకు సాంస్కృతిక రంగం పట్ల చాలా అసక్తి వుండేది. ఆమె మంచి గాయకురాలు. నియమగిరి ఎన్‌కౌంటర్ తర్వాత తను కోరాపుట్ డివిజన్‌లో వున్నప్పుడు మార్చి నెలలో దేవ్‌మాలి ప్రాంతంలో విస్థాపన వ్యతిరేక బహిరంగ సభ జరిగింది. అక్కడికి ఒక బాల సాంస్కృతిక టీంను పంపాలని అక్కడి పార్టీ నిర్ణయించింది. కామ్రేడ్ దయ "అసక్తి వున్న పిల్లలయితే వున్నారు. కానీ వాళ్లకు నేర్పేవాళ్లు ఎవరూ లేరు" అన్నాడట. "అరె నేనున్నాను కదా" అని రింకీ అంటే ఆమె మానసిక స్థితిని పూర్తిగా ఎరిగిన దయ చాలా ఆశ్చర్యపోయాడట. అతని అంచనాలకు భిన్నంగా అమె అ

బాధ్యతను స్వీకరించింది. కొన్ని నాటకాలను తయారు చేసి, పిల్లలతో రిహార్సల్స్ చేయించి, ఆ పిల్లలను ఒక మంచి సాంస్కృతిక దళంగా తీర్చిదిద్ది ఆ సభకు పంపించింది.

రాయడమంటే తనకు బద్ధకం వుండేది కానీ రాయగలిగే సామర్థ్యం మాత్రం మెండుగా వుండేది. కామ్రేడ్ విశ్వం ప్రోత్సాహంతో తూర్పు గోదావరి జిల్లాలోని జీడిపప్పు ఫ్యాక్టరీల్లో మహిళా కార్మికుల స్థితిగతుల గురించి అధ్యయనం చేసి ఒక ఫీల్డ్ రిపోర్ట్ రాసింది. 'మహిళల బతుకుల్ని పీల్చిపిప్పి చేస్తున్న జీడిపప్పు ఫ్యాక్టరీలు" అనే శీర్షికతో మే-జూన్ 2003 మహిళా మార్గంలో ఆ రచన అచ్చయింది. అది ఆమె మొదటి రచన. దేవ్‌మాలి మీటింగ్ సందర్భంగా పిల్లలను సాంస్కృతిక దళంగా తీర్చిదిద్దిన తన అనుభవాలను రాయమంటే ఎస్. సుగుణ అనే కలం పేరుతో వీధినాటిక - నా అనుభవం అనే వ్యాసం రాసింది. ఏవోబీ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా విడుదలైన తూర్పుకనుమ ప్రత్యేక సంచికలో అది అచ్చయింది. తర్వాత ఏవోబీ పత్రిక 'బోల్షివిక్' కోసం తను పలు రచనలు చేసింది.

శ్వేత, శ్రీనుల గురించి రాయాలనే తన కోరికను చాలా సార్లు వ్యక్తం చేసింది. ఎలా రాస్తే బాగుంటుందో రెండు, మూడు సార్లు చర్చించింది కూడా. కానీ అది తనకు తీరని కోరికగానే మిగిలిపోయింది. రాయగలనా లేదా అనే అనవసరపు సంశయాలతో మొదలుపెట్టలేదు కానీ తను పూనుకుంటే ఆ యిద్దరి కామ్రేడ్స్ గురించి చక్కగా రాసి వుండేది. తన ఉత్తరాల శైలి కూడా ముచ్చటగా వుండేది. అక్షరాలను మనం చదువుతున్నట్టుగా అనిపించదు. మన ఎదురుగా కూర్చొని తనే కబుర్లు చెబుతున్నట్టుగా అనిపిస్తుంది. తన అలకలను, బుజ్జగింపులను అన్నింటినీ అనుభూతి చెందుతాం.

విప్లవోద్యమంలో ఆమె కాంట్రిబ్యూషన్ గురించి ప్రముఖంగా చెప్పుకొనే విషయాల్లో ఆమె ఒడియా భాషా ప్రావీణ్యం ఒకటి. ఒడియా భాషపై మంచి పట్టు సాధించి పార్టీ అవసరాల మేరకు ఒడియా నుండి తెలుగుకు, తెలుగు నుండి ఒడియాకు అనేక అనువాదాలు చేసింది. ఒడియాలో క్లాసులు కూడా చెప్పింది. నాకు తెలిసి ఒడియా మీద మంచి పట్టు సాధించిన అతి కొద్ది మంది తెలుగు కామ్రేడ్స్‌లో ఆమె ఒకరు. ఏవోబీలోనైతే బహుశా మొదటి స్థానం తనదే కావొచ్చు.

ఒకచోట కూర్చొని చేసే పనులంటే తనకు నచ్చకపోయినా టైపింగ్, డీటీపీ సహా పలు కంప్యూటర్ సంబంధిత పనులు నేర్చుకొని ఉద్యమావసరాలను తీర్చింది.

అనేక ప్రావీణ్యతలు కలిగి వున్న తను కొత్తా, పాతా, చిన్నా పెద్దా అనే తారతమ్యాలు లేకుండా అందరితోనూ కలగలిసిపోయేది. స్నేహం చేసేది. కామ్రేడ్స్‌కు అవసరమైన సహకారాన్ని అందించేది. ఒకవైపు చిన్న పిల్లలను మించి అల్లరి చేసేది. కొంటె వేషాలూ వేసేది. మరో వైపు జూనియర్ కామ్రేడ్స్‌కే కాదు సీనియర్ కామ్రేడ్స్‌కు కూడా ఒక పెద్దక్కలాగా ప్రేమనూ, సహకారాన్ని అందించేది. అవసరమైన సేవలు చేసేది. అందుకే వయోభేదాలు లేకుండా, అన్ని స్థాయిల కామ్రేడ్స్ పైన ఆమె ప్రగాఢమైన ముద్రను వేసింది. తోటి కామ్రేడ్స్‌లోని మంచీ, చెడులను చక్కగా విశ్లేషించుకోగలిగేది. మంచిని ప్రేమిస్తూ చెడుతో కొట్లాడేది. మనుషుల్లోని సంకుచితత్వాన్ని అస్సలు భరించేది కాదు. ఒడిశా రాష్ట్రంలో తను పని చేసింది కొంత కాలమే అయినా 2011లో జరిగిన ఒడిశా ప్లీనంలో డెలిగేట్‌గా పాల్గొని సవ్యసాచి పండా మితవాద, అవకాశవాద వైఖరిని సునిశితంగా విమర్శించింది.

పట్టణ మధ్యతరగతి జీవితం నుండి, అది కూడా నడీడు వయసులో వచ్చిన తను గెరిల్లా జీవితంలో ఇమడడానికీ, ఆదివాసీ ప్రజానీకంతో మమేకం కావడానికి తనను తాను ఎంతగానో మలుచుకుంది, మార్చుకుంది. ప్రజల, తోటి కామ్రేడ్స్ అందరి అభిమానాన్నీ చూరగొంది.

ఆమెకు ప్రకృతి అంటే చాలా ఇష్టం. వెన్నెల్లో సముద్రాన్ని చూడ్డం, అమవాస్య చీకట్లో నింగిలో చుక్కల్ని చూడ్డం చాలా ఇష్టం. ఓ వెన్నెల రాత్రి పాల నురగ వంటి తెల్లని దుస్తులు ధరించి సముద్రపొద్దున ఇసుక తిన్నెలపై శ్రీనుతో చేసిన విహారం గురించి చెప్తున్నప్పుడు ఆమె కళ్లు నక్షత్రాల్లా తళుకులీనేవి. సాహిత్యం, సినిమాల పట్ల తనకు మంచి అభిరుచి వుండేది. చదివిన కథలూ, సినిమాల గురించి ఉత్తరాల్లో కూడా రాస్తూ వుండేది. తన అమరత్వానికి అయిదు రోజుల ముందు ఒక సీనియర్ కామ్రేడ్‌తో తనకు నచ్చిన బేగంజాన్ సినిమా గురించి పావుగంట సేపు చెప్పిందట. తూర్పు గోదావరి జిల్లా యాసలో, ధారా ప్రవాహంలాగా చెప్పే ఆమె కబుర్లు వినసొంపుగా వుండేవి.

కండక్టర్ ఉద్యోగాన్ని కూడా తను చాలా ఎంజాయ్ చేసింది. ఆ రోజులను ఇష్టంగా తలుచుకునేది. లేడీస్ సీట్లలో కూర్చొని లేవకుండా మొండికేసే మగవాళ్లతో, వృద్ధులూ, చంటిబిడ్డ తల్లులూ నిలబడి వున్నప్పుడు లేచి సీటివ్వకుండా జనరల్ సీట్లలో కూర్చొన్న యువకులతో, అమ్మాయిలతో వెధవ్వేషాలేసే అబ్బాయిలతో, బస్సులో పొగ తాగే వాళ్లతో తానెలా వ్యవహరించేదో చెబుతుంటే వినేవాళ్లెవరైనా పడీపడీ నవ్వాల్సిందే. తను అలా చెప్తుంటే కండక్టర్లకు మానవీయ స్పందన వుంటే మహిళలకు, అమ్మాయిలకు ప్రయాణాలు కొంతైనా సాఫీగా సాగుతాయి కదా అనిపించేది.

వ్యక్తిగత జీవితంలో ఎంతో విషాదాన్ని మోస్తూ, తన చిన్నారి వియోగాన్ని భరిస్తూ కూడా తను నిరంతరం ఉత్సాహంగా వుండేది. ఏ చీకూ, చింతా లేనట్టుగా వుండేది. తను అలా వుండడమే కాదు తన చుట్టూ వున్న వాళ్లను కూడా అలా వుండేలా చేసేది.

వివిధ రంగాలను గైడ్ చేసిన అనుభవమూ, ప్రత్యేకమైన శక్తి సమర్థతలూ, పట్టణోద్యమ అనుభవంతో పాటు, గెరిల్లా జీవిత అనుభవమూ, రాజకీయ అవగాహన, వ్యక్తిగత సుగుణాలూ... వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే సమీప భవిష్యత్‌లో విప్లవోద్యమంలో మరిన్ని ఎత్తులకు ఎదిగే అవకాశాలు మెండుగా వున్న కామ్రేడ్‌ను కోల్పోవడం ఏవోబీ ఉద్యమానికి ఇప్పట్లో తీరని లోటు. పైగా మహిళా కామ్రేడ్స్‌ను ఉన్నత నాయకత్వ స్థానాల్లోకి ఎదిగించుకోవడానికి పార్టీ ద్వారా విశేష కృషి జరుగుతున్న నేపథ్యంలో కామ్రేడ్ రింకీని కోల్పోవడం అత్యంత విచారకరం.

రింకీ మరణంతో ప్రజలు సమర్థవంతురాలైన ఒక నాయకురాలిని కోల్పోయారు. ఎంతో మంది కామ్రేడ్స్

(మిగితాది 50వ పేజీలో...)

ఎంకె కుమార్

వందన

టీవీలో న్యూస్ రీడర్ వార్తలు చదువుతున్నాడు. టీవీ చూస్తున్న వందన కుటుంబ సభ్యులు ఆసక్తిగా వింటున్నారు.

"విశ్వ క్రీడల్లో వరుస పరాజయాలతో మొదలైన భారత మహిళల హాకీ జట్టు ఆట జేజేలతో ముగిసింది. అలా అని మన హాకీ జట్టేమీ పతకం గెలవలేదు. కానీ చరిత్ర సృష్టించింది. ఒలింపిక్స్‌లో తొలిసారి సెమీస్ బరిలో నిలిచి మనసుల్ని గెలిచింది. ఇక్కడ మళ్లీ భారత్ ఓడి ఉండవచ్చు. కానీ మరీ బాధపడాల్సిన పరాజయమైతే కాదు. పరాభవం అంతకన్నా కాదు. త్రుటిలో చేజారిన విజయం. అడుగడుగునా అమ్మాయిల పోరాటం అద్వితీయం. అందుకే జాతి యావత్తు జేజేలు పలుకుతోంది. ఒలింపిక్స్‌లో మూడో ప్రయత్నంలోనే తమ అత్యుత్తమ ప్రదర్శనతో నాలుగో స్థానం సంపాదించిన భారత మహిళల జట్టు ప్రదర్శన కాంస్య పతకంలాంటిదేనని దేశం గర్వపడుతోంది"

ఇంట్లో ఉన్న కుటుంబసభ్యులు ఏదో కోలాహలం వినబడితే బయటకు వచ్చారు..

టోక్యో ఒలింపిక్స్‌లో మహిళల హాకీ సెమీస్‌లో అర్జెంటీనా భారత్‌ను ఓడించింది. అది జరిగిన కొన్ని గంటల తర్వాత ఈ సంఘటన జరిగింది. అగ్రకుల పురుషులు కొంతమంది రోష్నాబాద్ గ్రామంలోని స్టార్ స్ట్రైకర్ వందన ఇంటి బయట నిలబడి కులపరమైన దూషణలు చేయడం ప్రారంభించారు. అందులో ఒకరు హాకీ ఆటగాడు కూడా.

వారు వెటకారంగా నృత్యం చేయడం ప్రారంభించారు. వందన కుటుంబాన్ని ఎగతాళి చేయడానికి క్రాకర్స్ పేల్చారు. అందులో ఒకడు గట్టిగా అరిచాడు

"భారతదేశ హాకీ జట్టు టోక్యో ఒలింపిక్స్‌లో ఓడిపోవడానికి కారణం మీకు తెలుసా? దానిలో వందన లాంటి దళిత ఆటగాళ్లు ఉన్నందువల్లే భారత్ ఓడిపోయింది. ప్రతిభ లేకపోయినా వాళ్లు దళితులవడం వల్లే హాకీ జట్టులోకి ఎన్నుకోబడ్డారు. నిజానికి ఎంతో ప్రతిభాపాటవాలు ఉన్న ఆటగాళ్ళు దళితులు కాకపోవడంవల్ల జట్టులో ప్రవేశించలేకపోయారు"

అతనితో పాటు వచ్చిన వాళ్ళు అతనికి వత్తాసు పలుకుతూ దళిత వ్యతిరేక నినాదాలు చేశారు.

వందన సోదరుడు శేఖర్ వాళ్లకు ధీటుగా సమాధానం చెప్పే ప్రయత్నం చేశాడు. కానీ అతని మాటలు వాళ్ళ అరుపులును దాటలేక పోయాయి. అయినా అతను గట్టిగా అరుస్తూ మాట్లాడాడు.

"ఓడిపోయిన తర్వాత మేం బాధపడ్డాం. కానీ జట్టు గెలవడానికి వందన గట్టిగా పోరాడింది. మేము దాని గురించి గర్వించాము. అకస్మాత్తుగా, మ్యాచ్ ముగిసిన వెంటనే, పెద్ద శబ్దాల వల్ల బయటికి వచ్చాం. ఇంటి బయట మీరు పటాకులు పేలుస్తూ ఇబ్బందులకు గురి చేస్తే పోలీసులకి కంప్లైంట్ చేస్తాం. వెంటనే ఇక్కడి నుండి వెళ్లిపోండి"

దాంతో వందన కుటుంబం సభ్యులపై వాళ్ళు మరింత రెచ్చిపోయారు. కులం పేరుతో తిట్టడం ఆరంభించారు. వీధిలో వాళ్ళు చోద్యం చూడటం మొదలుపెట్టారు. కొంతసేపు అల్లరిమూక వాగిన తర్వాత పోలీసులు రావడంతో వెళ్ళిపోయారు.

శేఖర్ కోపంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లిఖితపూర్వక ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులో,

"వాళ్లు కులం పేరుతో తిట్టారు. మా కుటుంబాన్ని అవమానించారు. చాలా మంది దళితులు జట్టులో చేరినందున భారత జట్టు ఓడిపోయిందని చెప్పారు. ఇది కేవలం హాకీ జట్టు ఓటమి గురించే కాదు. ప్రతి క్రీడలోను దళితులు ఉండబట్టే భారత్ ఓడిపోయిందని ఎద్దేవా చేశారు. ఊరికి వాడని వేరు చేసినట్టే, క్రీడల నుండి దళితుల్ని వేరు చేయాలని వాళ్లు గట్టిగా అరిచారు. తర్వాత, వారి చొక్కాలు తీసి, మళ్లీ డ్యాన్స్ చేయడం మొదలుపెట్టారు. ఇది అగ్రకుల అహంకారం దాడి. వారిపై అట్రాసిటీ యాక్ట్ పెట్టాలి" అన్నాడు.

విధిలేని పరిస్థితుల్లో పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు. నిజానికి ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేయవలసి ఉంది. కానీ అలా జరగలేదు.

సిడ్కుల్ పోలీస్ స్టేషన్ అధికారి బుటోలా మాట్లాడుతూ,

"అనుమానితుడైన ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నాము. మాకు ఫిర్యాదు అందింది. విచారణలో కొన్ని విషయాలు తెలిశాయి. వందన కుటుంబానికి, ఘర్షణ పడ్డ వాళ్లకు మధ్య కుటుంబ తగాదాలు వున్నాయి. ఇది కులపరమైన గొడవ కాదని మా ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఆ మేరకు మాత్రమే కేసు నమోదు చేయబడుతుంది" అని తేల్చేశాడు.

నిజానికి టోక్యో ఒలింపిక్స్‌లో వందన చరిత్ర సృష్టించింది. వందన (4, 17, 49 వ నిమిషాలు) ఒలింపిక్స్ చరిత్రలో

హ్యాట్రిక్ సాధించిన తొలి భారతీయ మహిళా హాకీ క్రీడాకారిణిగా అరుదైన ఘనతను సాధించింది.

ఒలింపిక్స్‌లో భారత మహిళల హాకీ జట్టు క్వార్టర్‌ఫైనల్స్ ఆశలను సజీవంగా ఉంచింది. తప్పక గెలవాల్సిన చివరి గ్రూప్ మ్యాచ్‌లో దిగువ ర్యాంక్ దక్షిణాఫ్రికాపై 4-3 తేడాతో విజయం సాధించడానికి ఆమె తోడ్పడింది.

వందనకు ఫోన్లో శేఖర్ ఈ విషయాన్ని చెప్పాడు. అంతకు ముందే ప్రధానమంత్రి మోడీ హాకీ జట్టుతో మాట్లాడారు. అప్పుడు టీమ్ ఓడిపోయిందనే బాధతో వందన ఉద్వేగంతో బాగా ఏడ్చింది.

వందన 15 ఏప్రిల్ 1992, ఉత్తర ప్రదేశ్‌లో, హరిద్వార్ జిల్లా, రోష్‌నాబాద్‌లో జన్మించింది. (ప్రస్తుతం ఈ గ్రామం ఉత్తరాఖండ్‌లో వుంది). ఆమె తండ్రి నహర్ సింగ్ , హరిద్వార్‌లోని బిహెచ్ఇఎల్ మాస్టర్ టెక్నీషియన్‌గా పనిచేసేవాడు. గత రెండు సంవత్సరాలుగా భారతదేశానికి అత్యంత మెరుగైన, విలువైన హాకీ క్రీడాకారిణిగా ఆమె రాణిస్తోంది.

2021 వేసవి ఒలింపిక్స్‌లో, ఆగస్టు 6, 2021 శుక్రవారం మహిళల హాకీ పోటీ జరిగింది. కాంస్య పతక మ్యాచ్‌లో బ్రిటన్‌పై గోల్ చేసిన తర్వాత వందన తన సహచరులతో విజయోత్సవాన్ని జరుపుకుంది. ఆ ఆనందం కొన్ని రోజుల్లోనే ఆవిరైపోయింది. తీవ్రమైన పోటీని కనబరిచినా వాళ్ళు అర్జెంటీనా టీంతో ఓడిపోవాల్సి వచ్చింది. తమ్ముడు శేఖర్ ఫోన్ చేసి విషయం చెప్పినప్పటి నుండి వందన మరింత కృంగిపోయింది.

ఒలింపిక్స్ క్రీడా మైదానం నుండి వందనా టీం వాళ్ళ విడిదికి వచ్చే క్రమంలో మీడియా వారు ఆమెను వెంబడించి మరీ అడిగారు.

"శుక్రవారం జరిగిన కాంస్య పతకం ప్లేఆఫ్ మ్యాచ్‌లో బ్రిటన్‌పై భారత్ 3-4 తేడాతో ఓడిపోయింది. మూడు గోల్స్‌లో ఒకదాన్ని మీరు చేశారు. అటువంటి మిమ్మల్ని మీ స్వగ్రామంలో కొంతమంది దూషించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?"

భారత్‌లో ఉండే కుల దురహంకారం గురించి టోక్యో మీడియాకు తెలియకపోవచ్చు. అగ్రకుల మతోన్మాదులు భారత్‌లో జరిపే కుల దాడుల విధానాన్ని చెప్పి వందన భారత్ పరువు తీయదలుచుకోలేదు.

"ఈ సంఘటన గురించి విన్నాను. కానీ ఇంకా నా కుటుంబంతో మాట్లాడలేదు" అని అబద్ధం చెప్పింది.

"మీరు ఏమైనా సందేశం ఇవ్వాలనుకుంటున్నారా" ఒక విలేకరి ప్రశ్నించాడు.

దానికి 26 ఏళ్ల వందన ఇలా చెప్పింది "దేశం కోసం ఆట ఆడాం. హాకీ గురించి మాత్రమే ఆలోచించండి. ఇక్కడ యువతులు ఉన్నారు. మేము దేశం కోసం ఆడుతున్నాం. కాబట్టి కులమత బేధాలు లేకుండా మనం ఒక్కటిగా ఉండాలి".

"నేను ఇక్కడికి వచ్చినప్పటి నుండి నా ఫోన్ స్విచ్ ఆఫ్ చేసాను. కాబట్టి నేను ఎవరితోనూ మాట్లాడలేదు. నేను వారితో మాట్లాడినప్పుడు, ఈ సంఘటనపై నేను వ్యాఖ్యానిస్తాను," విలేకరులు తరచూ అడిగే ఒకే ప్రశ్నకు ఆమె సమాధానం చెప్పింది.

టోక్యో నుండి వచ్చేటప్పుడు వందన, రంజిత విమానంలో పక్కపక్కనే కూర్చున్నారు. వందన నిశ్శబ్దంగా ఉండటాన్ని రంజిత గమనించింది. వందన మౌనానికి అర్థం కూడా రంజితకు తెలుసు. కొంచెం ఏదైనా మాట్లాడి వందన మనసుని యధాతథ స్థితికి తీసుకురావాలని రంజిత ప్రయత్నించింది.

"చూడు వందన. దళితుల చేతితో నీళ్ళు తాగడానికి నిరాకరించిన ఈ దేశంలోని పెద్ద మనుషులు ఈ రోజు ఒక జంతువు మూత్రం సంతోషంగా తాగుతున్నారు. కాబట్టి వారి ప్రేలాపనలను పట్టించుకోవాల్సిన అవసరం లేదు" రంజిత చెప్పింది.

"ప్రతిభకు ముఖం లేదని మనం అనుకున్నాం. కానీ ఈ దేశంలో ప్రతిభకు కులమనే ముఖం ఉంది. వ్యక్తిగత సంతోషాలను, కుటుంబ జీవితాన్ని పణంగా పెట్టి దేశం కోసం మనం ఆడుతున్నాం. ఇంకా వాళ్ళు మనల్ని ఎందుకు అర్థం చేసుకోవడం లేదు" వందన ప్రశ్నించింది. మళ్లీ వందనే మాట్లాడుతూ

"ప్రపంచంలో సుమారు 192 దేశాలున్నాయి. అందులో 750 కోట్ల జనాభా ఉంది. వీరికి 4200 మతాలున్నాయి. అయితే ఇందులో ఏ ఒక్క మతమూ మనుషులంతా సమానులని చెప్పలేకపోయింది. పోనీ సమానులుగా ఉంచలేకపోయింది. దానికి కారణమేమిటీ? అని ఇకనైనా మనం ఆలోచించుకోవాలి కదా?" మాట్లాడుతున్నప్పుడు ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"నేను నీకు తెలుసు. నేను పెద్దగా మాట్లాడేదానిని కాదు. నేను సాధారణంగా నా పట్ల గౌరవభావాలను చూపేవారినే నాతో మాట్లాడటానికి అనుమతించాలనుకుంటాను. ఇది నా తండ్రి మార్గం. అతను అలా నాకు నేర్పించాడు. నేను అలానే పెరిగాను. కాబట్టి నేను ఎంత ఉన్నత స్థితిలో వున్నా అణకువగానే వుంటాను. గత దశాబ్దంగా నువ్వు నాతో పంచుకున్న స్నేహం, ప్రేమ నాకు తెలుసు. నా జీవితంలో నన్ను మనిషిగా చూడని సంఘటనలు చాలా ఉన్నాయి. కొన్ని సంవత్సరాల క్రితం నేను అనుభవించిన ఒక బాధాకరమైన సంఘటన గురించి నీకు చెప్తాను. నేను జీవించినంత కాలం దాన్ని నేను ఎప్పటికీ మర్చిపోలేను"

"నా కజిన్ జితేంద్ర, నేను ఒక అగ్ర కులస్తుల పెళ్ళికి వెళ్ళాం. అప్పుడు నాకు 16 సంవత్సరాలు. తనకి 21 ఏళ్లు ఉంటాయి. జితేంద్రను ఆ పెళ్లివారు పిలిస్తేనే మేము వెళ్ళాము. భోజనాలు తినే సమయంలో మేము అందరి లాగే టేబుల్ ముందర కుర్చీల్లో కూర్చున్నాం. మారుమూల ప్రాంతాలైన, మా లాంటి గ్రామాల్లో వివక్ష ఎక్కువగా ఉంటుంది. చాలా మంది అగ్రకులస్తులు హిందూ కుల శ్రేణికి దిగువన ఉన్న దళితులు తయారుచేసిన ఆహారాన్ని తాకరు"

మంచినీళ్లు తాగడానికి వందన కొంచెం సేపు ఆగింది.

"భోజనం వడ్డిస్తున్నప్పుడు గొడవ జరిగింది. కుర్చీపై ఎవరు కూర్చున్నారనే దానిపై వివాదం చెలరేగింది. కులం పేరుతో తిడుతూ మా అన్న జితేంద్రను వాళ్ళు కొట్టారు. మా ముందే కుర్చీలో కూర్చుంటావా? కుర్చుంది కాక మాతో పాటే తింటావా? అని కొట్టారు. మేమిద్దరం భయంతో లేచి వస్తుంటే మళ్ళీ దారి

"భారతదేశంలో ఉన్న ఒక పిల్లవాడిని మన జాతీయ ఆట ఏమిటి అని అడుగు. క్రికెట్ అని సమాధానం చెప్పే అవకాశం 75 శాతం ఉంది. ఎందుకంటే ఇక్కడ క్రికెట్ దాదాపు ఒక మతం లాంటిది. హాకీ గురించి ఎవరూ పట్టించుకోరు."

నిజమేనని వందన తలూపింది.

"టోక్యోలో జరిగిన ఒలింపిక్స్ క్రీడల్లో షాట్‌పుట్‌లో అమెరికా అథ్లెట్, రజతపతకం సాధించింది. వివక్షలకు వ్యతిరేకంగా ఒలింపిక్స్ క్రీడల పోడియం మీద నిల్చొని రెండు చేతులు పైకెత్తి నిరసన తెలిపింది. ఆ విధంగా మనం తెలిపితే దేశం పరువు పోదూ" రంజిత అంది.

"కులమా అదెక్కడుంది?" అని అందరూ అంటున్నారు. కుల సమస్య భారత సరిహద్దు దాటి బైటకు పోవద్దని రాజకీయ నాయకులు చెప్తున్నారు" వందన ఆవేశంగా అంది.

కాఛి కొట్టారు. అతని శరీరమంతా గాయాలఅయ్యాయి. అతను మాట్లాడటానికి ప్రయత్నించాడు. కానీ ఆ పని చేయలేకపోయాడు. నేను, మా వాళ్ళు కొంతమంది వెంటనే అతన్ని ఆసుపత్రికి తీసుకెళ్ళాం. అతను ఆసుపత్రిలో తొమ్మిది రోజుల తరువాత మరణించాడు. జితేంద్ర తండ్రి ఐదు సంవత్సరాల క్రితం మరణించాడు. అతని తల్లికి అతనే దిక్కు. చివరకి ఆమె అనాథ అయింది" చెప్పేటప్పుడు వందన కన్నీళ్లను ఖర్చీఫ్‌తో తుడుచుకుంది.

"ఆ తర్వాత కూడా కొంతమంది వ్యక్తులు మా ఇంటికి వచ్చి మమ్మల్ని భయపెట్టడానికి ప్రయత్నించారు. కేసు వెనక్కి తీసుకోమని బెదిరించారు. మాకు మద్దతు ఇవ్వడానికి ఎవరూ రాలేదు. కానీ న్యాయం కోసం పడే మా తపనను మేము ఎప్పటికీ వదులుకోలేదు."

రంజిత మౌనంగా వింటూ వుంది.

"నేను హాకీని అన్నింటికంటే ఎక్కువగా ప్రేమిస్తాను. అది నా రక్తంలో ఉంది. అది మా నాన్న వల్ల వచ్చింది. కానీ నిజం ఏమిటంటే, ఇలాంటివి నా కెరీర్‌లో, నా కుటుంబంలోని ప్రతి ఒక్కరి జీవితాల్లోనూ భారీ మార్పులకు గురిచేశాయి. మేము ఈ సమాజంలోనే మా జీవితాలను నిర్మించుకున్నాము. అయినా వెళ్లిన ప్రతిచోటా సమాజంలోని వివక్షను అనుభవించాల్సి వస్తోంది"

విమానంలో వున్న ఎయిర్ హోస్టెస్ వాళ్ళ దగ్గరికి కొన్ని కూల్ డ్రింక్సు, బిస్కెట్లు తీసుకొచ్చింది. తెచ్చి పెట్టుకున్న నవ్వుతో వాళ్లిద్దరూ కొన్ని తీసుకున్నారు. కొంచెం సేపటి తర్వాత వందనే మళ్ళీ అందుకుంది.

"కానీ అథ్లెట్‌గా, మంచి కోసం నేను ఎల్లప్పుడూ నా సంకల్పాన్ని కొనసాగించడానికి నా శక్తినంతా ఖర్చు పెట్టాను. హాకీ ఆట ఆడుతున్నందున వాళ్ళు నాతో మంచిగా ఉన్నారా. ఒక వ్యక్తిగా వారు నన్ను నిజంగా ఇష్టపడితే సంతోషమే. విభిన్న ధోరణులు కొన్నిసార్లు వెనక్కి లాగడం వల్ల కొన్ని సార్లు కులాన్ని గోప్యంగా ఉంచాల్సి వస్తోంది. మీరందరూ నాతో ఏర్పరచుకున్న సంబంధాలు మొదటి నుంచీ బలంగా ఉన్నాయి. ఇవే మంచి అనుభూతిని కలిగించాయి. ఎందుకంటే నేను ఇక్కడ ఉన్న సమయంలో, ముఖ్యంగా హాకీ ఆడే సమయంలో ప్రజల హృదయాలను తాకినట్లు అనిపిస్తుంది. మీ అందరికీ నేను మంచి వ్యక్తిగా ఉన్నానని నాకు తెలుసు. నా తండ్రి నుండి నేను నేర్చుకున్నది మరొక విషయం వుంది. బాధల్ని అధిగమించి జీవితంతో పోరాడటం"

"నువ్వు చెప్పింది అసలు నమ్మ బుద్ధి కావడం లేదే" రంజిత అంది.వందన మౌనంగా రంజిత కళ్ళలోకి చూసింది. రంజిత మాట్లాడటం ప్రారంభించింది.

"భారతదేశంలో ఉన్న ఒక పిల్లవాడిని మన జాతీయ ఆట ఏమిటి అని అడుగు. క్రికెట్ అని సమాధానం చెప్పే అవకాశం 75 శాతం ఉంది. ఎందుకంటే ఇక్కడ క్రికెట్ దాదాపు ఒక మతం లాంటిది. హాకీ గురించి ఎవరూ పట్టించుకోరు."

నిజమేనని వందన తలూపింది.

"టోక్యోలో జరిగిన ఒలింపిక్స్ క్రీడల్లో షాట్‌పుట్‌లో అమెరికా అథ్లెట్, రజతపతకం సాధించింది. వివక్షలకు వ్యతిరేకంగా ఒలింపిక్స్ క్రీడల పోడియం మీద నిల్చొని రెండు చేతులు పైకెత్తి నిరసన తెలిపింది. ఆ విధంగా మనం తెలిపితే దేశం పరువు పోదూ" రంజిత అంది.

"కులమా అదెక్కడుంది?" అని అందరూ అంటున్నారు. కుల సమస్య భారత సరిహద్దు దాటి బైటకు పోవద్దని రాజకీయ నాయకులు చెప్తున్నారు" వందన ఆవేశంగా అంది.

"అయినా నాకిచ్చిన కితాబులు కులం పేరుతో అవమానాలే కదా. దళితులు ఎంత ఎత్తుకు ఎదిగినా, ప్రపంచ క్రీడలకు వెళ్లి ప్రతిభ కనబరిచినా వారి ప్రతిభ వాళ్లకు కనబడదు. ఈ క్రూరత్వం నీడల్లే వెంటాడుతుంది" వందన బాధతో అంది.

"ఇప్పటివరకు ఒలింపిక్స్‌కు ఆడింది ఆధిపత్య కులాల మగవాళ్లే కదా. 24 ఒలింపిక్స్ క్రీడల్లో వేలసంఖ్యలో పోయి ఆడిన ఆధిపత్య కులాల మగవాళ్లు భారత్‌కు ఎన్ని ర్యాంకులు తెచ్చారు?" రంజిత అంది.

"అయినా నా మీద ఇంత దాడి జరిగితే ఏ క్రీడాసంఘాలూ ఖండించవు. సాటి క్రీడాకారిణిపై జరిగిన కుల దాడి మీద మాట్లాడరు. ఎఫ్ఐఆర్ నమోదు చేయమని కోరితే, ఇది కులవైరం కాదు, వ్యక్తిగత వైరమని పోలీసులు కేసు తీసుకోలేదు. కుల సమాజంలో కులం పేరుతో దూషించడం వ్యక్తిగత వైరమెట్లా అవుతుంది?" వందన ఆవేశంగా అంది.

"ఇంటిపట్టున ఉండే ఆడవాళ్లకు ఆటలెందుకు. కూలినాలి చేసే ఆడోళ్లకు ఆటలతో ఏం పనని వాళ్ళు అంటున్నారు. నాకు జరిగిన అవమానం మరే క్రీడాకారిణికి జరగకూడదు."

"నేను పెరుగుతున్నప్పుడు, నేను హాకీ ఆడటాన్ని పొరుగున ఉన్న చాలామంది ఇష్టపడలేదు. మా నాన్న ప్రోద్భలంతోనే నేను ఆడగలిగాను. మా నాన్న మరణించినప్పుడు, నేను ఒలింపిక్స్

కోసం శిక్షణ పొందుతున్నాను. అందువల్ల బెంగళూరులోని బయో బబుల్‌కి పరిమితమైపోయాను. కనీసం అంత్యక్రియలకు హాజరు కాలేదు" వందన ఆవేదనతో అంది.

"దక్షిణాఫ్రికాతో జరిగిన చివరి గ్రూప్ స్టేజ్ గేమ్‌లో నువ్వు హ్యాట్రిక్ సాధించినందుకు భారతదేశం చరిత్రలో మొదటిసారి నాకౌట్ రౌండ్‌లకు అర్హత సాధించింది. ఆ విషయం భారత ప్రజలందరికి తెలుసు. నువ్వు ఎవడో మాట్లాడే మాటలు పట్టించుకోవద్దే" రంజిత అనునయించింది.

"మీ నాన్నగారు నాకు చాలా సార్లు చెప్పారు. నువ్వు ఎంత కష్టపడి పైకి వచ్చావో. ముఖ్యంగా హాకీ అంతర్జాతీయ స్థాయిలో ఆడటానికి నువ్వు ఎంత కఠోర దీక్ష చేసావో, ఎంత కష్ట పడ్డావో చెప్పారు" రంజిత ఉద్వేగంగా అంది.

వందన ఇంటికి సమీపంలో ఉన్న ఆట స్థలంలో మొదటగా ఆటలు ఆడటం మొదలు పెట్టింది. అక్కడే వందన తన మొదటి కోచ్ కృష్ణ కుమార్‌ని కలిసింది. తర్వాత ఆమె ఉత్తరప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించింది. అతి త్వరలోనే ప్రొఫెషనల్‌గా మారింది. రాష్ట్ర స్థాయిలో ఆమె అండర్ -16 జాతీయ జట్టుకు ఎంపికైంది. ఇప్పుడు జాతీయ హాకీ జట్టులో ఒక ప్రముఖురాలిగా మారింది.

వీళ్ళు మాట్లాడుకుంటుంటే వీళ్ళతో పాటే విమానంలో ప్రయాణిస్తున్న ప్రముఖ భారతీయ విలేకరి వందన ఇంటర్వ్యూ కావాలని అడిగాడు. రంజిత, వందన ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. రంజిత లేచి విలేకరి కూర్చోవడానికి చోటు ఇచ్చింది. ఇక విధి లేని పరిస్థితిల్లో వందన ఇంటర్వ్యూ ఇవ్వడానికి సిద్ధపడింది. విలేకరి పెన్ను, పేపరు తీసుకుని మొదలుపెట్టాడు.

"మీ రోజువారీ శిక్షణ దినచర్య గురించి మాకు మరింత చెప్పండి"

"నేను రోజు మొత్తంలో ప్రాక్టీస్ చేసే సమయమే ఎక్కువగా ఉంటుంది. అయితే, కుటుంబంతో గడపడానికి నాకు సమయం లభించకపోవడం కొంచెం బాధగా ఉంటుంది."

"భారతదేశంలో పురుషుల, మహిళల హాకీల మధ్య నైపుణ్యాల వారీగా తేడా ఉందని మీరు అనుకుంటున్నారా?" విలేకరి అడిగాడు.

"నేను అలా అనుకోవడం లేదు. మహిళ, పురుషుడి కన్నా బలహీనంగా ఉండదు. మేము అదే సౌకర్యాలను పొందుతున్నాము. వాళ్ళ కన్నా మెరుగ్గా కూడా ఆడుతున్నాం" విలేకరి వైపు సీరియస్‌గా చూస్తూ వందన అంది.

"మహిళలకు కూడా ఒక ప్రొఫెషనల్ లీగ్ ఉండాలని మీరు అనుకుంటున్నారా?" విలేకరి చురుగ్గా చూస్తూ అడిగాడు.

"అవును, మాకు లీగ్ ఉండటం చాలా ముఖ్యం. ఇది జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించే తక్షణ అవకాశాన్ని, కొత్త ప్రతిభను వెలికితీసేందుకు సహాయపడుతుంది. మీరు చూసినట్లయితే, లీగ్‌లో ఆడే ఆటగాళ్లలో చాలామంది 5 సంవత్సరాలుగా జాతీయ జట్టులో ఆడటం లేదు. ఇది ప్రపంచంలోని అత్యుత్తమ ఆటగాళ్లకు మరింత ఎక్స్‌పోజర్‌ని కూడా అందిస్తుంది. తద్వారా మేము అంతర్జాతీయ స్టేజ్‌ల్లో స్థిరంగా ప్రదర్శన చేయొచ్చు"

"రాబోయే హాకీ ఆటగాళ్లకు మీరు ఏ సలహా ఇవ్వాలనుకుంటున్నారు?" విలేకరి ప్రశ్నల వర్షం కొనసాగించాడు.

"మీ కలను వదులుకోవద్దు. ఒక చిన్న హాకీ కెరీర్ కలిగి ఉండటం ఒక పెద్ద జీవితంతో సమానం. సవాళ్ళను అధిగమించి ముందుకు దూసుకుపోవడమే లక్ష్యంగా ఉండాలి"

"ఇప్పటివరకు మీ హాకీ కెరీర్‌లో మీకు ఇష్టమైన క్షణం ఏమిటి?" విలేకరి అడిగాడు.

"జర్మనీలో జరిగిన వరల్డ్ కప్‌లో మేము కాంస్య పతకం గెలిచాం. మా నాన్నను మీడియా పిలిచింది. మీడియాతో మాట్లాడేటప్పుడు అతని కళ్ళలో నీళ్లు తిరిగాయి. నా తండ్రిని గర్వపడేలా చేయడమే నా హాకీ కెరీర్‌లో అత్యుత్తమ క్షణం"

"మీపై కులపరమైన దూషణలు జరిగాయి కదా. దీనిపై మీ స్పందన ఏమిటి" విలేకరి నిదానంగా అడిగాడు.

"2020 వేసవి ఒలింపిక్స్‌లో టోక్యోలో నేను హాట్రిక్ సాధించాను. మొట్టమొదటి భారతీయ మహిళగా రికార్డు సృష్టించాను. అప్పుడు వాళ్లు మాట్లాడలేదు. సెమీఫైనల్స్‌లో భారతదేశం అర్జెంటీనా చేతిలో ఓడిపోయిన తర్వాత మా కుటుంబం కులపరమైన దూషణలకు గురైంది. వాళ్లకు మేము గెలిచి చూపిస్తాం. మా గెలుపే వాళ్ళ నోళ్లను మూయిస్తుంది" వందన స్థిరంగా అంది.

ఈలోగా విమానం భారత్‌లో లాండ్ అవుతుందనే ప్రకటన వెలువడింది. హాకీ టీమ్ అంతా తమ సామానులను సర్దుకున్నారు. ఢిల్లీలో దిగిన వెంటనే వారికి సాదర స్వాగతం లభించింది. వందన నాలుగు రోజుల తర్వాత స్వంత ఊరికి బయలుదేరింది.

వందన ఇంటికి వెళ్ళినప్పుడు, ఎల్లప్పుడూ ఘనమైన స్వాగతం ఉంటుంది. ఈసారి అలాగే జరిగింది. ఇంక పతకంతో తిరిగి వచ్చినప్పుడు గ్రామంలోని ప్రజలు డ్రమ్స్‌తో స్వాగతం పలుకుతారు. వందన భారత జట్టులో చేరిన తర్వాత ఆమె గ్రామం రోషనాబాద్, చుట్టుపక్కల అనేక గ్రామాలలోని చాలా మంది యువతులు హాకీ ఆటలో చేరారు. నిజానికి, ఆ ప్రాంతంలో హాకీ ఆటగాళ్లలో ఎక్కువ మంది అమ్మాయిలే.

వందన ఇంట్లోకి వచ్చిన తర్వాత వాళ్ల అమ్మ వందన కళ్ళల్లోకి గుచ్చి గుచ్చి చూసింది. అమ్మను గట్టిగా వాటేసుకుంది వందన.

"నేను చాలా కష్టపడి ప్రాక్టీస్ చేసాను. కానీ హాకీ ఆటలో నా స్థానాన్ని నిలుపుకోలేకపోయాను. మన కుటుంబం ఇబ్బంది పడిన సమయంలో నేను ఆత్మహత్య గురించి కూడా ఆలోచించాను. కాని నాన్న, నువ్వు గుర్తొచ్చి ఆగిపోయాను. ఆయన నా మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయదలుచుకోలేదు"

"నా చిట్టి తల్లీ అధైర్యపడకు. నేను నీ కోసమే బతికున్నా. ఈ రోజుతోనే అంతా అయిపోలేదు కదా. రేపటి విజయం నీదే. సరేనా. ఏదన్నా తిందురా. ఆకలికి అసలు ఉండలేవు నువ్వు" అంటూ సముదాయించింది.

అమ్మ స్పర్శ తగలగానే వందనలోని దిగులు, బాధ ఎవరో చేత్తో తీసేసినట్టు పోయింది. రెట్టించిన ఉత్సాహంతో వందన వెనకాలే వంటింట్లోకి వెళ్ళింది. ☆

లాల్ నీల్ ఐక్యత
అవకాశాలు - అవరోధాలు

పాణి

కమ్యూనిస్టు, దళిత బహుజన శక్తుల ఐక్యతా చర్చ ఎప్పటి నుంచో జరుగుతోంది. ఏదో ఒక స్థాయిలో ఆచరణ కూడా నడుస్తోంది. ఈ రెండూ ఇంకా చాలా ముందుకు పోవాలి. సందర్భానికి తగిన ఐక్యత సరిపోదు. దీర్ఘకాలిక ఐక్యతగా మారవలసి ఉన్నది. సమస్యలపై కలిసి పోరాటమే సరిపోదు. అంతకంటే విస్తృత ప్రాతిపదిక మీద పోరాటాలు నడపగల ఆచరణాత్మక ఐక్యతగా ఎదగవలసి ఉన్నది. ఈ విషయంలో ఇప్పుడు ఎవ్వరికీ ఇంకో అభిప్రాయం లేదు.

ఆ మాటకొస్తే ప్రజా పోరాట శక్తుల మైత్రీ చర్చ ఇప్పుడే మొదలు కాలేదు. విప్లవోద్యమంలో కార్మిక కర్షక విద్యార్థి మేధావి ఐక్యత వర్ధిల్లాలనే నినాదం చాలా ప్రముఖమైంది. అలాంటిదే.. విప్లవోద్యమాలు, జాతి విముక్తి పోరాటాల ఐక్యత. ఇవన్నీ కేవలం నినాదాలుగా మిగిలిపోలేదు. ప్రచండమైన ఆచరణశక్తిగా మారాయి. బహుశా ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రజాస్వామిక ఉద్యమాల్లో, విప్లవోద్యమాల్లో కూడా ఐక్యతా సూత్రం ఆచరణలోకి వచ్చింది. ఐక్యత దెబ్బతిన్న అనుభవాలు కూడా ఉండవచ్చు. అసలు ఐక్యత దిశగా అడుగులే పడని సందర్భాలూ ఉండవచ్చు. కానీ ఐక్యత ఒక ఆదర్శంగానేగాక అవసరంగా, అవగాహనగా ముందుకు వస్తూనే ఉన్నది. ఆయా స్థల కాలాల్లో ఐక్యం కావాల్సిన శక్తులేమిటో గుర్తించి ఏకం చేయడానికి అనేక ప్రయత్నాలు జరుగుతూ వచ్చాయి. అనేక వైరుధ్యాలు, చీలికలు, విభేదాలు ఉన్న సమాజంలోనే ఐక్యత కూడా ఉన్నదని మర్చిపోడానికి లేదు. అయినా ఐక్యతా అవసరాలు తీరకపోవచ్చు. అవరోధాలే ప్రధానమైనట్టు కనిపించవచ్చు. ఐక్యం కావాల్సిన శక్తులను గుర్తించడంలోనే లోపం జరిగి ఉండవచ్చు. కాబట్టే వాటిని లోతుగా పరిశీలించి పరిష్కారాలు వెతకాలి. మైత్రిని ఒక భావనగా, దృక్పథంగా కూడా చర్చించవచ్చు. కానీ అట్లాగే ఉన్నంత కాలం ఐక్యత సాధ్యం కాదు. ఐక్యతకు అవరోధాలేమిటో గుర్తించకుండా ఊరక దాని కోసం ఎంత కలగన్నా లాభం లేదు. ఐక్యతను ఇవ్వాళ్టి, రేపటి అవసరంగా గుర్తించాలంటే ముందు చరిత్రపట్ల గౌరవం ఉండాలి. దాన్ని అర్థం చేసుకొనే చూపు ఉండాలి. ఐక్యత కోసం చేసే ప్రయత్నం కూడా ఒక ఆచరణగా ఉండాలి. ఐక్యతా ప్రయత్నం దానికదే ఒక ప్రత్యేక కార్యక్రమం ఎన్నటికీ కాజాలదు. పోరాటాల మధ్యే మైత్రీ ప్రక్రియ సాగాలి. అప్పుడే ఆచరణాత్మక అవరోధాలు ఏమిటో తెలుస్తాయి. గతంలో జరిగిన లోపాలేమిటో తెలుస్తాయి. వాటితో ఎలా తెగతెంపులు చేసుకోవాలో తెలిస్తే ఇప్పుడు సోదర శక్తుల పట్ల మైత్రీ భావం ఎందుకు అవసరమో తెలుస్తుంది. అసలు మైత్రి అవసరమే పోరాటాల మధ్య తెలుస్తుంది. ఐక్యం కావాల్సిన పక్షాలకు అది అర్థమైనప్పుడే మైత్రీ భావం వాస్తవ రూపం దాల్చుతుంది. లేకుంటే పండిత చర్చగా మారిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే చాలా ఆచరణాత్మక విషయాలను 'పండితులు' సొంతం చేసుకున్నారు. దీన్నుంచి బైటికి వచ్చి చూడకపోతే ఐక్యత ఒక పవిత్ర ఆకాంక్షగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. మన దగ్గర కొన్ని శిబిరాల్లో పని తక్కువై మాటలు ఎక్కువయ్యాయి. అందుకే ఆచరణలో వచ్చే ఏ సమస్యలూ అర్థం కావడం లేదు. కమ్యూనిస్టు - దళిత శక్తుల ఐక్యత కూడా ఆచరణలో ఒక అవసరంగా ముందుకు రావాలి. అప్పుడే అవకాశాలేమున్నాయో తెలుతుంది. అందులోని అవరోధాలు తెలుస్తాయి. పరిష్కారాలు ముందుకు వస్తాయి.

'లాల్-నీల్ మైత్రి- నేటి చారిత్రక అవసరం' అనే పుస్తకం ఇటీవల విడుదలైంది. రేకా కృష్ణార్జునరావు దీన్ని సంకలనం చేశారు. లాల్ నీల్ ఐక్యవేదిక తరపున దీన్ని అచ్చేశారు. కమ్యూనిస్టు, అంబేద్కర్ సహచరుడు రామచంద్ర బాబా మోరేకు ఈ పుస్తకం అంకితం చేశారు. ఆయన గురించి చాలా మందికి తెలిసి ఉండకపోవచ్చు. కానీ ఆయన పాత్ర చారిత్రాత్మకం. ఇప్పుడు లాల్ నీల్ మైత్రి అనే ఆలోచనా ఒరవడిలో భాగంగా ఈ పుస్తక సంపాదకులు ఆయనుకు ఒక విశిష్టమైన గుర్తింపు తీసుకొచ్చారు. ఆశ్చర్యం ఏమంటే మన దగ్గర దళిత, విప్లవ శక్తుల ఐక్యత కోసం అనేక వైపుల నుంచి ప్రయత్నాలు జరిగినా బాబా మోరే పెద్దగా వెలుగులోకి రాలేదు. ఒక వ్యక్తి విస్మరణకు గురి కావడానికి అనేక కారణాలు ఉంటాయి. తిరిగి ముందుకు రావడానికి కూడా అనేక సందర్భాలు ప్రేరేపిస్తాయి. ఒక కొత్త ఆలోచన కొత్త ఆవిష్కరణకు దారి తీస్తుంది. విస్మరణకు కుట్రలు కూడా కారణం అయితే కావచ్చు. కానీ అవే సంపూర్ణ కారణం కాదు. కులం కారణం కాజాలని వ్యక్తులు కూడా విస్మరణకు గురి అయి ఉండవచ్చు. అన్ని వైపుల నుంచి చూడాలి. బాబా మోరే విస్మరణకు కారణాలేమోగాని ఆయన ముందుకు రాగల అవసరం ఇప్పుడు వచ్చింది. అలాంటి వాతావరణం ఏర్పడింది.

ఈ పుస్తకంలో ఇది మొదటి ఫోకస్ పాయింట్. దీన్ని సానుకూలంగా అర్థం చేసుకోగలిగితే లోపలి విషయాలను చేరుకోవడం తేలిక.

లాల్ నీల్ ఐక్యత కోసం ఆలోచించే ఒక వాట్సప్ గ్రూప్ నుంచి ఈ పుస్తకం విడుదలైంది. ఆ గ్రూప్ అవగాహన పత్రం కూడా ఇందులో ఉంది. మిగతా 36 వ్యాసాలు ఉన్నాయి. వాటిలో చాలా వరకు లాల్ నీల్ ఐక్యతా ఆకాంక్షను ప్రకటించుకోడానికే పరిమితం అయ్యాయి. ఆ స్ఫూర్తి విలువైనదే. కానీ ప్రత్యేకంగా చర్చించాల్సిన అంశాలు వాటిలో లేవు. ఓ ఐదారు వ్యాసాల్లో కొన్ని నిర్దిష్ట అభిప్రాయాలు ఉన్నాయి. వాటిలోకి వెళ్లే ముందు.. లాల్ నీల్ మైత్రి అవగాహన వెలుగులో ఈ పుస్తకం వినిపించిన కంఠ స్వరాన్ని పరిశీలించడం బాగుంటుంది.

మైత్రీ బంధం ఏర్పడాల్సిన లాల్ నీల్ శక్తులను ఈ పుస్తక రూపకర్తలు సమానులుగా గుర్తించారా? ఐక్యతను నెరపాల్సిన వారు ఆ శక్తులకు సమాన దూరంలోనే ఉన్నారా? అనే సందేహం కలుగుతుంది. కమ్యూనిస్టు పార్టీల, ఉద్యమాల లోపాలను తీవ్ర స్వరంతో ఈ పుస్తకం మాట్లాడుతుంది. వాళ్ల అవగాహనను, ఆచరణను అతిగా కుదించి చర్చిస్తుంది. కమ్యూనిస్టు ఉద్యమం ఆర్థిక కుదింపువాదానికి లోనైందని ఈ పుస్తకం అంటుంది. మన కమ్యూనిస్టులు మార్క్సిజాన్ని ఇండియాకు సృజనాత్మకంగా అన్వయించలేదని అంటుంది. కమ్యూనిస్టు ఉద్యమం పట్ల ఈ పుస్తక ప్రచురణ కర్తలకు గౌరవం ఉన్నట్లు కనిపిస్తుంది. అదే సమయంలో అసహనం కూడా వెల్లడి చేసుకున్నారు. ఒక సమాచారం, సూత్రీకరణ తప్పయినా పర్వాలేదు. కానీ ఏ గొంతుతో మాట్లాడుతున్నారనే దానికి కూడా ప్రాధాన్యత ఉంటుంది.



కమ్యూనిస్టు ఉద్యమానికి సృజనాత్మకత లేదని అంటున్నప్పుడు ఆ ఉద్యమం మీద చేసే ఏ పరిశీలనైనా సృజనాత్మకంగా ఉండాలి. పీడిత కులాలపట్ల కమ్యూనిస్టు ఉద్యమ వైఖరి ఏమిటో వాళ్ల ఆచరణలోంచి సృజనాత్మకంగా విశ్లేషించి లోపాలు చెప్పవలసి ఉంటుంది. ఇతరుల పని సృజనాత్మకంగా లేదు అనడం కాదు.. మన పని కూడా సృజనాత్మకంగా ఉండవలసిందే కదా. ఈ పుస్తకం కంఠస్వరం అలా లేదు. అందువల్ల చాలా అలవోక సూత్రీకరణలు కనిపిస్తాయి. ప్రొ. అబ్దుల్ నూర్‌బాషా రాసిన ముందుమాటలోనే ఈ ధోరణి కనిపించి ఆశ్చర్యపోతాం.

ఐక్యం కావాల్సిన ప్రజా శక్తులను మైత్రీవాదులు సమానంగా చూడాలి. అది ఐక్యతకు దోహదపడుతుంది. ఇరు వైపులా తాము తప్పులని అనుకున్నవాటిని ఒకే తీవ్రతతో చెప్పాలి. ఒకే కంఠస్వరంతో మాట్లాడాలి. ఐక్యంగా పని చేయాల్సిన వారు తమ లోపాలను గుర్తించలేకపోయారు కాబట్టి గుర్తింజేయడం మైత్రీవాదుల కర్తవ్యం. సుమారుగా ఈ మాట ఈ పుస్తక ప్రచురణ కర్తలే చెప్పుకున్నారు. అలా గుర్తింపజేయడం చాలా హేతుబద్ధంగా ఉండాలి. చారిత్రక అర్థంలో ఉండాలి. కానీ అది ఎంతో కొంత లోపించింది.

ఏ వ్యాసాల్లో ఈ సమస్య ఉన్నదీ చెప్పవచ్చు. అక్కడి దాకా పోనవసరం లేదు. ఈ పుస్తకం కంఠస్వరంలో ఇది ఉన్నదని గుర్తిస్తే చాలు. 'తగాదా పడుతున్నవాళ్లలో మధ్యవర్తులు ఎవరి పక్షాన ఎక్కువ మొగ్గు చూపారనే గిల్లికజ్జాల వ్యవహారం' కాదు ఇది. కమ్యూనిస్టుల లోపాలు ఎక్కువ చెప్పారని ఈ మాట అనడం లేదు. సరిగా చెప్పలేదనే కోపంతో అనడం లేదు. మైత్రిని కోరుకొనే వాళ్ల కంఠస్వరం ఎలా ఉండాలో మనకు తెలుసు. దానికి భిన్నంగా ఇందులో ఉందని చెప్పడమే ఉద్దేశం.

* * *

లాల్ నీల్ మైత్రి అంటున్నప్పుడు ఏ లాల్ గురించి ఈ పుస్తకం మాట్లాడుతున్నదో స్పష్టత లేదు. కమ్యూనిస్టు పార్టీలన్నీ, దళిత బహుజన శక్తులన్నీ ఐక్యతా దృక్పథాన్ని అలవర్చుకోవాలనే ఆకాంక్ష ఈ పుస్తకానికి ప్రాతిపదిక. దీంతోపాటు కమ్యూనిస్టు శక్తుల ఐక్యతా ఆకాంక్ష కూడా ఒక లైన్‌గా నడిచింది. ఈ రెండూ అవసరమైనవే. అయితే కమ్యూనిస్టుల మధ్య గాని, కమ్యూనిస్టులు - దళితశక్తుల మధ్యగాని ఎలాంటి మైత్రి ఉండాలో ఈ పుస్తకంలో లేదు. ఆ ఐక్యత ఎలా సాధ్యమో లేదు. మైత్రి వల్ల ఏం సాధించాలో నిర్దిష్టంగా లేదు. కమ్యూనిస్టు- దళిత శిబిరాలు ఐక్యంగా ఉండవలసిన శక్తులనే విషయం స్పష్టంగా ఈ పుస్తకం చెబుతుంది.

దీని గురించి సంకలనకర్త 'లాల్ నీల్ మైత్రి అనేది ఒక సిద్ధాంతం కాదు. అది ఒక ఐక్యతా దృక్పథం. లాల్, నీల్ శక్తుల మధ్య కొరవడిన ఐక్యతా దృక్పథాన్ని వారి దృష్టికి తేవడమే లాల్, నీల్ వాదుల లక్ష్యం' అన్నారు.

దీన్నే ఇంకొంత వివరంగా 'ఇది మూడు దశల కార్యక్రమం. ఒకటి: ఈ దృక్పథానికి సంబంధించిన విశాలమైన, శాస్త్రీయమైన ఆచరణీయమైన మైత్రీ అవగాహనను రూపొందించుకోవడం. రెండు: ఆ అవగాహన అన్ని లాల్ నీల్ ఉద్యమ శ్రేణులకు విస్తృతంగా చేరేలా చేయడం. మూడు: భావజాల పరంగా ఉన్న మైత్రి దృక్పథం భౌతికరూపాన్ని తీసుకొని ఆచరణలో అడుగులు వేసేందుకు లాల్, నీల్ ఉద్యమ శక్తులకు తోడ్పడటం.' అని రాశారు. వీటన్నిటి ద్వారా లాల్, నీల్ శక్తులు ఐక్యమై కుల నిర్మూలన, విప్లవం సాధించాలని కోరుకుంటున్నట్లు స్థూలంగా

అర్థమవుతుంది.

దీని మీదే కేంద్రీకరిస్తే ఆ రెంటినీ సాధించవలసిన శక్తుల మైత్రికి ప్రాతిపదికలు ఏర్పడతాయి. దానికి ఉన్న అవకాశాలు, అవరోధాలు తెలుస్తాయి. కమ్యూనిస్టు, దళిత బహుజన ఉద్యమాల్లో ఈ కర్తవ్యాన్ని సాధించగల శక్తులు ఏమిటో తేల్చుకోవడం కూడా తేలిక అవుతుంది. దేనికంటే కమ్యూనిస్టు శిబిరంలో విప్లవ (ఏ కాలంలో అయినా ఏదో ఒక మేరకు కుల నిర్మూలన లక్ష్యం లేని విప్లవ ఎజెండా ఉండిందా? అనేది పూర్తిగా వేరే ప్రశ్న) ఎజెండా, దళిత బహుజన శిబిరంలో కుల నిర్మూలన ఎజెండా అందరికీ ఒకేలా ఉన్నాయని అనుకోడానికి లేదు. కమ్యూనిస్టులైనంత మాత్రాన అందరూ విప్లవ లక్ష్యంతో ఉన్నారని అనుకుంటే పొరబాటవుతుంది. దీనికి సీపీఐ, సీపీఎంలే ఉదాహరణ. వాళ్లు కొన్ని దశాబ్దాలుగా ఆ మాటే అనడం లేదు. వాళ్లకు లేని లక్ష్యాన్ని వాళ్లకు అపాదించి దాని కోసం వాళ్లు పని చేయాలని కసరత్తు చేయడం దండగ. వాళ్లు కొన్ని ప్రజాస్వామిక విషయాలపై ఆందోళనలు చేస్తున్నారు. అంతే. వాళ్లు విప్లవ ఎజెండాను అందుకుంటే బాగుండని లాల్ నీల్ మైత్రీవాదులు కోరుకోవచ్చు. ఆ పని బైటి నుంచి చేయగలిగేది కాదు. లోపలి నుంచి జరగాలి. సీపీఐ, సీపీఎంలకు, నీల్ శక్తులకు మధ్య మైత్రి ఏర్పడాలని ఈ పుస్తక ప్రచురణ కర్తలు కోరుకుంటే దాని పరిధి ఏమిటో తెలిసి ఉండాలి. దళితులపై దాడులకు వ్యతిరేకంగా, దళితుల ఆత్మగౌరవ పరిరక్షణ కోసం, దళితుల హక్కులు, సంక్షేమం కోసం సీపీఐ, సీపీఎం-నీల్ శక్తులు కలిసి పని చేయడానికి మంచి అవకాశాలు ఉన్నాయి. అలాంటి ఆచరణ ఆ కమ్యూనిస్టు పార్టీలకు ఉన్నది. అదంతా కుల నిర్మూలనకు ఉపయోగపడేదే. కాబట్టి సీపీఐ, సీపీఎంలకు, నీల్ శక్తులకు మధ్య ఈ పరిధిలో మైత్రీ క్షేత్రం ఏర్పడటానికి సానుకూలత ఉంది. అలాగే మిగతా పోరాట శక్తులు కూడా అందులో భాగం కావడానికీ అవకాశం ఉంది.

అయితే కులనిర్మూలనకు ఒక దీర్ఘకాలిక స్పృహ అవసరం. అనేక సామాజిక రాజకీయార్థిక సాంస్కృతిక విషయాలతో ముడిపడిన విశాలమైన అవగాహన అవసరం. వాటి మీద ఆధారపడి సీపీఐ, సీపీఎం-నీల్ శక్తుల మైత్రీ బంధం కొనసాగాలనుకుంటే చాలా అంశాలు చర్చకు వస్తాయి. పైన చెప్పిన పనులు నిరంతరం చేయకుండా కుల నిర్మూలన సాధ్యం కాదు. అలాగే ఒక దీర్ఘకాలిక, సమగ్ర వ్యూహం లేకుండా కుల నిర్మూలన ఎన్నటికీ జరగదు. కుల నిర్మూలనా కార్యక్రమాలు చేపట్టడానికి వ్యవస్థ మార్పు షరతు కానక్కర లేదు. కానీ వ్యవస్థ మార్పుతో ముడిపెట్టకుండా కుల నిర్మూలన గురించి కల గనడం వల్ల ప్రయోజనం లేదు. ఈ విషయంలో సీపీఐ, సీపీఎంలకు-దళిత బహుజన శక్తులకు ఎంత ఏకీభావం ఉన్నది? అనేదాన్నిబట్టి వాళ్ల ఐక్యతా లక్ష్యం నెరవేరుతుంది.

అంటే ఐక్యతా అవకాశాల నుంచి ఐక్యత ద్వారా సాధించాల్సిన లక్ష్యం దాకా చర్చ వెళుతుంది. ఈ ఐక్యత కులనిర్మూలనను సాధ్యం చేస్తుందా? అనే ప్రశ్న ఐక్యతా అవకాశాలకు సంబంధించింది కాదు. విడివిడిగా అయినా కులనిర్మూలన విషయంలో ఆ రెండు శక్తులకు ఉండిన అవగాహన ఏమిటి? అనేదే అసలు సమస్య.

వ్యవస్థ మార్పు కోసం చేసే పోరాటాలు కుల నిర్మూలనకు దోహదం చేస్తాయని, అంతిమంగా కుల నిర్మూలన వ్యవస్థ మార్పుతో ముడిపడి ఉంటుందని, ఆ తర్వాత కూడా కుల వివక్ష రూపాలపై పోరాటం సాగవలసి ఉంటుందనే విషయంలో ఆ రెండు శిబిరాలకు ఎంత స్పష్టత ఉంటే అంత ఐక్యతా లక్ష్యం నెరవేరుతుంది. 'అదేమీ కాదు.. కులం రద్దు కావడానికి వ్యవస్థ మారడానికి ఏమీ సంబంధం లేదు. అవి రెండూ పూర్తి వేర్వేరు పనులు. వ్యవస్థను మార్చనవసరం లేకుండా, పార్లమెంటరీ మార్గంలోనే కులాన్ని రద్దు చేయగలం' అని ఉభయ కమ్యూనిస్టులు అనుకున్నా, దళిత శక్తులు అనుకున్నా ఇక సమస్యే లేదు. ఐక్యతా లక్ష్యం మాటేమోగాని ఐక్యతకు మంచి ప్రాతిపదిక ఏర్పడుతుంది.

అప్పుడు సీపీఐ, సీపీఎంలు కులాన్ని ఎంత సీరియస్‌గా తీసుకున్నాయి? దాని మీద పని చేయగల సున్నితత్వం ఎంత పెంచుకున్నాయి? ఎంత టైం వెచ్చించి పని చేస్తాయి? ఆ పని కోసం కలుపుకపోవాల్సిన వాళ్లను ఎంత కలుపుకపోతాయి? అనే ప్రశ్నలే మిగిలి ఉంటాయి. ఆ విషయాల్లో దళిత శక్తులు సంతృప్తి చెందేలా ఉంటే బలమైన మైత్రీ క్షేత్రం ఏర్పడ్డట్లే.

* * *

లాల్ శక్తులన్నీ కలవాలనే ఆకాంక్ష కూడా ఈ పుస్తకంలో ఉన్నది. కాబట్టి దాన్నీ పరిశీలించాలి. సాయుధ పోరాటం ద్వారా విప్లవం తేగల పరిస్థితులు లేవని ఈ పుస్తకంలో ఒక రచయిత అంటారు. అలాంటి నిర్ధారణకు కమ్యూనిస్టు శక్తులు అన్నీ వస్తే ఐక్యతకు అదొక ముఖ్యమైన ప్రాతిపదిక అవుతుంది. కానీ మార్క్సిస్టు లెనినిస్టు పార్టీలు అలా అనుకోవడం లేదు. విప్లవ శిబిరం అనేక పార్టీలుగా చీలిపోయి ఉన్నా ఈ విషయంలో ఏకాభిప్రాయం ఉంది. కాబట్టి సీపీఐ, సీపీఎంలు-ఎంఎల్ పార్టీలు కలవాలంటే ఎన్నికల మార్గం వల్ల అయ్యేదేమీ లేదని ఉభయ కమ్యూనిస్టుపార్టీలైనా అనుకోవాలి. ఇదేదో జరగకుండా ఐక్యత ఎలా సాధ్యం? పైగా ఈ పుస్తకంలో తేడాలు, విభేదాలు చిన్నవే అని, ఆశయాలు ఒకటే అని కూడా రాశారు. నిజమే కావచ్చు. ఎన్నికల మార్గంలో ఉన్న సీపీఐ, సీపీఎంల మధ్య కామన్ విషయాలు ఎక్కువ. విభేదాలు తక్కువ. కానీ విప్లవమే లక్ష్యంగా ఉన్నప్పుడు ఐక్యతకు పార్లమెంటరీ విధానం, ఎన్నికల మార్గం చిన్న విభేదం కాదు. ఈ విషయంలో వైఖరి చెప్పకుండా ఈ దేశంలో విప్లవం ఎలా రావాలనే దాని మీద సిద్ధాంత చర్చలు చేసే మార్క్సిస్టు మేధావులు చాలా మందే ఉన్నారు. వాళ్లు ఉభయ పార్టీల శిబిరంలోనే కాదు. విప్లవ శిబిరంలో కూడా అక్కడక్కడా ఉన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపట్ల వైఖరి ఒక్కటే గాక ఇంకా అనేక సిద్ధాంత సమస్యలు కమ్యూనిస్టుల మధ్య ఉన్నాయి. నిర్మాణ సమస్యలూ ఉన్నాయి. ముఖ్యంగా పొలిటికల్ కల్చర్ సమస్య ఉన్నది. ఇవగాక అనవసరమైన, అభ్యంతరకరమైన సమస్యలూ చాలా కాలంగా ఉన్నాయి. ఇవి సీపీఐ, సీపీఎంలకు- విప్లవ పార్టీలకు మధ్యే కాదు. విప్లవపార్టీల మధ్య కూడా ఉన్నాయి. అయినా సరే ఎన్నికల విషయంలో వైఖరి అనేది అతి ముఖ్యమైన సమస్య.

ఈ మాట అంటే... 'అదేమంత ముఖ్యం కాదు, అసలు

ప్రపంచ విప్లవోద్యమ అనుభవాలు ఈ విషయాన్ని తేల్చేశాయి, ప్రస్తుత విప్లవ యుగం చాలా కొత్తది, దానితో ఎన్నికలు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వంటి వాటిపై చర్చకు ప్రాసంగికత లేనేలేద'ని వాదించేవాళ్లు కూడా ఉన్నారు.

ఈ పుస్తకంలో ఈ వాదన అంతర్లీనంగా ఉంది. ఈ రచయితలే కాదు, కొంత మంది కమ్యూనిస్టు అభిమానులు పార్టీలన్నీ ఏకం కావాలని అంటూ ఉంటారు. ఇన్ని చీలికలు కావడం బాధాకరం. ఐక్యం కావాలనుకోవడం సంతోషకరం. రెండో మాటే లేదు. కానీ ఐక్యం కావడానికి మధ్యలో ఈ సమస్య ఉన్నదని పట్టించుకోరు. అంటే వాళ్లు ఐక్యతను సెంటిమెంట్‌గా చూస్తున్నట్లే లెక్క

కమ్యూనిస్టు పార్టీల మధ్య సిద్ధాంత విషయాల్లో అయినా పర్వాలేదుగాని, రాజకీయాల్లో.. అందునా ఎన్నికల విషయంలో భిన్న పంథాలు ఉన్నప్పుడు వాటి మధ్య ఐక్యత సాధ్యం కాదు. రాజకీయాలకు, ఆచరణకు కమ్యూనిస్టు ఉద్యమాల్లో అత్యంత ప్రాధాన్యత ఉంటుంది.

అయితే ఎన్నటికీ ఐక్యత సాధ్యం కాదన్నట్లా? ఇంత ముఖ్యమైన సమస్య ఉందని అనడమంటేనే ఐక్యతను తృణీకరించడమా? కానే కాదు. ఐక్యం కాగల అవకాశాలను కూడా గుర్తించాలి. సాయుధ పోరాటం చేసే నాలుగు విప్లవ పార్టీలు ఐక్యం కావడం మన కళ్లముందే జరిగింది. ఈ పుస్తక రచయితలు ఎవ్వరూ దాన్ని ప్రస్తావించలేదు. దాని వెనుక ఒక లోతైన అర్థం ఉంది. లాల్ నీల్ ఐక్యతను, ఇందులో భాగంగా కమ్యూనిస్టు పార్టీల ఐక్యతనూ కూడా కోరుకుంటున్నవారు ఎన్నికల మార్గంలో ఐక్యతను ఆశిస్తున్నారని భావించవచ్చు.

* * *

నిజానికి లాల్ నీల్ ఐక్యత చర్చ గత ముప్పై ఏళ్లుగా రెండు మూడు తలాల్లో సాగింది. ఒకటి: అంటరానితనం, వివక్ష, దళితులపై దాడులు, వాళ్ల ఆత్మగౌరవ పరిరక్షణ మొదలైన సమస్యలు నిత్యం దేశంలో అనేకం జరుగుతున్నాయి. వాటికి అడ్డుకట్ట వేయడానికి, తద్వారా దళితుల్లో చైతన్యం పెంచడానికి, అగ్రకులతత్వానికి కళ్లెం వేయడానికి కలిసిపని చేయడం. రెండు: విప్లవాన్ని, కుల నిర్మూలనను సాధించే దీర్ఘకాలిక కర్తవ్యాలతో కమ్యూనిస్టు, దళిత బహుజన శక్తులను ఐక్యం చేయాలనే ప్రయత్నం. దీనికి విప్లవ శిబిరంలోనే కొన్ని ప్రయోగాలు జరిగాయి. కొత్త నిర్మాణాలు ఏర్పడ్డాయి. కొత్త నినాదాలు ముందుకు వచ్చాయి. ఈ క్రమంలోనే మూడో తలంలో పని జరిగింది. అదే పూలే అంబేద్కరిజాన్ని, మార్క్సిజాన్ని కలపాలని ప్రయత్నించడం.

రెండో తలంలోకి కొందరు విప్లవ కమ్యూనిస్టులు, కొందరు దళిత బహుజన వాదులు వచ్చి కలిశారు. లేదా కుల నిర్మూలనకు, విప్లవానికి ఇంత వరకు సరైన కార్యక్రమం, సిద్ధాంతం, నిర్మాణం లేదని భావించిన విప్లవ కమ్యూనిస్టులు దళిత బహుజన ఉద్యమకారులతో కలిసి ఈ తలంలో కృషి ఆరంభించారు. ఇందులో భాగంగా ఒక చేత సాయుధ వర్గపోరాటాన్ని, మరో చేత ఎన్నికల రాజకీయాలను నడపాలని చూశారు. ఇదొక లాల్ నీల్ ఐక్యతా ప్రయత్నం. దీని కోసం బీఎస్పీలో చేరడం దగ్గరి నుంచి మహాజన పార్టీని స్థాపించడం దాకా చాలా ప్రయోగాలు చేశారు. ఇందులో రాజకీయ అర్థం ఒక్కటే లేదు. సామాజిక విముక్తి అర్థం కూడా ఉంది. కుల నిర్మూలనకు ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాన్ని అనుసరించాలనే దారిని తెరిచారు.

అయితే కొత్తదేమీ కాదు. కారంచేడు ఘటన జరిగాక మొత్తంగానే మన ఆలోచనారంగంలో మార్పులు వచ్చాయి. కులంపట్ల శ్రద్ధ పెరిగింది. ఇదొక గొప్ప పరిణామం. కానీ అతి కొద్దికాలంలోనే అంటరానితనం నిర్మూలన, దళితుల ఆత్మగౌరవ పోరాటం అనేవి దళితులకు రాజ్యాధికారం పేరుతో దళిత మహాసభ ఏర్పడింది. ఇది ఎన్నికల మార్గంలో ప్రయాణించింది. ఆ సమయంలోనే ఉత్తరప్రదేశ్ నుంచి కాన్షీరాం ఓట్లు మావి, సీట్లు మీవా? అనే నినాదం ముందుకు వచ్చింది. అది ఎన్నికల రాజకీయాలను ప్రభావితం చేసింది.

ఈ నేపథ్యంలో ఎన్నికలు, వర్గపోరాటం అనే జమిలి రూపంలో దళిత, విప్లవ శక్తుల ఐక్యత కోసం ఆంధ్రప్రదేశ్‌లో ప్రయత్నిస్తున్న శక్తులన్నీ బీఎస్పీ వైపు ఆకర్షింపబడ్డాయి. ఎన్నికల రాజకీయాల్లో అగ్రకులాలను నిలువరించేంత వరకు బీఎస్పీ నినాదం ప్రజాస్వామికమే కావచ్చు. కానీ కుల పోరాటాలు, వర్గ పోరాటాలు అన్నీ ఎన్నికల రాజకీయాల పరిధిలోకి వెళ్లిపోయాయి.

ఈ రాజకీయ పంథాను ముందుకు తీసికెళుతూ దానికి సమర్థనగా పూలే అంబేద్కరిజాన్ని, మార్క్సిజాన్ని సైద్ధాంతికంగా కలపాలని చూశారు. ఆ రెంటిలో సమానత్వ కాంక్ష ఉన్నది. ఆశయాల్లో, ఆదర్శాల్లో సారూప్యతలు ఉన్నాయి. వాటిని సాధించడానికి ఉమ్మడి పోరాటాలు చేయడానికి అవకాశం ఉంది. ఉమ్మడి నినాదాలనూ తయారు చేయడానికి వీలు ఉన్నది. కానీ ఆ రెండు సిద్ధాంతాలను కలపాలని చూశారు.

కానీ వాటి సంవిధానం వేర్వేరు. వాటిని కలిపి ఒక సంవిధానం తయారు చేయడమా? లేక ఏదో ఒక దాంట్లో రెండోదాన్ని కలపడమా? అసాధ్యమైన చిక్కులు చాలా ఉన్నాయి. కానీ కలపాలని చూశారు. దీనికి కుల నిర్మూలనపట్ల, విప్లవంపట్ల నిజాయితీతో కూడిన ఆకాంక్ష పని చేసి ఉండవచ్చు. లేదా సిద్ధాంతంపట్ల అనురక్తి పని చేసి ఉండవచ్చు. అయితే ఈ ప్రయత్నం వెనుక ఇండియాలో కులమే వర్గమని, మార్క్సిజమంటే అంబేద్కరిజమే అని, దళిత మార్క్సిజమని, మార్క్సిజం లెనినిజం అంబేద్కర్ ఆలోచనా విధానం అని, అంబేద్కరిజాన్ని కలపకపోతే ఇండియాలో మార్క్సిజం అసమగ్రం అని చాలా సూత్రీకరణలు ఉన్నాయి. ఇవి సిద్ధాంత విషయాలుగానే మిగిలిపోలేదు. రాజకీయ ఆచరణగా మారాయి. రాజకీయాల గొప్పతనం అదే.

దళిత విముక్తికి ఎన్నికల మార్గాన్ని సమర్థించుకోవడానికి ఇవన్నీ దారి తీశాయి. తెలిసి కానీ, తెలియకగాని మార్క్సిజాన్ని అంబేద్కరిజంతో రిప్లేస్ చేసే ధోరణిగా మారింది. ఈ పుస్తకంలో ఒక రచయిత ఏమంటారంటే .. మార్క్స్ కూడా తనకు ముందున్న, తన కాలపు సిద్ధాంతాలన్నిటినీ కలుపుకున్నాడు కదా? అప్పుడు మార్క్సిజంలో అంబేద్కరిజం ఎందుకు కలవదు? అని ప్రశ్నించారు. కలిపి ఏం చేయాలి?

ఎన్నికల రాజకీయాలు నడపాలా? అదే అయితే ఈ కలిపే పని లేకుండానే చేయవచ్చు కదా. కానీ రాజకీయంగా తీసుకొనే వైఖరుల వెనుక ఒక సిద్ధాంతం ఉండాలని కాస్త అవగాహన ఉన్నవాళ్లు ఎవరైనా అనుకుంటారు. వర్గపోరాట సిద్ధాంతం స్థానంలోకి మెల్లమెల్లగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేశారు.

మైత్రి ఎందుకో, ఐక్యత దేనికోసమో స్పష్టత లేదనడానికి ఇలాంటి సిద్ధాంత వైఖరులను కూడా ఈ పుస్తకం నుంచి ఉదాహరణగా ఎత్తి చూపవచ్చు. అట్లని దళిత బహుజన శక్తులన్నీ ఎన్నికల ఆచరణలో ఉన్నాయని చెప్పలేం. కానీ అంబేద్కర్‌లోని ఉదారవాద ప్రజాస్వామ్యం, ఆయన ఆధ్వర్యంలో సాగిన రాజ్యాంగ రచన, అభినవ అంబేద్కర్‌గా కాన్షీరాం ఎన్నికల రాజకీయాలపై వేసిన ప్రభావం మొదలైనవన్నీ ఒక భావజాల వాతావరణాన్ని తయారు చేశాయి. అందుకే దళిత నాయకులకు, మేధావులకు, రచయితలకు విప్లవోద్యమం మీద ఉన్న అసంతృప్తి లేదా ఆగ్రహానికి వేరే పెద్ద కారణాలేమీ లేదు. వాళ్లు పార్లమెంటరీ విధానాన్ని విమర్శించడం, వ్యతిరేకించడం, అందులో భాగంగా రాజ్యాంగానికి ఉన్న పరిమితులు చెప్పడం, రాజ్యాంగ యంత్రం మీద దోపిడీ శక్తుల ఆధిపత్యం ఉందని ప్రకటించడం, దోపిడీ రద్దే కాదు.. అంతిమంగా కులవ్యవస్థ రద్దు కూడా ఈ రాజ్యం ద్వారా సాధ్యం కాదని చెప్పడం వాళ్ల ఆగ్రహానికి కారణం.

అంటే పూర్తి రాజకీయ కారణం అన్నమాట. కమ్యూనిస్టు పార్టీలంటే అగ్రకుల పార్టీలనే మాటను దీనికి ఒక సామాజిక కోణంగా చేర్చుతున్నారు. నిజానికి దళిత నాయకులకు, విప్లవోద్యమానికి మధ్య సామాజిక సంఘర్షణ ఏమీ లేదు. ఉన్నా అది పైకి కనిపించేదే. అసలు సంఘర్షణ రాజకీయమైనది. దళిత మేధావి, రచయితలు అందరూ నేరుగా ఎన్నికల వ్యవహారంతో సంబంధం ఉన్న వాళ్లు కాకపోవచ్చు. పైగా బీఎస్పీపట్ల విమర్శ కూడా ఉండవచ్చు. కానీ మౌలికంగా వాళ్లందరూ రాజ్యాంగవాదులు. దళిత వాదంలో ఎన్నో విలువైన సామాజిక సాంస్కృతిక అంశాలు ఉన్నాయి. అవి మన మేధో రంగాన్ని చాలా ముందుకు తీసికెళ్లాయి. నిజానికి అంబేద్కర్‌ను కూడా లిబరల్ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగవాదానికి పరిమితం చేయకుండా ఆయనలోని సామాజిక విప్లవవాదానికి ప్రాధాన్యత ఇచ్చి ఉంటే దళిత శిబిరం ఇలా ఉండేది కాదు. విప్లవ శిబిరంతో ఘర్షణ ఉండేది కాదు. విచిత్రమేమంటే.. దళిత బహుజన శిబిరం అంబేద్కర్‌లోని లిబరల్ ప్రజాస్వామిక, రాజ్యాంగ కోణానికే అత్యంత ప్రాధాన్యత ఇస్తూ విప్లవశక్తులు ఆ మాట అనడం పట్ల ఆగ్రహంతో ఉంటాయి. ఇదొ వైరుధ్యం. అయితే అంబేద్కర్‌ను ఉదారవాద పార్లమెంటరీ ప్రజాస్వామ్య వాదిగానే దళిత బహుజన శిబిరం చూడటానికి కారణం.. రాజకీయంగా వాళ్లందరూ పార్లమెంటరీవాదులు. ఈ మాటను వాళ్లు అంత బాహాటంగా చెప్పుకోకపోవచ్చు. కానీ వర్గపోరాటం పట్ల, సాయుధ పోరాటం పట్ల వైఖరి తీసుకోవాల్సి వచ్చినప్పుడు మాత్రం నిజాయితీగానే రాజ్యాంగవాదం నుంచి విమర్శిస్తారు. ఇతరత్రా అంబేద్కర్‌లోని సామాజిక విప్లవవాదం గురించి సీరియస్‌గానే మాట్లాడుతున్నా ఈ రాజకీయ కోణం డామినేట్ చేస్తూ ఉంటుంది. అందుకే రాజ్యాంగ వాదాన్ని, పార్లమెంటరీ విధానాన్ని, ఎన్నికల రాజకీయాలను గట్టిగా విమర్శించి వర్గపోరాటాలను రాజీ లేకుండా నడిపే విప్లవకారుల పట్ల వాళ్లు ఎక్కువ ఘర్షణతో ఉంటారు. రాజకీయాలకు ఉండే బలం ఇదే. మిగతా విషయాల్లో దగ్గరిగా ఉన్నా రాజకీయాల దగ్గర మాత్రం స్పష్టంగా ఉంటారు. దూరంగా ఉంటారు. ఆ అర్థంలో దళిత బహుజన నాయకుల్లో రాజకీయ తీక్షణత ఎక్కువ.

అందువల్ల సహజంగానే వాళ్లలో రాజ్య వ్యతిరేకత ఉండదు. వర్గ సమస్యలకు దూరంగా ఉంటారు. ఇది లాల్ నీల్ ఐక్యతలో ఒక అవరోధంగా ఉంది. అట్లని విప్లవశక్తులకు కులం విషయంలో సంపూర్ణ అవగాహన ఉందని చెప్పాల్సిన పని లేదు. విప్లవోద్యమానికి కులం విషయంలో ఉన్న అవగాహన ఏమిటి? వాళ్ల ఆచరణ ఏమిటి? అనేది చాలా లోతుగా పరిశీలించాలి. విమర్శనాత్మకంగా ఉండాలి. మొదటి నుంచీ కాయితాల మీద ఏమున్నా విప్లవోద్యమ ఆచరణ ఎలా ఉన్నదో చూడాలి. అవగాహనలో, ఆచరణలో కూడా గత ముప్పై అయిదేళ్లుగా ఎలా స్పష్టత వస్తున్నదీ పరిశీలించాలి. ఈ విషయంలో సాధించిన పరిణతి ఏమిటో లెక్కలోకి తీసుకోవాలి. అయినా అదే సరిపోతుందని అనడానికి లేదు. పరిపక్వత సంతరించుకోవాల్సిందే. అయితే ఈ క్రమాన్నంతా ఆర్థిక వాదానికి కుదించేస్తున్నారు. నిజానికి ఇదే ఒక కుదింపు ధోరణి. కమ్యూనిస్టు విప్లవాచరణలోని వైవిధ్యాన్ని, వైశాల్యాన్ని ఉద్దేశపూర్వకంగానే పట్టించుకోకుండా ఆర్థికవాదానికి కుదించేస్తుంటారు. దీని వల్ల ఏ ప్రయోజనమూ ఉండదు. మార్క్సిస్టు పద్ధతిలో కులాన్ని ఎలా అర్థం చేసుకోవాలో ఇంకా ఇంకా సిద్ధాంత కృషి జరగవలసి ఉన్నదే. మరింత సూక్ష్మస్థాయిలోకి తీసికెళ్లవలసిందే. అంత మాత్రాన ఆర్థికవాదం అనే విమర్శకు హేతుబద్ధత ఉందని అంగీకరించలేదు.

ఒక వేళ కులం విషయంలో విప్లవోద్యమ ఆచరణ, అవగాహన దళిత బహుజన నాయకులు అంగీకరించే స్థాయికి చేరుకున్నా లాల్ నీల్ ఐక్యతకు అవరోధాలు ఉండవని అనుకోగలమా? దేనికంటే గత ముప్పై అయిదేళ్లుగా విప్లవోద్యమ అవగాహన చాలా రాడికల్‌గా మారింది. కానీ విప్లవోద్యమం పట్ల దళిత బహుజన శక్తుల వైఖరి అప్పటికీ ఇప్పటికీ ఏమీ మారలేదు. పైగా అదే కుదింపు ధోరణి నడుస్తోంది. అవే పాత మాటలు మాట్లాడుతుంటారు. దీనికి రాజకీయ పంథానే కారణం. రాజ్యాంగానికి సహితం సంఘ్‌పరివార్ ఎసరు పెడుతున్న సమయంలో రాజ్యాంగ విలువల పరిరక్షణకు అందరూ ప్రయత్నించాల్సిందే. దాన్ని చూపి రాజ్యాంగవాదానికి లోబడమంటే విప్లవకారులు సిద్ధం కాలేరు కదా. ఆ రకంగా కాబట్టి వాళ్ల వైపు నుంచీ ఈ విప్లవకర వైఖరి లాల్ నీల్ మైత్రికి అవరోధమే.

దీనికి ఇంకో సిద్ధాంతం తయారుగా ఉన్నది. 'రాజ్యాంగబద్ధంగా, ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో దళితులు(ఆ మార్గంలో దళితులకు దక్కవలసిన వాటి కోసం పోరాడాల్సిందే. దేనికంటే అవి దళితుల హక్కు కాబట్టి..) విముక్తి చెందడం విప్లవంలో ఒక దశ. అది పూర్తవ్వాలి. ఆ తర్వాత ఇంకో దశ. అప్పుడు వర్గపోరాటాల సంగతి చూసుకోవాలి' అనే సిద్ధాంతం చెప్పేవాళ్లు ఉన్నారు.

అప్పుడు లాల్ నీల్ ఐక్యత కోసం, మొదటి దశ విజయాలు సాధించడం కోసం విప్లవోద్యమం వర్గపోరాటాన్ని వదులుకోవాలి. ఎన్నికల మార్గంలోకి రావాలి. ఇదే మార్క్సిజం అని సూత్రీకరించాలి. దీని ప్రకారం మొదట లిబరల్ డెమొక్రసీని సాధించాలి. వ్యక్తి స్వేచ్ఛ, చట్టబద్ధ పాలన అమలు కావాలి. ఇదంతా దళితులకు రాజ్యాధికారం అనే ఎన్నికల మార్గంలో జరగాలి. అంబేద్కరిజం పేరుతో బూర్జువావాదం మార్క్సిజాన్ని రీ ప్లేస్ చేసే ప్రమాదం ఆచరణలో ఇలా ఉంటుంది. లాల్ నీల్ మైత్రి పర్యవసానంగా ఇది ఎలా జరిగినా తీరని అన్యాయమే.

నిజానికి విప్లవం దాకా కుల నిర్మూలనలాగే ఏ ఇతర ఉదారవాద ఆకాంక్షనూ వాయిదా వేయకూడదు. ఇదంతా విప్లవ క్రమంలో భాగమే. అందుకే విప్లవకారులు వ్యవస్థను మార్చే నినాదాల మీద ఎంత తీవ్రంగా వర్గపోరాటాలు నడిపారో, అంతగా ఉదారవాద విలువల కోసం ప్రజాస్వామిక పోరాటాలు నడిపారు. ఇంకా గట్టిగా చేయాల్సిందే. ఈ పరిధిలో అయినా విప్లవోద్యమంతో కుల నిర్మూలన కోసం దళిత బహుజన శక్తులు కలిసి పని చేయగలవా? దానికి తగినట్లు తమ వైఖరిని మార్చుకోగలవా? అనే ప్రశ్న తలెత్తుతుంది.

కొందరు విప్లవ మేధావులు కూడా ఇది ఉదారవాద ప్రజాస్వామ్యం కోసం పని చేయాల్సిన కాలం అనుకోవచ్చు. దళిత బహుజన శక్తులతో, ప్రజాస్వామిక శక్తులతో ఉదారవాద ప్రజాస్వామ్యం కోసం ఎంతదాకా అయినా పని చేయవచ్చు. విప్లవకారులకు అది విప్లవోద్యమంలో భాగం. కానీ విప్లవాచరణనంతా దశలవారీ వాదనతో లిబరలిజానికి కుదించాలనుకోవడం విప్లవోద్యమ పరిధిలో కుదరదు. అది విప్లవ శిబిరంలోనే ఐక్యతకు ఇంకో సమస్య అవుతుంది.

లాల్ నీల్ ఐక్యత ఆకాంక్షలో 'రెండు సిద్ధాంతాలతో ఏక పార్టీ ఏర్పాటు అనే అవగాహన లేదు' అని ఈ పుస్తకం వెనుక పని చేసిన వాట్సప్ గ్రూప్ అడ్మిన్ల బృందం రాశారు. నిజానికి అది చాల పెద్ద వ్యవహారం. అక్కడి దాకా వెళ్లడం కష్టమే. అయితే మైత్రి ఏర్పడ్డాక చేయవలసిన పని ఏమిటి? దానికి ఎలాంటి నిర్మాణాన్ని ఏర్పాటు చేసుకోవాలి? ఏ పోరాట రూపాలను చేపట్టాలి? ఏ నినాదాలను తయారు చేసుకోవాలి? అనే ప్రశ్నలు ఉన్నాయి. ఆ మేరకైనా ఐక్యతకు రెండు శిబిరాలకు ఇన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. ఇన్ని అవరోధాలు ఉన్నాయి. వాటి గురించి ఈ పుస్తకంలో కనీసమైన పట్టింపు కనిపించలేదు.

* * *

ఈ పుస్తకం ఒక ముఖ్యమైన విషయాన్ని ముందుకు తెచ్చింది. కానీ అందులో ఉన్న సమస్యలను గుర్తించి తగిన అవగాహనను ప్రకటించలేకపోయింది. ఆశయాలు, ఆదర్శాలు పని చేసే తలం ఒకటి ఉంటుంది. వాటిని సిద్ధాంతీకరించి, రాజకీయ కార్యక్రమం తయారు చేసుకొనే తలం ఇంకోటి ఉంటుంది. ఈ రెంటి కంటే కఠినమైనది వాటిని ఆచరించే తలం. వీటి గురించి ఆలోచించలేదు కాబట్టే..విచిత్రమైన సూత్రీకరణలు ఇందులో కనిపిస్తాయి. ప్రొ. నూర్‌బాషా 'అన్ని దేశాల్లో జరిగే దోపిడీ, పీడన, అణచివేత స్థూలంగా ఆర్థికపరమైనవే..' అంటారు. దీని ప్రకారం బైటి సమాజాల్లో సాంఘిక, సాంస్కృతిక పీడనలు, అణచివేత లేనట్టే. ఇది నిజమేనా? అంత శుద్ధ ఆర్థిక సమాజాలు ఉంటాయా? 'ఆర్థిక విమోచనకు ఇచ్చినంత ప్రాధాన్యం కుల నిర్మూలన దిశగా సాగాల్సిన పోరాటాలకు ఇవ్వకపోవడం, తమ సైద్ధాంతిక, ఆచరణాత్మక ఎజెండాలోకి దానిని ఇముడ్చుకోలేకపోవడం, వెరసి పీడిత వర్గాలకు, ముఖ్యంగా దళిత బహుజన వర్గాలకు వారు ఎడమైపోవడం నిష్టుర సత్యం. ఫలితంగానే ఈ దేశంలో దళిత, అస్పృశ్య, బహుజనులు తమను ఆత్మగౌరవంతో, సంపూర్ణ వికాసంతో ముందుకు నడిపించగలదనే విశ్వాసంగల మహాత్మా ఫూలే, పెరియార్, అంబేద్కర్ సైద్ధాంతిక ఆలోచనలను చేబూనినారు..' అని రాశారు.

కేవలం కమ్యూనిస్టుల వైఫల్యం వల్లే దళితులు మహాత్మా ఫూలే, పెరియార్, అంబేద్కర్ సైద్ధాంతిక మార్గానికి వెళ్లారని సరళ సూత్రీకరణ చేయడం ఆశ్చర్యం. సామాజిక పరిణామాల్లోని ఏ సంక్లిష్టతను, వాస్తవితా చలనాలను పరిగనలోకి తీసుకోకుండా అది జరిగింది కాబట్టి ఇది జరిగిందని అన్నారు. అసలు కమ్యూనిస్టుల 'వైఫల్యాన్ని' ఆయన నిష్టుర సత్యంగా ప్రకటించారేగాని వాస్తవం ఏమిటో చెప్పి వాటికి ఉన్న పరిమితులు చెప్పాలనుకోలేదు.

డి. హనుమంతరావుకు అయితే కమ్యూనిస్టు విప్లవకారులు చెప్పే అన్యవర్గ భావజాలాన్ని విడనాడుదాం అనే మాటే నచ్చలేదు. దాన్ని ఆయన 'అందరికీ దూరమవుతూ ఒంటరితనాన్ని కోరి తెచ్చుకొనే ఆత్మహత్యా ధోరణి' అనుకున్నారు. అన్యవర్గ ధోరణులు అంటే ఫ్యూడల్, బూర్జువా ధోరణులని, పెత్తందారీతనం, అహంభావం, ఒంటెత్తుపోకడ, పితృస్వామ్యం.. ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని కమ్యూనిస్టులు అంటారు. ఇందులో ఆయనకు ఏం తప్పు కనిపించిందో అర్థం కాదు. 'గుజరాత్ నుంచి జిగ్నేష్‌మేవాని గెలుపులో లాల్ నీల్ ఐక్యత ధ్వనించింది' అని ఆయన రాశారు. హనుమంతరావే కాదు, చాలా మంది జిగ్నేష్ విషయంలో ఇదే అభిప్రాయంతో ఉన్నారు. ఒక పక్క ప్రజా క్షేత్రంలో దళితుల విముక్తికి సమరశీల పోరాటాలు, ఇంకో పక్క పార్లమెంటరీ ఎన్నికల మార్గంలో ప్రభంజనం అని కవితాత్మకంగా చెప్పిన పెద్దలు ఉన్నారు. వీళ్లలో మార్క్సిస్టులు కూడా ఉన్నారు. కానీ ఆయన ఆచరణను ఎమ్మెల్యే కావడానికి ముందు, తర్వాత కూడా నిశితంగానే పరిశీలించవచ్చు. పైగా ఇప్పుడాయన కాంగ్రెస్‌లో చేరబోతున్నాడనే వార్తలు వస్తున్నాయి. అదేమీ ఆశ్చర్యకరం కాదు. చేరడం, చేరకపోవడం కాదు. అదే లాల్ నీల్ ఐక్యత అనుకుంటే ఆ సంగతి స్పష్టంగా చెబితే మిగతా సిద్ధాంత చర్చలు, చరిత్రను తొవ్విపోయడం పెద్దగా తక్షణ అవసరం కాదు కదా.

ఈ పుస్తకంలో ఒక సిద్ధాంత విమర్శ ధార నేరుగా, అంతర్లీనంగా కనిపిస్తుంది. అదేమంటే పునాది-ఉపరితం చర్చ. కమ్యూనిస్టులు కులాన్ని ఉపరితలంగా చూశారనే వాదన ఈ పుస్తకంలో ఉంది. తెలుగు వెంకటేశ్ తన వ్యాసంలో 'పునాది-ఉపరితలం చట్రాన్ని దాటి కులాన్ని అర్థం చేసుకోడానికి ముందుకు రాలేకపోతున్నా'రని అన్నారు.

ఇది చాలా వివరంగా చెప్పాల్సిన విషయమే. నిజానికి పునాది-ఉపరితలం అనే సంవిధానాన్ని మొదట్లో కార్యకర్తల స్థాయిలో సరళంగా చెప్పినమాట, రాసిన మాట వాస్తవమే. అలాగే

మార్క్సిస్టు పద్ధతి అంటే పునాది - ఉపరితల చర్చ అనేదాకా వెళ్లిన మాట నిజమే. ఈ ధోరణిని గుర్తించినట్లే, దీనికి భిన్నమైన ధోరణిని కూడా గుర్తించాలి కదా.

ఉదాహరణకు 1973 నాటికే విప్లవోద్యమం రాసుకున్న వ్యవసాయక విప్లవం డాక్యుమెంట్‌లో కులాన్ని పునాది-ఉపరితలం పద్ధతిలో చర్చించలేదు. ఆ మాటకొస్తే విప్లవోద్యమం ఆరంభమయ్యాక గ్రామాన్ని, మాల మాదిగ వాడలను కేంద్రం చేసుకొని, కుల సాంఘిక సాంస్కృతిక ఆధిపత్యాలపై అసమానతలపై పని చేసిందేగాని కులం పునాది అనీ చెప్పలేదు. ఉపరితలం అనీ చెప్పలేదు. పైన చెప్పిన డాక్యుమెంట్‌లో కులం సామాజిక సాంఘిక ఆధిపత్య సంబంధాలలో, గ్రామ వ్యవస్థ నిత్య జీవితంలో ఎలా పని చేస్తుందో వివరించారు. అక్కడి నుంచి గ్రామం మీద పెత్తనం, భూమి మీద అధికారం, దోపిడీ మొదలైనవన్నీ విశ్లేషిస్తారు. అందులో పునాది ఉపరితలం పద్ధతి అనుసరించలేదు. కులాన్ని సామాజిక నిర్మితి వైపు నుంచి చూశారు.

దీనికితోడు ఆ తర్వాత పునాది-ఉపరితలం పద్ధతిలో కూడా విశ్లేషించారు. కులాన్ని, అంటరానితనాన్ని అనేక వైపుల నుంచి చూసి పునాదిలో కూడా దానికి మూలాలు ఉన్నాయని చెప్పారు.

అలాగే వెంకటేశ్ వ్యవస్థ-సమాజం అనే చర్చ చేశారు. ఒక పద్ధతిగా ఇది మంచిదే. ముఖ్యంగా దేశంలో పూర్తిగా పెట్టుబడిదారీ అభివృద్ధి జరిగిందనే వైఖరితో కులాన్ని, పితృస్వామ్యాన్ని చూడటానికి ఇది పనికి వస్తుంది. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ఏర్పడ్డా ఇంకా ఈ కులం వంటివి ఎందుకు ఉన్నాయి? అనే ప్రశ్నకు సమాధానం చెప్పుకోడానికి ఇది పనికి వస్తుంది. దీని ప్రకారం కులానికి.. పెట్టుబడిదారీ విధానానికి ఏ సంబంధం లేదు. ఇదేమో వ్యవస్థ, అదేమో దానికి ఆవల ఉన్న సమాజం. అక్కడ దానికి వేల ఏళ్ల మూలాలున్నాయి. అందువల్ల కులం ఇంకా బతికే ఉంది. దానికి వ్యతిరేకంగా శక్తివంతమైన సామాజిక పోరాటాలు చేయాలి. వ్యవస్థలోని దోపిడీని రద్దు చేయడానికి విప్లవం చేయాలి.. అనే వాదన ఈ పద్ధతి నుంచి వస్తుంది.

కానీ వ్యవస్థ, సమాజం రెండు వేర్వేరు ద్వీపాలు కావు. అవి దేనికదే విడిగా ఎక్కడెక్కడో పుట్టినవి కాదు. దేనిమానాన అది పెరిగి, వేర్వేరు తర్కాలతో పని చేస్తూ కొనసాగుతున్నవి కాదు. ఆ రెంటి మధ్య పరస్పర సంబంధం, ప్రభావం ఉంటాయని వెంకటేష్ అన్నారు. అంత వరకేనా? కేవలం ప్రభావాల సంబంధమే ఉంటుందా? ఈ పద్ధతి ప్రకారం కులం 'సమాజం'లోనిది అయితే దానికి ఉత్పత్తి వ్యవస్థతో నేరుగా ఏ సంబంధమూ ఉండదా? కులాన్ని ప్రత్యేక సమస్యగా చూడాల్సిన పని లేదు.. కులం ఉత్పత్తి వ్యవస్థలోని సమస్య మాత్రమే.. అనే పాత వాదనకు ఉత్పత్తి వ్యవస్థతో ఏ సంబంధం లేని సమాజంలో కులం భాగం అనే ఈ వాదన తిరగేసిన రూపం కాదా? ఒక వేళ ఇది పెట్టుబడిదారీ వ్యవస్థ అనుకున్నా.. కులానికి ఆ 'వ్యవస్థ'తో ఏ సంబంధం లేదని, కేవలం 'సమాజాని'కి సంబంధించినదే అని ఎందుకు అనుకోవాలి? దాని తర్కం ఏమిటి? కులంతో ప్రభావ సంబంధం తప్ప మరేమీ లేని శుద్ధ పెట్టుబడిదారీ వ్యవస్థ ఏర్పడిందని ఎలా అనుకోవాలి? అసలు ఇట్లాగాక ఇంకా అర్ధ భూస్వామ్య ఉత్పత్తి సంబంధాలు ఉన్నాయని అనుకునే వాళ్లకు ఈ వ్యవస్థ-సమాజం అనే పద్ధతి ఎలా ఉపయోగపడుతుంది? వ్యవస్థ-సమాజం అనే పద్ధతి పునాది-ఉపరితలం, సామాజిక నిర్మితి అనే పద్ధతులకంటే కులాన్ని అర్థం చేసుకోడానికి కొత్తగా ఏ వెసులుబాటును అందిస్తుంది? 'వ్యవస్థ' తనదైన ఆర్థిక తర్కం ప్రకారమే నడుస్తోందని, ఆర్థిక విషయాలకు కులానికి ఏ సంబంధం లేదని నిరూపించడం సాధ్యమేనా? కులం ఎలా పని చేస్తున్నదో గతం కంటే మనింత బాగా అర్థమవుతున్న సమయంలో దాన్ని సామాజిక సమస్యగానే కుదించినట్లు కాదా? అనే ప్రశ్నలు ఎన్నిటినో ఈ వాదన ముందుకు తీసుకొస్తుంది.

అవన్నీ పూర్తిగా విప్లవ శిబిరానికి సంబంధించినవి. ఈ విషయంలో అక్కడ స్పష్టత వచ్చినంత మాత్రాన అదెలా లాల్ నీల్ మైత్రికి దోహదం చేస్తుంది? అనేది తక్షణ ప్రశ్న.

అలాగే 'సామాజిక ఉద్యమాల నుంచి కమ్యూనిస్టు ఉద్యమాలు అవసరమైనంత నేర్చుకోలేకపోతున్నాయ'ని అయన అన్నారు. అదే జరిగితే నష్టమే. ఈ కంప్లయింట్ దళిత బహుజన ఉద్యమకారులకు కూడా ఉంది. ఏది నేర్చుకోవాల్సి ఉంది? అనేది నిర్దిష్టంగానే చర్చించాలి. బహుజన ఉద్యమకారులైతే చాలా సందర్భాల్లో దళితుల రాజ్యాధికార స్వాధీనంలో విప్లవకారులు కూడా భాగం కావాలని అంటున్నారు. పోనీ ఇన్నేండ్ల సంఘర్షణలో, ఉమ్మడి ఆదర్శాలు, ఆకాంక్షల వెలుగులో దళిత బహుజన శక్తులు విప్లవోద్యమం నుంచి ఏం నేర్చుకున్నాయి? ఈ ప్రశ్న ఎందుకు అడగకూడదు? విప్లవమనే అతి పెద్ద కర్తవ్యం ముందుంది కాబట్టి ఎవ్వరినీ ఏమీ అడగకూడదనుకొంటే మైత్రికి అర్థమే ఉండదు. అసమానుల మధ్య మైత్రి తిరిగి ఆధిపత్యానికి దారి తీస్తుంది కదా? మైత్రిలో షరతులు ఉండకూడదు. ముఖ్యంగా విప్లవంలో అత్యంత చోదకమైన దళిత బహుజనులతో అసలే ఉండకూడదు. కానీ మైత్రి నెలకొనడానికి అవసరమైన సమానతను సాధించే దిశగా ఎవరు ఎవరినైనా ప్రశ్నించవచ్చు.

* * *

లాల్ నీల్ ఐక్యతా ప్రయత్నాలు అనేక తలాల్లో ఇప్పటికే జరుగుతోంది. దానికి ఎన్ని అవకాశాలు ఉన్నాయో అన్ని అవరోధాలు కూడా ఉన్నాయి. ఎన్నికల రాజకీయాల్లో భాగం కాని దళితశక్తులతో విప్లవకారుల ఐక్యతకు ఒక ప్రాతిపదిక ఉన్నది. దాన్ని దళిత శక్తులు గుర్తించగలవా? లేదా అనేది తేలాల్సి ఉంది. అదే జరిగితే దళితులపై దాడులకు వ్యతిరేకంగా, దళిత బహుజనుల ఆత్మగౌరవ పరిరక్షణ ఉద్యమాలు ఊపందుకొనే దిశగా, అంటరానితనం నిర్మూలన కోసం అన్ని లాల్ నీల్ శక్తులు కలవగల అవకాశాలు ఉన్నాయి. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజం వల్ల విజృంభిస్తున్న అగ్రకులతత్వాన్ని, బ్రాహ్మణ్య దురాగతాన్ని నిలువరించడానికి ఈ ప్రయత్నం అత్యవసరమైనది. ఇది తప్పక కుల నిర్మూలన దిశగా సమాజాన్ని నడిపిస్తుంది. ఆధునిక నాగరికతా వికాసానికి దోహదం చేస్తుంది. దానికి ఈ పుస్తకం, అందులోని వాదనలు తప్పక ఉపయోగపడతాయి. సందేహం లేదు. ☆

సుఖవేదన

మహమూద్

అరణ్యంలో పుట్టే విభిన్నతల పుష్పాల సువాసనలు
మంచు తుంపరపై సంతకాలు చేస్తున్న ఈ సంజెవేళలో

నీ దేహపు పరిమళం నా అతిథి

ఒంటరిగా ఉన్నా కానీ ఒంటరితనంలో కాదు
ఒక సుదీర్ఘ విరామం చలిమంటై చిటపటలాడుతూంటే
నా ఊహలకు వెలుతురు అద్దుతూ
గిలిగింతలు పెడుతున్నాయి నీ నవ్వు మిణుగుర్లు

జీవనాడి తెలిసిన బతుకు పుస్తకపు సాంగత్యం
జ్ఞానపు లోతులను తడుముతూంటే
నువ్వు నడిచి వచ్చే దారికి రాజకీయ భాష్యం చెబుతున్నట్టుంది
క్షితిజం

కలిసినప్పుడంతా నా కష్టాల్ని మరిపించేందుకు
నీవు పడే తాపత్రయపు జ్ఞాపకం
నా ముందరి తంగేడు చెట్టు
మసక చందమామ నుదురుకంటుకున్న
మసిని తుడుస్తున్నట్టు ఉంటుంది
ఎన్ని ఎత్తుపల్లాలు
ఎన్ని ఒడిదుడుకులో కదా మన ప్రయాణంలో?

ప్రతి కలయికలో ప్రతి మాట కొత్త ఎత్తుగడకో
కొత్త మార్పుకో పునాది రాయిగా నిలబడుతుంది

మనల్ని మనంగా నిలబెట్టుకునేది
మన సహచర్యాన్ని కావులించుకునేది
ఈ పచ్చటి ఆవరణంలోనే!
ప్రపంచానికి పచ్చదనాన్ని హామీపడ్డ
ఈ విప్లవచారణలోనే!!

ప్రతి మార్పు లోతులోకి మన చూపుని సారిస్తాం
కలుసుకున్న ప్రతిసారి లోచూపుల్లోనే మనం మన ప్రతిబింబాల్ని
బదిలీ చేసుకుంటాం

ఒక్కోసారి భుజంతో భుజం కలిపి
ఇంకోసారి విడిపోయీ!
ఇది చివరి కలయిక కాకూడదనే నీవు చూసే చూపు
ఈ గుబురు చెట్లల్లో సెంట్రీలా కాపు కాస్తుంటుంది

రేపటి సమాజపు చిత్తరువును ఈ నేలా ఈ పరిసరాలపై గీస్తుంటుంది

పూల చెట్టుకు అంటుకట్టే తోటమాలికీ
నీకు ఏం భేదం ఉందనీ...
ఎన్ని గాయాల నొప్పిని భరిస్తున్న మన్యం ఇదీ
మన్యానికి మన్యం లాంటిది నీ యాది

నీకూ నాకూ తగిలే దెబ్బలకు మందుగా
తన గాయాలనే పిండి తీస్తుంది ఈ స్థితి

నీ చేతినో నీ ఒంటినో స్పర్శించినపుడు
విచ్చుకునేవి గాయపు పూలే!
పెదవిపై కనబడేది ఆత్మవిశ్వాసపు మెరుపే!!

నేలపై దోపిడీ భారాన్ని దించడానికని
మన్యం బిడ్డలూ, చెట్టూ-పుట్టా చేస్తున్న
పోరాటంలో భాగం కావడం కంటే గొప్ప ఏముందీ?

నీ మస్తిష్కంలో స్పష్టంగా నిర్దిష్టంగా అల్లుకున్న
రాజకీయ అభినివేశం బలవంతపు ఎంపిక కాదు
ప్రసవ సమయంలో తన ప్రాణం ఇంకో ప్రాణికి
జన్మనిచ్చే తల్లి సుఖవేదన లాంటిది
అది నీ నా సహచర్యం మధ్య బలమైన వారధిగా నిలబడి ఉ
ంది..
సహచరీ!!!

జిఎన్ సాయిబాబా కవితలు రెండు

ఈ రోజూ గడిచిపోతుంది...

మైకం, వికారం, ఊపిరాడని స్థితి...

ఈరోజు ఉదయాన
నిగనిగలాడే తెరల మీద
నా దేశపు రంగురంగుల పటాలు

నా దృష్టిని చెదరగొడుతున్నాయి

ఈరోజు సమృద్ధియైన వ్యాపారాలు
సూపర్ లాభాల కోసం
90 శాతం వరకూ డిస్కౌంట్ ఆఫర్ల
పండుగ జరుపుకుంటాయి

ఈ త్రైమాసికంలో జిడిపి
అత్యధికంగా మునగడానికి సిద్ధంగా ఉందని
అధికారిక అంచనాలు జోస్యం చెబుతాయి
దిగజారుతున్న ఆర్థిక వ్యవస్థపైన
మార్కెట్లు ఒక్కపెట్టున
భయంకరమైన గొంతుతో గర్జిస్తాయి

రాజ్యం నమ్మించిన ఆవాసపు ఎత్తైన గోడల ఆవల
దిక్కులేని పిల్లలు అర్ధనగ్న యూనిఫారాలలో
బిచ్చమెత్తుకుంటూ
వారి దుర్భర సున్నిత చేతుల్లో
మేడ్ ఇన్ చైనా దేశభక్తి జండాలతో
బిజీ ట్రాఫిక్ ద్వీపాల చుట్టూ కవాతు చేస్తారు
అదెక్కడో లోపల రిపోర్టవుతుంది

మైకం, వికారం, ఊపిరాడని స్థితి...

జైలు డాక్టర్ వద్ద ఒక ప్రశ్న ఉంటుంది
'నువ్వు రోజూ ఉదయం మందుబిళ్లలు వేసుకుంటున్నావా?'
ఉరుముతున్న బాధా శకలాలు
నా అదురుతున్న కళ్లలోకి
ధూళి తుఫానులను పైకి విసురుతాయి
ఈతను చెకప్ పూర్తి చేస్తాడు:
'నీ రక్తపోటు నియంత్రణలోనే ఉంది
చింతించాల్సిన పని లేదు'

గౌరవనీయ న్యాయస్థానానికి ప్రాసిక్యూటర్ చెబుతాడు:
'అతని కీలక అవయవాలు నిలకడగా ఉన్నాయి'
ప్రతివాది లాయరు తన గొంతు విప్పుతాడు
'ఏ కీలక అవయవాలు నిలకడగా ఉన్నాయి
ఒక్కొక్కటి ఎంతకాలం నుండి?'

మైకం, వికారం, శ్వాస ఆడని స్థితి...

సగం జనం దౌర్భాగ్యంతో పెనుగులాడుతున్నా
మార్కెట్లు బిజంతు ఆత్మలతో పరుగు లంఘిస్తాయని
ప్రభువర్గపు ఆర్థికవేత్తలు ఎత్తిచూపుతారు

అమేజాన్, ఫ్లిప్‌కార్ట్
క్షమించాలి, వాల్‌మార్ట్,
హిందుస్థాన్ లీవర్,
అంటే యూనిలీవర్ యుకె,
థామస్ కుక్,
ఫేస్‌బుక్,
ఆలీబాబా, ఒపో,
గూగుల్, ఆపిల్,
వన్‌ప్లస్, పేటీయం,
సోనీ, సామ్‌సంగ్,
మైక్రోసాఫ్ట్, బిగ్‌బాస్కెట్,
బిగ్‌బజార్, జియో, జాగ్వర్,
హెూండా, టాటా, బేటా,
రిలయన్స్, వగైరా
పవిత్రదినం సందర్భంగా
విజయోత్సాహంతో ఎగిరే మూడురంగుల్లో
ప్రత్యేక ఆఫర్లను ప్రకటిస్తాయి.

బిఎద్దులు గర్జిస్తాయి
బిఎలుగుబంట్లు ఎగిరి దూకుతాయి
రంగురంగుల వాణిజ్య ప్రకటనల్లో
దేశం వర్ధిల్లుతుంది

ఆందోళనకారుడు ఆలంకారిక భాషలో ప్రకటిస్తాడు
ఈ దేశం తయారుచేయబడింది కాదు
అనాదికాలంలోనే జన్మించింది
ఈ భూమ్మీద అత్యంత ప్రాచీనమైనది
జైలు రేడియో వదురుతుంది
ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం...'

నా దేవుని నివాసంలోనికి
ఉదయం 9.30కు ఆయన దివ్యమైన వంటగది నుండి
నూనెతో నిండిన పవిత్రమైన
గోధుమరంగు పకోడీలు వస్తాయి
చూడ్డానికి ఆకారానికి
ప్రాథమికంగా వ్యాపార సామర్థ్యంగలవాటిగా ఉంటాయి
దేశంలోని నిరుద్యోగ, స్వయం ఉపాధిదారులు
రైల్వేస్టేషన్లు, బస్టాండ్ల బైట
లేదా రోడ్డువక్క కాలిబాటవెంట తయారుచేసినవి
పూర్తిగా మేడ్ ఇన్ ఇండియా

మైకం, వికారం, శ్వాస ఆడని స్థితి...

డాక్టర్లు నూనె పదార్థాలు వారించమని
ఇచ్చిన సలహా జ్ఞప్తికి వస్తుంది
నా క్లోమ గ్రంధి బాధిస్తుంది
తక్కిన పద్దెనిమిది కీలక అవయవాల్లాగే
కానీ నువ్వు స్వాతంత్ర్యదినోత్సవ పకోడీలు
నిరాకరించకూడదు కదా
లేదంటే దేశద్రోహం కింద లెక్కేస్తారు

నీ కులంలానే
నీ జాతీయతను ఎన్నడూ కాదనకూడదు

ప్రధాన ద్వారం వెలుపల
ఒక పెద్ద జెండాకు
గార్డులు గౌరవంగా సెల్యూట్ చేస్తారు
అనంతరం లౌడ్ స్పీకర్ల నుండి
బాలీవుడ్ దేశభక్తి పాటలు ఉప్పొంగుతాయి

మైకం, వికారం, శ్వాస ఆడని స్థితి...

స్వేచ్ఛాజీవులకు ఈరోజు సెలవుదినం
కానీ లోపల ప్రతి సెలవుదినాన
పండుగ జ్వరాన ఉన్నట్టుగానే
ఈరోజు కూడా ముందస్తు లాకప్పు
1:30కు ప్రత్యేక భోజనం వడ్డిస్తారు
అధిక నూనెతో ఆలూపులావ్
అనంతరం పద్దెనిమిది సుదీర్ఘ గంటల లాకప్పు

వేడుక నిగనిగల తెరల్లోకి
నేను వెనుదిరుగుతాను
రేపటి ఆశలతో వేధించే
నా వ్యాధిగ్రస్త గదిలో మౌనంగా ఒరుగుతాను
ఈరోజు గడిచిపోతుంది

మైకం, వికారం, శ్వాస ఆడని స్థితి...

15 ఆగస్టు 2018

ఐఅనిమల్ స్పిరిట్ (జంతు ఆత్మ) అనే మాటను విపరీతమైన కోరికతో కొనుగోలుకు ఆసక్తి చూపే వినియోగదారుని మానసిక స్థితిని గురించి ఊహిస్తూ పెట్టుబడిదారి ఆర్థికవేత్త కీన్స్ ఉపయోగించాడు.
ఐఎద్దు ఎలుగుబంటి (బుల్, బేర్) స్టాక్‌మార్కెట్ ఉద్ధాన పతనాలను సూచించేవి.

తెలుగు: వరలక్ష్మి

నిషిద్ధాంశాల ప్రపంచం నుండి

ప్రేమ దారుణ కత్తిరింపుకు గురయిన
ఈ ప్రపంచంలో
రెపరెప కొట్టుకుంటున్న
ఉపిరితిత్తులతో నేను
అతి కష్టంగా
ఊపిరి పీలుస్తున్నాను

నీ జన్నత్ గెస్ట్ హౌస్ వద్ద
రోజూ గుమిగూడే వాళ్ళ లాంటి
నేను ప్రేమించే
ఎప్పుడూ పట్టుకు వేళ్ళాడుతూ ఉండే
అందమయిన మనుషులకు దూరంగా
నా జీవితంలోంచి
నాకు జీవిత బహిష్కరణ
నిషేధాల నరకంలో
బతకమని శపించబడ్డాను

నా ప్రేమికతో
నా కూతురుతో
మా అమ్మతో లేదా
మా తమ్మునితో
జాలి తీగలు, ఫైబర్ తెరలు
నిఘా చెవుల ద్వయం
అడ్డు లేకుండా
మాట్లాడడం నిషిద్ధం

పోస్ట్ చేసే ఒక ఉత్తరం
భద్రంగా అతికించడం
లేదా నా ఇష్టమయిన వాళ్ళ నుంచి
వచ్చే అతికించిన కవర్లు
నా 'అమ్మ భాష' లో
మాట్లాడడం, చదవడం
లేదా రాయడం
సెన్సార్ చేయబడని
పుస్తకాలు, ఉత్తరాలు, వార్తా పత్రికలు
చదవడం
నిషిద్ధం

ఎవరూ లేకపోతే
నిద్రపోయే ముందు
లైట్లు ఆర్పేయడం
జీవితం
శృతి, లయ తప్పినప్పుడు
మనసుకింపయిన
సంగీతం వినడం
ఇవన్నీ నిషిద్ధం

ఒక నిఘా నేత్ర ద్వయం
పహారా లేకుండా
కాలకృత్యాలు తీర్చుకోవడం
స్నానించడం
పళ్ళు తోముకోవడం
బట్టలు మార్చుకోవడం
నిషిద్ధం

అద్దంలో ముఖం చూసుకోవడం
చీమలతో, జైలు పక్షులతో,
నాలుగు గోడల మధ్య
అసువులు బాసిన మనుషుల
ఆత్మలతో లేదా
దారి తప్పిన ఓ పిచ్చి గాలి
తెచ్చిన రాలిపోయిన
ఆకులతో మాట్లాడటం
నిషిద్ధం

దగ్గరయిన వారితో
నీ హృదయ భారాన్ని
వెలిబుచ్చుకోవడం
ఆకలి, కోపం, బాధ
ఎవరికయినా చెప్పుకోవడం
లేదా
రాత్రి కలగన్న ఓ స్వప్నాన్ని
ఎవరితోనయినా
పంచుకోవడం
ఇవన్నీ నిషేధం

నీ పాపాయి బుగ్గల
సువాసనను ఆఘ్రాణించడం
నీ ప్రేమిక మెడను
ఆప్యాయంగా నిమరడం

నీ ప్రియమిత్రునితో
కరచాలనం చెయ్యడం
నిషిద్ధం

ఈ చలికాలం
ప్రేమదారంతో అల్లి
నా కూతురు తెచ్చిన
ఆకుపచ్చ చారల స్వెట్టర్
నా ప్రేయసి తెచ్చిన
బుజ్జి ఎర్ర చుక్కల
తెల్ల అంగీ
నిషిద్ధం

నేను నరకంలోని మగ్గాలపై నేసిన
తెల్ల దుస్తులే ధరించాలని
ఆదేశం
జీవితంలోని రంగుల హరివిల్లును
తాకే అర్హత లేదని
నిషేధించబడ్డ
వైధవ్యం పొందిన హిందూ స్త్రీ వలె

ఏది ఏమయినా
'పవిత్ర' దేశ భద్రతా చట్టాల క్రింద
సాక్ష్యం ఏమీ లేకపోయినా
శిక్ష కఠినమే
నీవు ఇతర ఖైదీల వలె
కాదని మళ్ళీ మళ్ళీ
గుర్తు చేస్తూనే ఉంటారుగ

ఈ ఉత్తరం రాసి చాలా కాలమే అయ్యింది. 22 నవంబర్ 2017 నాడు రాసాను. అయితే, ఈ ఉత్తరం నీకు ఎప్పటికీ చేరదేమో అనిపించింది. అందుకే మళ్ళీ పంపుతున్నాను, ఈ సారయినా నీకు చేరుతుందన్న ఆశతో

(22 నవంబర్ 2017 నాడు అంజుమ్‌కు రాసిన లేఖ)

(అరుంధతీ రాయ్ రచించిన ఒక నవలలో ప్రధాన పాత్ర అంజుమ్. పాత ఢిల్లీ నగరంలోని ఒక ఖబరస్తాన్‌లో 'జన్నత్ గెస్ట్ హౌస్' నిర్మించి అనాథలకు ఆశ్రయం కల్పించిన హిజ్రా అంజుమ్ (జన్నత్ అంటే స్వర్గం). ఆ అంజుమ్‌తో తన ఒంటరితనాన్ని సృజనాత్మకంగా కవితా రూపంలో ఈ లేఖలో పంచుకుంటున్నాడు సాయిబాబా.)

తెలుగు: రాజేంద్రబాబు అర్విణి

మరొకసారి

కెక్యూబ్ వర్మ

ఎవరూ మాటాడరు
ఎవరూ గొంతెత్తి పాడరు
ఎవరూ ఏమీ రాయరు
ఎవరూ భుజం కలువరు
ఎవరూ కలిసి నడువరు

ఎవరూ ఎవరికి ఏమీ
కాకుండా పోతున్నారా?

ఎవరి దుఃఖం
వారిలోనే సుళ్ళు
తిరుగుతూందా?

బందిఖానాలు దాటి
రాని వెన్నెలలను
తిరిగి చూడగలమా?

రుతువులెన్ని గడిచినా
రోడ్డెక్కిన నాగలి
తిరిగి పొలంలో
దుక్కి దున్నేదెప్పుడు?

ప్రశ్నలకు
నువ్వూ నేను
జవాబు కాగలమా?

ఆర్. శశికళ కవితలు రెండు

ఢిల్లీ సరిహద్దుల్లో

తామే ఆకాశమై
రాగరంజితమైన వాళ్ళు
మట్టి చేతుల్తో మానవ నాగరికత ను తీవిగా
నిలిపిన వాళ్ళు
మంచు ముద్దలై నిలువెల్లా
కరిగిపోతున్న వాళ్ళు
మార్కెట్ మాయాజాలం
గుట్టు ఏమిటో
విప్పి చెప్పి న వాళ్ళు సత్యాసత్యాల
సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్న మన కోసం
గూడు విడిచిన వాళ్ళు
కష్ట జీవుల ప్రపంచ వార్తల్ని తమ లెక్కల్లో దాచుకున్న వాళ్ళు...
నగరాన్ని మంచు దుప్పటి కప్పిన సమయాన
శూన్యాకాశాన్ని శిలలు కుమ్మేసిన చోట
ఢిల్లీ సరిహద్దుల్లో నింగికి
సరికొత్త సంకేతాలేవో పంపుతూ
ఆ పూలమొక్కలు త్యాగాలను గానం చేస్తున్నాయి.

అనంత యానం

దేశముంది రాష్ట్రముంది
అందులో ఓట్లు వేసే వూరు ఉంది
ఊరికి దారే లేదు
పాలకులకు ఊరు అక్కర్లేదు
ప్రజలు అక్కర్లేదు
ఇపుడంతా ఒకటే జీవన సూత్రం..
ఎవని బతుకు బరువు వాడిదే ...

అటువంటి వూరిలో ఒకామె
బతుకు పల్లకిలో నిత్యం ఊరేగుతూ
ప్రతి సూర్యోదయం ఆమెకు బతుకు పోరాటం
అలసిపోయినా ఆగని ఆరాటం
పొద్దు వాలినా
ముద్ద దొరకని వర్తమానం

భూగోళాన్ని నెత్తిమీద మోస్తూ
కాలం అంచుపై చూపులు పరుస్తూ
తనువిచ్చిన పసిపిల్లల కోసం
రెండు చక్రాల బండిగా మారింది

ఏ తీరానికో చేరి
ఎంతకూ రాని మగని కోసం
విసిగి అలిసిపోయిన కాలం
ఇపుడు ఆమెకు ఇంటికి చేరడమే
ఎడతెగని ప్రయాణం
వంట చెరకు, ఇంటి సరకుల కోసం
తనువెల్లా పిల్లలనూ చుట్టు కొన్నది
పిల్లల కోసం సాగే అనంత ప్రయాణం
విసుగెరుగని సాహస యానం.

అల్లం రాజయ్యతో ఇంటర్వ్యూ:

పోలిక, పోటీ తగదు

ఆధునిక తెలుగు సాహిత్యంలో నవలా ప్రక్రియది విస్తృత స్థానం. అనేక భావజాలాల ప్రభావంతో మన స్థల కాలాల్లో నవల కొనసాగుతున్నది. ఫ్యూడల్, పెట్టుబడిదారీ ప్రమాణాలను అధిగమించి ప్రజాస్వామిక విప్లవ చైతన్యాన్ని ప్రదర్శిస్తోంది. అట్టడుగు ప్రజా జీవితపు సంఘర్షణలను నవల సృజనాత్మక వేదిక. సమాజం విప్లవాత్మక మార్పులకు లోనవుతున్న క్రమాన్నంతా తెలుగు నవల చిత్రిస్తోంది. గతంతో తెగతెంపులు చేసుకొని రూపొందుతున్న మానవ జీవితాన్ని ఆవిష్కరిస్తోంది. అనేక స్థాయిల్లో, రూపాల్లో సాగుతున్న తెలుగు నవలా ప్రయాణం గురించి విప్లవ రచయిత అల్లం రాజయ్యతో చేస్తున్న సుదీర్ఘ సంభాషణే ఈ ఇంటర్వ్యూ. నవల అంటే రూపొందుతున్న జీవితం, చరిత్ర. ఆ తీరు ఎలా ఉన్నదో సోదాహరణంగా ఆయన వివరిస్తున్నారు.

1. యూరోపియన్ నవలతో తెలుగు నవలలను చాలా మంది పోల్చుతుంటారు. అప్పుడు మీకేమనిపిస్తుంది?

సాధారణంగా యూనివర్సిటీ అకాడమిక్ మేధావులు ఇలాంటి పోలికలు తెస్తుంటారు

. యూనివర్సిటీలల్లో నాకు తెలిసి అర్ధవలస, అర్ధ భూస్వామిక దేశాల్లో, పెట్టుబడిదారీ దేశాల యూనివర్సిటీలల్లో తులనాత్మక అధ్యయనం అనే పద్ధతి ఉన్నది. (తులనాత్మక అంటే తూకం వేయడం. ఎందుకు? ఎవరు? కొలమానాలేమిటి? ఇవి ప్రభుత్వాలు నిర్దేశించినవే)

ఇది భావవాద అధ్యయన పద్ధతి. నవలను సామాజిక జీవనం స్థల, కాలాల నేపథ్యంలో, వర్గపోరాట దృక్పథంతో అధ్యయనం చేయాలి...ఎంచుకున్న వస్తువు రీత్యా కూడా-వస్తువులో, శిల్పంలో, భాషలో-అంటే రూపంలో సారంలో కూడా ఒక నవలకు మరో నవలకు పోలిక పెట్టలేం: ఒకే రచయిత రాసిన ఒక నవలకు మరో నవలకు పోలిక పెట్టలేం. యూరోపియన్ నవలలను-ఆయా దేశాలల్లో భిన్న కాలాలల్లో, భిన్న రచయితల, భిన్న సామాజిక వస్తువుగా, భిన్నస్థాయిలో వర్గపోరాటం గల రచనలను పోల్చలేం. అంతెందుకు ఫ్రెంచ్ రచయిత ఎమిలీజోలా 'జర్మినల్' నవల ఫ్రెంచి బొగ్గుగని కార్మికులకు సంబంధించినది. 'భూమి'- ఆనాటి ఫ్రెంచి రైతాంగం జీవితానికి సంబంధించినది. ఐర్లాండ్ నుండి వచ్చిన బొగ్గు గని కార్మికుల నవల ఎం.జె. కొనిక్....? -'స్టార్స్ లుక్స్ డౌక్'ను 'జర్మినల్'తో పోల్చలేం. మన సింగరేణి గని కార్మికుల మీద వచ్చిన నవలలను వాటిలోని వస్తువు కార్మికులదే అయినా ఒక దానితో మరోదాన్ని అసలే పోల్చలేం.

మార్క్సిస్టు అధ్యయన పద్ధతి గతి తార్కిక భౌతికవాద, గతితార్కిక చారిత్రక పద్ధతి. ఇది స్థలకాలాల్లో-చలనంలో-వర్తులాకారంలో పరిణామం చెందే సామాజిక క్రమాన్ని అధ్యయనం చేసే పద్ధతి.

తెలుగు నవలలను మరే భాష నవలతోగాని, ఇతర భాషల్లో వచ్చిన భారతీయ నవలలతోగాని-తెలుగులో వచ్చిన ఒక నవలను మరో నవలతో పోల్చలేం. పోల్చడం, పోల్చుకోవడం భారతదేశంలో-తెలుగు ప్రాంతాలల్లో అన్నిచోట్ల ప్రకటితంగా-అప్రకటితంగా కొనసాగుతున్న సంప్రదాయ భావవాద పద్ధతి. అన్ని భాషల భారతీయ సాహిత్యంతోపాటు మన తెలుగులోనూ ఉన్నది. భూస్వామ్య భావజాలంతో తీవ్రఘర్షణ పడినప్పటికీ దానితో పూర్తిగా తెగతెంపులు కాకపోవడంతో దాని ప్రతిఫలనంగా విప్లవ సాహిత్యంలోకి వచ్చింది. శ్రీశ్రీని మహాకవి అన్నా, గురజాడను ఆధునిక కథకు ఆద్యుడన్నా-విప్లవ నవలకు ఫలానా రచయిత ఆద్యుడన్నా ఇదే భావజాలం. ఒక నవలను విశ్లేషించడం, అందులోని అంశాలను పొగడడమూ, తప్పులు బయట పెట్టడం వేరు, పోలిక తేవడం వేరు.

ఒక నవలను అధ్యయనం చేసేటప్పుడు సిద్ధాంతాలు, భావాలు, ఆలోచనలు కాకుండా ప్రజల క్షేత్ర స్థాయి నుండి వచ్చే సాహిత్యం, జీవితం -విశ్లేషణ పద్ధతి రూపొందుతుంది. 'మనం మార్క్సిస్టులం. ఏ సమస్యనైనా పరిశీలించేటప్పుడు వాస్తవ విషయాలతో ఆరంభించాలి గాని శుష్క నిర్వచనాలతో కాదు. వాస్తవాల ద్వారానే మనం మూలసూత్రాలను, విధానాలను, కార్యక్రమాన్ని నిర్ణయించుకోవాలి' -కళలు, సాహిత్యం గురించి మావో.

వర్గ సమాజంలో ఇలాంటి పోలిక భావవాద భావజాలం, వ్యక్తిగత అలవాట్లు, ఇష్టాయిష్టాలతోపాటు - సామాజిక జీవితంలోను వ్యక్తమౌతుంది. ఇలాంటి భావవాద ధోరణి వ్యక్తిగతంగా - సంస్థాగతంగా - తగ్గించుకోవడానికి తగినంత కృషి చేయనందుకు - ముఖ్యంగా నిరంతరం చేయనందుకు నా మట్టుకు నాకు లోపంగా అనిపిస్తుంది. అంతర్గతంగా నా భావాలు, సాహిత్యం మీద కూడా ఇలాంటి ప్రభావం ఉండటానికి అవకాశముంది. ఈ రోగం ముదిరి ముదిరి ఆధిక్యతాభావంగా బయటపడుతుంది. గోర్కీ విషయంలో లెనిన్ ఇలాంటి ధోరణి గురించి మెన్షెవిక్కులకు సపోర్ట్ చేసినప్పుడు చెప్పాడు.

ఇతర నవలలతో పోల్చుకోవడం వలన - నవలకు సంబంధించిన వస్తువు, శిల్పం, భాష విషయంలో ఎంతో కొంత పాత - లేదా స్థల కాలాలకు సంబంధంలేనివి చొరబడటానికి

అవకాశముంది. క్షేత్రస్థాయి ప్రజా జీవితంలోని వైరుధ్యాలను - విప్లవోద్యమంలోని దశ దిశలను అర్థం చేసుకోవడంలో - పూర్తిగా ఏ ప్రలోభాలు లేకుండా చిత్రించడంలో ప్రతిబంధకాలు ఏర్పడుతాయి. పోలిక ఒక అడ్డంకి, ఇది వ్యక్తివాదపు రూపం. నాకే కాదు ఉద్యమాలకు - రచయితలకు ఇలాంటి భావజాలం ప్రతిబంధకంగా ఉన్నది. రకరకాల రూపాలలో వ్యక్తమౌతుంది. ఇలాంటి పోలికల నుండి విముక్తం కాకుండా స్వతంత్రమైన ఎలాంటి ప్రలోభాలకు లోబడని హేతుబద్ధమైన, శాస్త్రీయమైన, మేలైన సాహిత్యం రాదు. ఐకానులు రూపొందించడం - ఆ ఐకానులతో పోలిక పెట్టడం భారతీయ బ్రాహ్మణీయ, భూస్వామిక భావజాలం. ఐకానులను బద్దలు కొట్టడం ముఖ్యంగా భారతదేశ భావజాల రంగంలో - సాహిత్యంలో వర్గ పోరాటమే. భారతీయ సాహిత్యంలో రామాయణం, భారతం ఒక 'నమూనా'లుగా ఉన్నాయి. అలాంటి భూస్వామిక నమూనాలోనే భారతీయ సాహిత్యం ఎక్కువ భాగం వచ్చింది. ఇంకా వస్తున్నది. మన సాహిత్యంలో కూడా ఇలాంటి ఆదర్శ పాత్రలున్నాయి. ఆ'పోలిక' నిరంతరాయంగా అభివృద్ధి చెందిన ఒక చెడ్డ ప్రక్రియ. దాన్ని విప్లవ సాహిత్యం పూర్తిగా బద్దలు కొట్టాలి. ముఖ్యంగా నవలల్లో.

2. పోలిక వల్ల కలుగుతున్న నష్టం ఏమిటి?

ఈ'పోలిక' మనుషులను, సమాజాన్ని వీలైనన్ని ముక్కలుగా విడదీస్తుంది. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ, హెచ్చుతగ్గుల వ్యక్తరూపమిది. అంతిమంగా రాజీ కేంద్రంగా - మరెవ్వరు సరితూగని దైవాంశ సంభూతుడుగా తేల్చుతుంది. ఇది ఉత్పత్తి శక్తులను వాటివాటి శక్తిని - ప్రాధాన్యతను గుర్తించని - అభివృద్ధి కాకుండా నిరోధించే సమస్త భూస్వామిక ఉత్పత్తి సంబంధాలకు కేంద్ర బిందువు. రాజ్యం - చట్టాలు - సాహిత్యం, కళలు - అందరివి కావు - అందరూ సమానం కాదు అనేది దీని సారాంశం. ఒక్క మాటలో చెప్పాలంటే శ్రామికులను దోచి కూడబెట్టిన అదనపు విలువకు మేలిముసుగు.

అధ్యయనం వేరు. పోల్చడం వేరు. పోల్చడమంటే ఉత్పత్తి శక్తుల వికాసాన్ని, చలనాన్ని ఉద్దేశపూర్వకంగా గుర్తించకపోవడం... మార్క్సిస్టు పద్ధతికి పూర్తిగా వ్యతిరేకమైనది.

ఈ పోలిక నుండే మనుధర్మశాస్త్రం - కులం - మతం పుట్టాయి. ప్రతి దశలో రోల్ మాడల్స్ - బ్రాహ్మణీయ నీతి సూత్రాలు, చట్టాల ఆధారంగా తయారు చేస్తారు...ఇలాంటి రోల్ మాడల్స్‌ను సాహిత్యం ప్రచారం చేస్తుంది. ఉదాహరణకు: రాముడు, సీత, రావణుడు... ఈ రోల్ మోడల్స్ కాలానుగుణంగా మారుతాయి. ఫరీదాబాదు నుంచి నల్లమందు దిగుమతి చేసుకొని ఓడల ద్వారా చైనాకు ఎగుమతి చేసిన ద్వారకానాథ్ టాగోర్ గారి మనుమడు - రవీంద్రనాథ్ టాగోర్ - ప్రజలను మభ్యపెట్టే ఈనాటి ఒక హంతక అధినాయకునికి రోల్ మాడల్ ఔతాడు. సమిష్టి సామాజిక ఉత్పత్తి, భిన్న వైరుధ్య రూపాల ప్రక్రియ. అందులో కొన్నింటిని ఎక్కువచేసి పోలికపెట్టడం - సమిష్టి జీవన ఉత్పత్తి క్రమానికి విరుద్ధం. కర్మకాండలు చేసే బ్రాహ్మణులు సకల ఉత్పత్తి శక్తులతో పోలికపెట్టి శ్రమైక జీవితాన్ని హీనంగా - దౌర్జన్యంగా పోలికపెట్టి - దోపిడి, దౌర్జన్యాలు సాగించారు...ఉత్పత్తి శక్తులు తమ వికాసం కోసం చేసిన వర్గ పోరాటాన్ని వక్రీకరించారు. అది ముదిరి నిరూపితం కాని ఫ్రాయిడ్ సైకాలజీని పెట్టుబడిదారీ సమాజం సరుకుల అమ్మకానికి వాడుకుంది. దాని పరాకాష్ట మానవ జీవితంలో స్వార్థం, అహంకారం లాంటివి మార్క్సిజం గుర్తించని ఖాళీలున్నాయి అనే అధునికానంతర వాదన.

మతాల మధ్య, దేవుళ్ల మధ్య, శాఖాహారం - మాంసాహారం లాంటి అనేకం ప్రజానీకంలో తప్పుడు చైతన్యాన్ని ప్రచారంచేసి వర్గ వైరుధ్యాల్ని - వర్గ పోరాటాలను ఈ పోలికలతో వక్రీకరించారు.

భూస్వామిక సమాజంలోని సోమరిపోతులు దేవునితో పోల్చుకుంటే - పెట్టుబడిదారులు ఒక కట్టు కథ ప్రచారం చేశారు. పెట్టుబడిదారుల పరిశ్రమ, బుద్ధిలో నుంచి ఆదిలో పెట్టుబడి ఉత్పన్నమైందట - పొదుపరులు ధనికులు పరిశ్రమాధిపతులుకాగా - సోమరిపోతులూ, వృథా ఖర్చుదారులూ - తిండిపోతులూ - వేతన కార్మికులయ్యారట - (ముప్పైరెండు వేల కోట్లతో ముప్పై ఏడు అంతస్థుల కొంప నిర్మించి - దాంట్లో మూధనమ్మకాలతో నివసించని పెట్టుబడిదారుడు పొదుపరి అయ్యాడు) శ్రామికుల శ్రమ శక్తి వల్ల పోగుపడిన అదనపు విలువే పెట్టుబడి అనే మార్క్స్ ఆవిష్కరణను, సత్యాన్ని మరుగు పరచడానికే పెట్టుబడిదారులు ఈ కట్టుకథ తెచ్చారు.

పెట్టుబడి పెరిగి సామ్రాజ్యవాదంగా మారిన తరువాత ఈ 'పోలిక' పోటీగా మారింది. పోటీలో నిలిచి గెలిచినవాడు విజేత. 1990 తరువాత విద్యావిధానం మొత్తం ఈ 'పోటీ' కేంద్రంగా రూపకల్పన చేయబడి - ప్రపంచవ్యాపితంగా కోట్లాది మంది శ్రామికులు - ఎందుకు కొరగాని వాళ్లుగా - సభ్య సమాజంలోని మనుషులతో పోల్చుకోవడానికి వీలుగాని అథో జగతి మనుషులుగా చిత్రించబడినారు.

ప్రపంచీకరణ నేపథ్యంలో సామ్రాజ్యవాదం ప్రపంచవ్యాపితంగా రకరకాల ఉత్పత్తి శక్తులు - విధానం గల భౌతిక నేపథ్యం గల ప్రజల్లోకి తన విధ్వంసపూరకమైన వ్యాపార సరుకులు ప్రవేశపెట్టి - అక్కడి ఉత్పత్తి శక్తులను కకావికలు చేసింది. అభివృద్ధి పేర ఉత్పత్తి సంబంధాలల్లో ఫాసిస్టు విధానాలు తీసుకవచ్చింది. ఈ సరుకులు ఆయా దేశాల ఉత్పత్తి విధానాన్ని కుప్పకూల్చాయి. ఈ మొత్తం ప్రక్రియలో 'పోలిక', 'పోటీ' అంతఃసూత్రం. విధ్వంసమైన ఉత్పత్తి శక్తులు, వర్గపోరాటంలో చావోరేవో తేల్చుకుంటాయని - సామ్రాజ్యవాదం మృత్యుశయ్యమీద ఉందని - కుళ్లిపోయిందని - ప్రపంచ ప్రజలకు ముఖ్యంగా సామ్రాజ్యవాదులకు తెలుసు.

ఒకప్పుడు మతం లాగే... ఉత్పత్తి శక్తులు దగాపడిన తమ అస్తిత్వాన్ని నిర్మాణం కాకుండా, సంఘటితపడకుండా వ్యక్తి వాదులుగా - తనను తాను ఒక తలకిందుల రోల్ మాడల్‌గా ప్రకటించుకోవడానికి - అణచివేయబడిన తన ఉనికిని ప్రకటించుకోవడానికి అనేక సంస్థల్లాగే ఒక వేదిక కల్పించి వ్యక్తంగాని - అణచివేతకు గురైన ఉత్పత్తి శక్తులు తమ్ముతాము భౌతికంగాకాక

భావపరంగా వ్యక్తీకరించుకొనే - భావోద్వేగాలు ప్రదర్శించుకొని తృప్తిపడే, భౌతికంగా ఒక శక్తిగా నిర్మాణంకాని ఒక వైయక్తిక స్థితికి నెట్టే 'ఫేస్‌బుక్' అనే సామాజిక మాధ్యమం అంతఃసూత్రం కూడా ఇదే.

పోలిక, పోటీ సరుకుల మార్కెట్టుకు, ప్రచారానికి ప్రధాన వనరు. ఇవి విప్లవోద్యమాలల్లో కూడా ఏదో ఒక రూపంలో ప్రతిఫలించి - విప్లవోద్యమం పురోగమించినకొద్ది - అంతర్గతంగా అనేక ఆటుపోట్లకు కారణభూతమయ్యాయి. పరిష్కారం కోసం నిరంతర ప్రయత్నం చేస్తున్నాయి.

రెండవ ప్రపంచ యుద్ధంలో గెలిచిన తరువాత భౌతిక ఉత్పత్తి విధానం సోషలిస్టు రూపంలోకి మారిందని - స్టాలిన్ నమ్మి భావజాల రంగంలో - అంటే - పదార్థం నుండి చైతన్యానికీ, మళ్లీ చైతన్యం నుంచీ పదార్థానికీ, ఆచరణ నుంచి జ్ఞానానికీ, మళ్లీ జ్ఞానం నుంచి ఆచరణకూ పదే పదే వర్గాలు అంతరించేదాకా పునరావృతం చేయడం ద్వారానే, వర్గపోరాటాన్ని కొనసాగించడం ద్వారానే సరైన జ్ఞానం రూపొందుతుంది - అనే గతి తార్కికపద్ధతిని పాటించకపోవడం వలన - పార్టీ నాయకులు, బ్యూరాక్రట్లు - శ్రామిక ప్రజల నుండి 'పోలిక - పోటీలో ఎదిగిపోయారు. అనేక కారణాల వల్ల దీని మీద పార్టీ కేంద్రీకరించలేకపోయింది. సోవియట్ యూనియన్ ఆ తరువాత కుప్పకూలిపోయింది. చైనాలో అదే జరిగింది.

నక్సల్బరీ విప్లవోద్యమం 'చైర్మన్ మావో మన చైర్మన్', కొంత మంది వీరులు చరిత్ర నిర్మాతలుగా, ఒక రాష్ట్రంలోని పోరాటాలకు మరో రాష్ట్రంలోని వర్గ పోరాటాలతో పోల్చడం వెనుక ఈ పోలికలే పనిచేశాయి.

విప్లవోద్యమం పరిమాణాత్మక దశ నుండి గుణాత్మక దశకు చేరుకుంటున్న 1980 కాలంలో ఆత్మ విమర్శచేసుకున్నది. ఆచరణలో - విప్లవోద్యమాలను ముందుకు తీసుకపోజాలని వారు - అనేక రూపాల పోలికలు తెచ్చారు. చివరకు ఆగిపోయారు.

కనుక 'పోలిక - పోటీ' - విప్లవోద్యమంలో - విప్లవ సాహిత్యంలో - నవలల్లో నశించిపోవాల్సిన - భూస్వామిక - పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద అవశేషాలు - వర్గ పోరాటంలో - వర్గ, కుల, మత, లింగ వైరుధ్యాలతో పాటు వ్యక్తమయ్యే భావవాద అభివృద్ధి నిరోధక భావజాలాన్ని గుర్తించి - ఆచరణలో పూర్తిగా వొదిలించుకోవాలి.

3. ఈ పోలిక చర్చ నేపథ్యంలో.. తెలుగు నవలలో గుర్తించాల్సిన విశిష్టతలు, ప్రత్యేకతలు ఏమిటి?

ముందే వివరించినట్లుగా తెలుగు నవల విశిష్టతలను, ప్రత్యేకతలను పోలిక ఆధారంగా అంచనాకట్టలేం. వస్తువులో పోలిక వలన వాస్తవ పరిస్థితిని అంచనావేయడంలో - శాస్త్రీయంగా ఉండలేరు.

శిల్పం : వర్గ పోరాటంలో కొత్తగా రూపొందుతున్న కొత్త శిల్పాన్ని నిర్మించుకోలేక పాత తుప్పు పట్టిన భూస్వామిక, పెట్టుబడిదారీ శిల్పాన్నే వాడుతారు.

భాష : ప్రజల భాషలో వర్గ పోరాటంలో కొత్తగా రూపొందుతున్న కొత్త భాషను గమనించలేరు. భావోద్వేగాలు చిత్రించడంలో -కృత్రిమమైన రొమాంటిక్ భావోద్వేగాలు - భౌతిక జీవితానికి సంబంధంలేని, వర్గ పోరాటానికి సంబంధం లేని భావోద్వేగాలను చిత్రిస్తారు... పోలికలో మన లోపల పాత 'నమూనా' ఒకటుంటుంది. కొత్తదాన్ని గుర్తించడంలో అది అవరోధంగా ఉంటుంది.

విప్లవోద్యమం మాత్రం అన్ని స్థలకాలాల్లో క్షేత్రస్థాయిలో జరుగుతున్న పోరాటాలను అర్థం చేసుకోడానికి, ముందుకు తీసుకుపోవడానికి తెలుగులో వచ్చిన అన్ని రకాల నవలలను అధ్యయనం చేసింది. ఉదాహరణకు సింగరేణిలో 1990 తర్వాత ఉత్పత్తి శక్తులు ఎంతోకొంత వికాసం జరిగిన తర్వాత కార్మికవర్గంలో ఒక సెక్షన్ మధ్యతరగతి లక్షణాలు అలవర్చుకున్నది. అప్పుడు గోపీచంద్ నవలలు అధ్యయనం చేశారు.

నిర్మాణంలో వ్యక్తివాద ధోరణి ప్రబలుతుంది. పురోగమనంలో - రూపొందుతున్న విప్లవ శక్తులను అంచనా కట్టడంలో, ఐక్యం కావడంలో పురోగమించడంలో - సంశయాత్మకంగా ఉంటారు.

ఎక్కువగా పైకి కనిపించే జీవితాన్ని మాత్రమే కృత్రిమ మెరుపులతో చిత్రిస్తారు. పాత కొత్తల జీవితపు సంఘర్షణను నిర్మాణమౌతున్న కొత్త జీవితాన్ని స్థలకాలాల్లో గుర్తించడానికి, సృజనాత్మకంగా అన్వయించుకోవడానికి ఈ వ్యక్తివాద పోలికలు అడ్డంకిగా ఉంటాయి. అయితే ఈ పోలిక గొడవను పక్కనపెట్టి తెలుగు నవలల విశిష్టతలు, ప్రత్యేకతలు చర్చించవచ్చు...

వలసవాదుల ప్రవేశం - వారి దోపిడీ అవసరాలకు భారతదేశంలో ప్రవేశపెట్టిన సంస్కరణలు, భూస్వామ్య ఉన్నత కులాలకు, వర్గాలకు లాభసాటిగా కన్పించాయి. సంస్కరణవాదులకు పాత భూస్వామిక సంబంధాలు ప్రతిబంధకాలుగా కన్పించాయి. మొదట బెంగాల్‌లో తరతమ భేదాలతో బంకించంద్రుడు, రవీంద్రనాథ్ ఠాగోర్, శరత్ లాంటి రచయితలు పాత భూస్వామ్య సమాజానికి సంస్కరణలు కోరుతూ అనేక నవలలు రాశారు. ఉత్తరాంధ్రలో తెలుగులో వీరేశలింగం రాసిన నవల రాజశేఖర చరిత్రం. పెట్టుబడిదారీ విధానంగా అభివృద్ధి చెందాల్సిన అవసరాన్ని గుర్తించిన విజయనగరం రాజులు - వారి ఆస్థానంలోని ప్రముఖులు - గురజాడ పెట్టుబడిదారీ విలువల గురించి కన్యాశుల్కంలో ప్రచారం చేశారు. శ్రీశ్రీ మరో ప్రపంచం గురించి కవిత్వం రాశారు. రావిశాస్త్రి లాంటి వాళ్లు కొత్తగా ఉనికిలోకి రావాల్సిన కర్షక కార్మికుల గురించి అల్పజీవి, రాజు మనిషి, రత్తాలు - రాంబాబు, గోవులొస్తున్నాయి జాగ్రత్త - సొమ్ములు పోనాయండి నవలలు రాశారు. అడవి బాపిరాజు దాంపత్య జీవితంలో స్త్రీపురుష ప్రజాస్వామిక సంబంధాలు నారాయణరావు నవలలో చర్చిస్తే, అవి సోషలిస్టు సంబంధాలుగా అభివృద్ధి చెందాల్సిన వైనం గురించి

ఉప్పల లక్ష్మణరావు 'అతడు-ఆమె' నవలలో చిత్రించాడు.

బెంగాల్‌లోని నక్సల్బరీ రైతాంగపోరాటం శ్రీకాకుళం ఆదివాసుల్లోకి ప్రవహించింది. ప్రసారమయ్యింది. ఆదివాసుల పరిమాణాత్మక పోరాటాన్ని భూషణం 'కొండగాలి' నవలలో చిత్రించారు... ఆ వరుసలో అట్టాడ అప్పల నాయుడు 'పునరావాసం' నుండి 'బహుళ'దాకా తన నవలల్లో చిత్రించారు.

ఇది స్థూలంగా ఉత్తరాంధ్ర నవలల ప్రస్థానం.

కోస్తాంధ్ర నవలల విషయానికి వస్తే..

మద్రాసు ప్రెసిడెన్సీ- ఇంగ్లీషువారి భూసంస్కరణలు- జాతీయ పోరాటాలు- జమీందారి వ్యతిరేక పోరాటాలు- ఉన్నవ లక్ష్మీనారాయణ గారి 'మాలపల్లి'లో చిత్రించారు.

వ్యవసాయ ఉత్పత్తి సంబంధాలలో వలసవాదులు తమ దోపిడి కోసం వనరుల రవాణా సౌకర్యాల అభివృద్ధికి పూనుకున్నారు. కాటన్ ఆనకట్ట- రోడ్డు రైలు సౌకర్యాలు- వగైరా. వ్యవసాయంలో ఉత్పత్తి పెరిగి, ఆ ఉత్పత్తిని హస్తగతం చేసుకునే నయా భూస్వామ్యవర్గం, వలసవాదుల శిక్షణలో పెరిగింది. వ్యవసాయంలో మిగులు ఉత్పత్తి సినిమాలాంటి అనుత్పాదక రంగంలోకి ప్రవహించింది. సన్నకారు రైతులు, రైతు కూలీలు శ్రమ పెరిగి మరింత దోపిడీకి, పీడనకు గురయ్యారు. అయితే, భూస్వామిక ఊపిరిసలుపని సంబంధాలలో ఈ కొత్త సంకర (అర్ధ వలస-అర్ధ భూస్వామిక) స్వేచ్ఛ, తమ ఉనికి గురించిన విశ్లేషణ ఆరంభమయ్యింది. ఈ మార్పు కరుడుగట్టిన భూస్వామిక బ్రాహ్మణీయ విశ్వనాథ సత్యనారాయణకు నిద్రలేకుండా చేసింది. దుర్మార్గమైన, కూలిపోవాల్సిన భూస్వామిక వ్యవస్థ గురించి, వేయిపడగల, చెలియలి కట్ట నవలలు, పుంఖానుపుంఖాలుగా రాశారు.

కొత్త భావజాలం అదే కాలంలో చలంను ఉక్కిరి బిక్కిరి చేసింది. భౌతిక పరిస్థితుల కన్నా ఎక్కువ స్వేచ్ఛను, ముఖ్యంగా అట్టడుగున పితృస్వామిక పీడనలో ఉన్న మహిళలకు స్వేచ్ఛ కావాలనే ఉత్పత్తికి సంబంధం లేని 'మైదానాన్ని' కలగన్నాడు.

గురజాడ కన్యాశుల్కంలోని 'మధురవాణికి' ఈ ఊహాత్మక స్వేచ్ఛ గురించి తెలుసు. అందుకే ఉత్తరాంధ్రలో అలాంటి నవలలు రాలేదు.

ఇలాంటి సంకర, దళారి పరిస్థితుల గురించి కొంచెం లోతుగా వెళ్లిన గోపీచంద్ చీకటి గదులు, మెరుపులు మరకలు, అసమర్థుడి జీవయాత్ర లాంటి నవలలు రాశారు.

వీటి ప్రభావాల మూలాలు తెలియని బుచ్చిబాబు నిరాశతో 'చివరకు మిగిలేది' రాశాడు. ఈ మొత్తం పరిణామక్రమాన్ని శాస్త్రీయంగా మార్క్సిజం వెలుగులో అర్థం చేసుకునే క్రమంలో కొడవటిగంటి కుటుంబరావు, చదువు, అనుభవం నవలలు మధ్య తరగతి జీవన నేపథ్యంలో రాశారు.

ఈ పరిణామక్రమంలో విద్యావంతులైన మహిళలు యద్దనపూడి సులోచనారాణి- సెక్రెటరీ, జీవన తరంగాలు, భూస్వాములకు, గుమాస్తాలకు మధ్య అవాజ్య ప్రేమలాంటి గాలిమేడలు కట్టారు. మధ్యతరగతి కలలను మేల్కొలిపారు. తెన్నేటి హేమలత, వవని నిర్మల ప్రభావతి, సి. ఆనందరామం, విమలారామం, పొత్తూరి విజయలక్ష్మి, యండమూరి వీరేంద్రనాథ్, మల్లాది వెంకట కృష్ణమూర్తి, కొమ్మూరి వేణుగోపాలరావు, గొల్లపూడి మారుతీరావు, రావూరి భరద్వాజ లాంటివాళ్లు చాలా నవలలు రాశారు.

అవి 'పేకమేడలని' - రంగనాయకమ్మగారు 'జానకి విముక్తి' రాశారు. కూలిన గోడలు, స్వీట్ హోమ్ లాంటి నవలలు రాశారు. ఇదంతా నక్సల్బరీ పోరాటం ఆరంభానికన్నా ముందటి మాట.

వోల్గా గారు సహజ, మానవి, కన్నీటి కెరటాల వెన్నెల గులాబీలు, ఆకాశంలో సగం, యశోబుద్ధ, స్వేచ్ఛ నవలలు రాశారు.

నక్సల్బరీ పోరాటాల నుంచి ఎదిగిన తరం విరసం సభ్యురాలు నల్లూరి రుక్మిణి గారు వర్గ పోరాటాలను నల్లరేంక చెట్టుకింద, ఒండ్రు మట్టి, నిషిధ, మేరువు నవలలుగా రాశారు. సంచార ఆదివాసీ జీవితం గురించి అరుణ 'ఎల్లి' నవల రాశారు. మహీధర రామ్మోహనరావు, నండూరి రామ్మోహనరావు, శారద, కొడవటిగంటి కుటుంబరావు రాజకీయార్థిక నేపథ్యంలో నవలలు రాశారు. నళినీమోహన్ తెలంగాణ సాయుధ పోరాటం గురించి రాశారు.

ఈ మొత్తం పరిణామ క్రమంలో అట్టడుగు వర్గాలైన దళితుల వర్గపోరాటం గురించి, మూడు తరాల జీవితాన్ని మాలపల్లి నుంచి నక్సల్బరీ మీదుగా నేటిదాకా అంటరాని వసంతంలో చిత్రించారు కళ్యాణరావు గారు.

ఇది స్థూలంగా కోస్తాంధ్ర నవలల ప్రయాణం.

రాయలసీమ ఉత్పత్తి శక్తుల విషాదకర వీరోచిత పోరాటాల చరిత్రను అన్ని రకాల వైరుధ్యాలతో సహా నవల చిత్రించింది. కోస్తాంధ్రలో, ఉత్తరాంధ్రలో జరిగిన వలసపెట్టుబడి, వనరుల అభివృద్ధి జరుగక, రాయలసీమ అత్యంత వెనుకబడిన ఉత్పత్తి శక్తులు మనుగడ కోసం చేసే పోరాటం అన్ని నవలలకు కథావస్తువయ్యింది.

డాక్టర్ కేశవరెడ్డి నవలలు ఇన్‌క్రెడిబుల్ గాడెస్, శ్మశానం దున్నేరు, మూగవాని పిల్లనగ్రోవి, అతడు అడవిని జయించాడు, చివరి గుడిసె, రాముడుండాడు రాజ్యముండాది, మునెమ్మ దాకా... ఆదివాసుల గురించి రాసాని నవలలు రాశారు.

బండి నారాయణస్వామి గద్దలాడతాండాయి, శప్తభూమి.. సడ్లపల్లి చిదంబరరెడ్డి బతుకుపుస్తకం, భూస్వామిక సంబంధాల మీద మునికన్నడి సేద్యం, ప్రపంచీకరణ గ్రామసీమల్లోకి చొరబడటం, వ్యవసాయ సంబంధాల మార్పు మీద 'మూలింటామె' నామిని సుబ్రమణ్యం నాయుడి నవలలు, 'నింగి-నీరు-నేల' సుంకోజి దేవేంద్రాచారి నవల, రామలసీమలో దళితుల మీద ఎంత ఒత్తిడి, పీడన ఉంటుందో నిప్పులవాగు, గుమ్మెటమోత నవలల్లో పాణి చిత్రించారు.

నక్సల్బరీ పోరాటాల నేపథ్యంలో రాయలసీమ రైతాంగం పోరాటాలు నిర్మించారు. ఈ నేపథ్యంలో కనుంపల్లి రాజారాం ఎదురగ్గి నవల వచ్చింది. మూడు ప్రాంతాలల్లో (ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమ) ఉత్పత్తి శక్తులు వనరులల్లో తేడా ఉన్నా, ఉత్పత్తి సంబంధాలైన రాజ్యం, చట్టాలు, బ్రిటీష్‌వారి ఏలుబడిలోంచి

వచ్చాయి...

తెలంగాణ ప్రాంతం నైజాం ఏలుబడిలో బ్రిటీష్ వారికి లోబడి సాగింది. మిగతా ఆంధ్ర ప్రాంత్రంలోని సంస్కరణలాంటివి తెలంగాణలో నైజాం ప్రవేశపెట్టినా.. రాజ్యనిర్బంధం, భాషపరమైన నిర్బంధం ప్రజలు అదనంగా ఎదుర్కొన్నారు.

1866 నుండి తెలంగాణలో మునుగాల జమీందారు కుమారుడైన తడకమల్ల కృష్ణారావు 'కంబుకందర చరిత్ర' కామరూప (1866) చారిత్రిక నవలతో నవలలు రావడం ఆరంభమయ్యింది.

అప్పటికే తెలంగాణ జమీందారుల పిల్లలు జర్మనీ, ఇంగ్లండ్ వెళ్లి చదువుకోవడం ఆరంభం కావడంతో, యూరప్‌లోని బూర్జువా విప్లవ ప్రభావం, రష్యా విప్లవం ప్రభావం సాహిత్యం తెలంగాణలోకి వచ్చాయి.

1911 తర్వాత ఇలాంటి ప్రభావంతో ప్రజాస్వామిక ఆలోచనలు, సాంఘిక నవలలు రావడం ఆరంభమయ్యింది. సీతా పీరాటమ్మ- శోభావతి(1924), చట్రాతి లక్ష్మి నరసమాంబ- అనురాగపాకము(1924) వచ్చాయి. బ్రాహ్మణ సాహవాసము, 'ముక్త వలస' ఒద్దిరాజు సీతా రామచంద్రరావు నవలలు వచ్చాయి.

1931 నుంచి 1944 దాకా తెలంగాణాలో సాంస్కృతిక ఉద్యమాలు- భాగ్యరెడ్డి వర్మ, బి.యస్. వెంకటరావు, అరిగె రామస్వామి అంబేడ్కర్ భావజాలంతో పనిచేశారు. దళిత ఉద్యమం తెలంగాణలో అప్పటి నుంచి ఉంది.

1921లో తాష్కెంట్‌లో ఏర్పడి, 1925 కాన్పూర్ సమావేశం తరువాత భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ పనిచేయడం- 1938లో చంద్ర రాజేశ్వరరావు సుబ్బారెడ్డి పేరుతో తెలంగాణ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి రంగంలో పనిచేశారు.

లోక మలహరి జగ్గనివిద్దే నవల రాశారు. సురవరం ఆరె వీరులు(1932) తర్వాత వట్టికోట ఆళ్వారుస్వామి ప్రజల మనిషి, గంగు- 1955లో 1940 నుండి 1944 దాకా పరిస్థితుల గురించి రాశారు.

జి రాములు నవల పిచ్చినాయన్న, దాశరధి రంగాచార్య చిల్లరదేవుళ్లు ఇదే కాలాన్ని చిత్రించాయి. 1946 నుండి 1951 దాకా సాగిన తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం నేపథ్యంలో దాశరధి రంగాచార్య మోదుగుపూలు లాంటి నవలలు రాశారు. ఆ తరువాత ఈ పోరాట నేపథ్యంలో చాలా నవలలు వచ్చాయి. 1970 తర్వాత నుంచి పోల్కంపల్లి శాంతాదేవి (115), మాదిరెడ్డి సులోచన (72), బొమ్మ హేమాదేవి (40), అంగలూరి అంజనీదేవి (12), నవీన్ (25), రామా చంద్రమౌళి (30), దాశరధి రంగాచార్య (20), కాలువ మల్లయ్య (20), మలయశ్రీ (15), ఇట్లా చాలామంది రచయితలు, రచయిత్రులు వందలాది నవలలు రాశారు. విచిత్రంగా కోస్తాంధ్ర కన్నా ఎక్కువ వ్యాపార నవలలు తెలంగాణ నుండి వచ్చాయి.

నక్సల్బరీ శ్రీకాకుళం 1972 కల్లా తెలంగాణాకు చేరింది. 1977లో అత్యయిక పరిస్థితి ఎత్తేసిన తరువాత రైతాంగ పోరాటాలు పెద్ద ఎత్తున ఆరంభమయ్యి రాష్ట్రవ్యాపితంగా విస్తరించాయి.

అట్లాగే సింగరేణిలో కార్మికవర్గ పోరాటాలు ఆరంభమయ్యాయి.

ఆదివాసీ ప్రాంతాలకు విస్తరించాయి. కొలిమంటుకున్నది, ఊరు, అగ్నికణం, కొమురం భీం, వసంతగీతం, తుమ్మేటి రఘోత్తమరెడ్డి నల్లవజ్రం, పి చంద్ శేషగిరి, నెత్తుటిధార- లాంటి దాదాపు ఇరవై అయిదు నవలలు రాశారు. వనజ 'అడవి పుత్రిక', సాధన 'రాగో', 'సరిహద్దు' నవలలు- ఆదివాసీ ఉద్యమ నేపథ్యంలో మహిళా పోరాటాల నేపథ్యంలో వచ్చాయి.

కాలువ మల్లయ్య సాంబయ్య చదువు, బి.యస్ రాములు బతుకుపోరు, వసంతరావు దేశ్‌పాండే 'అడవి'లాంటి ప్రపంచీకరణ నేపథ్యంలో పెద్దింటి అశోక్ కుమార్ ఊరికి ఉప్పలం- దాదాపు ఏడువందలకు పైగా నవలలు తెలంగాణా నుంచి వచ్చాయి.

ఇవి నా అవగాహన మేరకు నాలుగు తెలుగు ప్రాంతాలు కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర, రాయలసీమ, తెలంగాణా నవలలు కొన్ని..

ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాలలో ఈ నాలుగు ప్రాంతాల్లోని వైరుధ్యాలను చిత్రించాయి. పోరాటాల నుంచి, పోరాటాల తరువాత – ఆ వైరుధ్యాలను తెలుగు నవలా సాహిత్యం చిత్రించింది. ప్రజల దగ్గరికి వెళ్లడం వల్ల, ప్రజా పోరాటాల్లో నుండి ఈ నవలలు వెలువడ్డాయి. అయితే మార్క్సిస్టు పద్ధతిలో ఈ నవల సాహిత్యం మీద అధ్యయనం తగినంత జరుగలేదు.

నక్సల్బరీ విప్లవోద్యమం ప్రారంభమయ్యాకనే ఈ నాలుగు తెలుగు ప్రాంతాలల్లో వర్గపోరాటం ఆరంభించి విస్తరించే క్రమంలో- అన్ని ప్రాంతాల్లోని నవలలను గతితార్కికంగా, చారిత్రికంగా అధ్యయనం చేసింది. వర్గపోరాటంలో యాభైయేండ్లుగా, మూడు తరాలుగా 1976 మావో మరణం తరువాత మార్క్సిజం-లెనినిజం మావోయిజంను అభివృద్ధి చేయడానికి ఈ అనుభవం పునాది.

దేశంలోని వివిధ ప్రాంతాల విప్లవోద్యమాలతో మమేకమవ్వడానికి ఈ అనుభవం చోదకశక్తిగా పనిచేసింది. ఈ నాలుగు ప్రాంతాల నుండి- రైతాంగం, కార్మికవర్గం, దళితులు, మహిళలు, ఆదివాసులు పోరాట యోధులుగా అనుభవాలు గడించి దేశవ్యాప్త ఉద్యమంలో అన్ని రకాలుగా పోరాడుతున్నారు.

విప్లవోద్యమం ఈ నాలుగు ప్రాంతాల సమన్వయం సాధించి దేశవ్యాపితంగా విస్తరిస్తున్న అనుభవ నేపథ్యం నుంచి కొత్త దశలో నవలలు రావాల్సి ఉన్నది. ఇప్పటికి దాదాపుగా రాలేదు. అంటే రచయితలు- యాభయేండ్ల విప్లవోద్యమ పురోగమనంలో ఎక్కడున్నారో ఆలోచించాలి.

పోలికలు కాకుండా ప్రజలకు, విప్లవోద్యమాలకు- రచయితలకు-ముఖ్యంగా నవలా సాహిత్యం పురోగమనానికి సంబంధించిన ఈ ప్రత్యేకతలను క్షేత్రస్థాయి అనుభవంతో బేరీజు వేసుకుని అధ్యయనం చేయవల్సిన విషయం.

విప్లవోద్యమం మాత్రం అన్ని స్థలకాలాల్లో క్షేత్రస్థాయిలో జరుగుతున్న పోరాటాలను అర్థం చేసుకోడానికి, ముందుకు తీసుకుపోవడానికి తెలుగులో వచ్చిన అన్ని రకాల నవలలను అధ్యయనం చేసింది. ఉదాహరణకు సింగరేణిలో 1990 తర్వాత ఉత్పత్తి శక్తులు ఎంతోకొంత వికాసం జరిగిన తర్వాత కార్మికవర్గంలో ఒక సెక్షన్ మధ్యతరగతి లక్షణాలు అలవర్చుకున్నది. అప్పుడు గోపీచంద్ నవలలు అధ్యయనం చేశారు.

(ఇంకా ఉంది)

సాహిత్య చరిత్రలో ముస్లింవాద సాహిత్యం

అరసవిల్లి కృష్ణ

ఏ సాహిత్య ధోరణికైనా ప్రత్యేకత ఎలా వస్తుంది? భారతీయ సాహిత్యంలోకి అనేక సాహిత్య ధోరణులు మిళితం అవుతున్నప్పుడు, ప్రత్యేకత అనే మాటకు అర్థం ఏమిటి? బహుళత్వ విలువల పునాదిపై భారతీయ సాహిత్యానికి పునాది వున్నది. అనేక సామాజిక రాజకీయార్థిక సాంస్కృతిక ప్రభావాల వల్ల ప్రతి సాహిత్య ధోరణికి, ఉద్యమానికి కొనసాగింపు ఉన్నది. విస్తృతి ఉన్నది. అవి నిర్దిష్టమైనవి, సార్వజనీనమైనవి. ఇవన్నీ తెలుగులో వస్తున్న ముస్లిం సాహిత్యానికి వర్తిస్తాయి. ముస్లిం 'అస్తిత్వ సాహిత్యం ప్రత్యేకతను, దాని వెనుక ఉన్న సామాజిక సాంస్కృతిక ప్రత్యేకతలను, తెలుగు సాహిత్యాన్ని అది ప్రభావితం చేస్తున్న తీరుకు పరిశీలించాలంటే తప్పక వాటిని తెలుగు సాహిత్య చరిత్రలో భాగంగా చూడాల్సిందే.

భారత సమాజం వివిధ అస్తిత్వాల కలయిక. ఈ అస్తిత్వ శ్రేణులు వర్గ సమాజపు గర్భంలో కలగలసిపోయాయి. ఆ అస్తిత్వ వేదనలన్నీ సాహిత్యంలో, మేధోవర్గం వ్యక్తమవుతున్నాయి. పీడిత అస్తిత్వాలు తమ గురించి తాము మాట్లాడటం మొదలయింది. తమదయిన జీవితానికి సంబంధించిన, అంశాలనే కాదు, సామాజికావరణలో తమ వెనుకబాటుతనం గురించి మాట్లాడటం మొదలయింది. ఇంకాస్త విస్తృతార్థంలో వీటిలో రాజకీయపరమైన అంశాలు కలగలసినాయి.

దళిత, స్త్రీవాద అస్తిత్వ ధోరణులకు బలమైన తాత్విక పునాది వున్నది. దశాబ్దాల అణచివేత నుండి తమదయిన స్వీయానుభవం నుండి సాహిత్య తలంపైన ప్రవేశించాయి. వారి స్వరం నుండి వెలువడిన సాహిత్యానికి సామూహిక ఆమోదం లభించింది. కులాన్ని, పితృస్వామ్యాన్ని వ్యతిరేకిస్తూ వచ్చిన ఈ అస్తిత్వ చైతన్యాన్ని భూస్వామ్య వ్యవస్థ వ్యతిరేక వ్యక్తీకరణలుగా కూడా అంచనా వేయవచ్చు. కులదాష్టీకం నుండి దళిత సమస్యకు, పురుషాధిపత్యం నుంచి స్త్రీ సమస్యకు అనేక పరిష్కార మార్గాలు ముందుకు వచ్చాయి. తెలుగు సాహిత్య చరిత్రలో ఆ రెండూ ప్రగతిశీల ధోరణులుగా నమోదయ్యాయి.

వాటితో పోల్చుకుంటే సామాజిక, సాహిత్య రంగాల్లో ముస్లిం అస్తిత్వ చైతన్యం భిన్నమైంది. తెలుగు సాహిత్య సాంస్కృతిక చరిత్రను ముస్లిం అస్తిత్వ సాహిత్యం తీవ్రంగా ప్రభావితం చేసింది. తెలుగు సాహిత్య చరిత్రపట్ల కొత్త అవగాహనలు వచ్చాయి. సాహిత్య చరిత్ర రచనను చాలా విశాలం చేసింది. ఈ మూడూ తెలుగు ప్రగతిశీల సాహిత్య చరిత్రలో ముస్లిం అస్తిత్వ సాహిత్య చరిత్రను ఎలా నిర్మించాలనే ప్రశ్నను ముందుకు తీసుకొని వచ్చాయి.

దీనికి సాహిత్యంలోనే పరిష్కారాలు దొరకవు. దేశ చరిత్ర రచనలోంచి ముస్లిం సాహిత్య చరిత్ర రచనకు ఒక దారి దొరుకుతుంది.

ఈ దేశం ముస్లింలకు సంబంధించినది. ఈ దేశ చరిత్ర నిర్మాణంలో వారు భాగం. కానీ ఈ దేశ పౌరులుగా ఇవ్వాల్టికి అభద్రతలో వున్నారు. ఈ దేశం పరపీడన నుండి విముక్తి కావాలనే లక్ష్యం కోసం జీవితాన్ని ధారపోశారు. కానీ ముస్లిం సమాజం అధికార మార్పిడి నుంచే అభద్రతకు లోనయినారు. రెండు సరిహద్దులుగా విడిపోయారు. అధికార మార్పిడి మిగిల్చిన ధ్వంసరచన వల్ల ఈ దేశంలో ముస్లింలు మెజారిటీలో కలగలసిపోవాల్సి వచ్చింది. భారతీయ ముస్లింలు అనే గుర్తింపుకు ఇష్టపూర్వకంగానే వచ్చి చేరారు. కానీ అది అణుకువగా మారవలసి వచ్చింది. మెజారిటీ మతానికి లొంగి వుండవలసి వచ్చింది. ముస్లింలు ఈ దేశం తమదని, ఈ నేల తమది అని భావించడానికి చాలా కోల్పోయారు. చాలా రాజీ పడ్డారు. ఘర్షణ పడ్డారు. ఇది వారి జీవితానుభవంలోని నైతిక విషయం కూడా అయిపోయింది.

'ముస్లిం అస్తిత్వసాహిత్యం రావడానికి ఈ సంఘర్షణ పునాది. ముస్లింలు మత మైనారిటీగా అనుభవించిన దాడులకు వ్యతిరేకంగా లౌకిక, వామపక్ష శక్తులు నిలబడ్డాయి. కానీ ముస్లింల ఆంతరంగిక సంక్షోభం, సాంస్కృతిక కల్లోలం, అభద్రత మొదలైనవి ముస్లిం అస్తిత్వ సాహిత్యానికి కారణం అయింది.

ఇది 1990లలో ముఖ్యంగా బాబ్రీ మసీదు అనే విశ్వాసం కుప్పకూలిపోయాక తీవ్రమైంది. బాహాటంగా ఈ దేశంలో ముస్లింలు మరోసారి వంచనకు గురి అయినారు. ఈ వంచన తీవ్ర నిరాశను కలిగించింది. ఈ దేశంలో రచనాశక్తి కలిగిన ముస్లింలు తమదయిన అస్తిత్వం నుండి మాట్లాడటం మొదలు పెట్టారు. సాహిత్య రచన తమ ఉనికికి సంబంధించిన వ్యక్తీకరణగా మారిపోయింది. ఈ అభద్రత నుండి తమ సంప్రదాయతను, ముస్లిం కట్టుబాట్లను ప్రశ్నించడం, ధిక్కరించడం ఓ తాత్వికతగా విస్తరించింది.

ముస్లిం సాహిత్య చరిత్ర రచనకు ఇది ఒక ముఖ్యమైన ప్రాతిపదిక కావాలి. దేనికంటే బాబ్రీ మసీదు విధ్వంసం తర్వాత పెల్లుబికిన అస్తిత్వ వేదన అంతా ఒక భౌతికమైన కట్టడానికి సంబంధించింది కాదు. అలాంటిది కూలిపోయిందనే నిరాశ, దుఃఖం కాదు. తమదికాని మెజారిటీ వ్యవస్థలోకి నెట్టబడుతున్న రాజకీయ క్రీడల వల్ల కలుగుతున్న ఆంతరంగిక ద:ఖం అది.

అది ముస్లిం మేధోవర్గాన్ని, రచయితలను తమ రచనా వస్తువేదో, తాము ఏం రాయాలో నిర్ణయించుకునే అవసరాన్ని ముందుకు తీసుకు వచ్చింది. ముస్లిం రచయితలు కుటుంబ సంబంధాల్లోని సంప్రదాయ, వెనుకబాట్లను, ధ్వంసం చేయనారంభిస్తూనే రెండో వైపు రాజకీయ సామాజికావరణలోకి దారిచేసుకో గలిగారు. అంతవరకు, ముస్లిం వెలుపలి రచయితలు, సహానుభూతితో మాట్లాడిన అంశాలను స్వీయానుభవంతో రాయడం మొదలు పెట్టారు. భాషలో తాము ఎన్నుకున్న రచనా ప్రక్రియలో నూత్న ఆవిష్కరణలకు, ఆలోచనలకు నాంది పలికారు.

తమదికాని తమ సొంతం కాని భాషలో తమదయిన జీవనక్షోభను తెలుగు సాహిత్యానికి పరిచయం చేసారు. అంతవరకు బ్రాహ్మణీయ భావజాల పునాదిగా వున్న తెలుగు సాహితీ పండితుల

వైఖరులను ఈ ప్రవాహం మార్చేసింది. తెలుగులో సుమారు నూరేళ్ల కింద మొదలైన ప్రత్యామ్నాయ సాహిత్య పరిణామాన్ని ఇది విశాలం చేసింది. నిర్దిష్టం చేసింది. ఇదంతా అవగాహనలో, హృదయంలలో పోగుపడిన వేదనతో బయటపడిన సృజనాత్మక వ్యక్తీకరణ.

నిజానికి వైవిధ్యభరితమైన 'భారతీయత' పట్ల ముస్లిం వాదం ఎక్కడా ఘర్షణాత్మక వైఖరిలో లేదు. భారతీయ సామాజిక సాంస్కృతిక చట్రంలో ముస్లింలు భాగమైనట్లే సాహిత్యావరణలో భారతీయ మూలాలను ఎత్తిపట్టే సృజనాత్మక ప్రవాహం ఇది. దాని పేచీ అంతా బ్రాహ్మణీయ హైందవ భావజాలంతోనే. ఆ రకంగా అది భారతదేశంలోని కుల వ్యవస్థతో కూడా తలపడుతున్నది.

హిందూ, ముస్లిం రెండు మతాల సంప్రదాయాలు, సంస్కృతి మూలాలు వేరు. ఈ రెండు మతాల మధ్య సఖ్యత కంటే ఘర్షణను మెజారిటీ వాదం లేవదీసింది. ఈ రెండు మతాల మధ్య ఘర్షణ హింసాత్మక దశకు దారితీయడం వెనుక బీజాలు రాజకీయపరమైనవి. కానీ ఈ రెండు మతాల మధ్య ఉమ్మడి సంస్కృతి ఉన్నది. ఇది వాళ్ల జీవితానికి సంబంధించినది. దాన్ని కాపాడాలనే వైఖరిని కూడా ముస్లిం సాహిత్యం తీసుకున్నది. తమపై అమలవుతున్న అణచివేతకు మూలాలు ఉప ఖండపు ఉమ్మడి సంస్కృతిలో లేవని, దాన్ని మెజారిటీ వాదంగా మార్చిన హిందుత్వ, అగ్రకుల, మార్కెట్ శక్తుల వల్లనే తమ అస్తిత్వపు సంక్షోభం తీవ్రమైందని ముస్లిం వాద సాహిత్యం గ్రహించింది.

ముస్లిం సాహిత్యంలో నాలుగు ప్రధానమైన అంశాలు ఉన్నాయి. ముస్లింలలోని శ్రామిక వర్గతత్వం, వాళ్లను ఒంటరి వాళ్లను చేస్తున్న మెజారిటీ వాదం, దాని వెనుక ఉన్న హిందుత్వ కార్పొరేట్ ఆధిపత్య, దోపిడీ వాదం, తమ సమూహంలోనే ఉన్న మత సాంస్కృతిక బంధనాలు.

ఒక సముదాయంగా సమానత్వం, స్వేచ్ఛ(స్వీయ మత బంధనాల నుంచి కూడా), భద్రత, తమదైన సాంస్కృతిక ప్రత్యేకతలను నిలుపుకోవాలనే ఆకాంక్ష.. ఇవీ ముస్లిం వాద సాహిత్యంలోని తాత్వికత. ఇంకా ముందుకు పోతే భారతీయత అనేదేమీ ఒక జాతి కాదని, అనేక జాతుల, మతాల సమ్మిళితం అనీ, అందులో తమదయిన అస్తిత్వం వేరు చేయలేని భాగమని చెప్పగల ఎరుక ముస్లింవాద రచయితలకు వున్నది.

ఆ రకంగా ముస్లిం సాహిత్యం ఒక సామాజిక, సాంస్కృతిక శక్తిగా తెలుగు సాహిత్య భావనలను, చరిత్ర రచనా పద్ధతులను ప్రభావితం చేసింది. ఈ ప్రాతిపదికల మీద ముస్లిం సాహిత్య చరిత్రను నిర్దిష్టంగా రాయడానికి అవకాశం ఉంది.

అయితే నాలుగు దశాబ్దాల ముస్లింవాదం తనదయిన రచన పద్ధతిని ఏర్పరుచుకున్నదా? అనే చర్చ వుండనే వున్నది. ముస్లింవాదం సాహిత్య ప్రక్రియల్లో తనదయిన సాహిత్యావరణను ఏర్పరుచుకోగలిగింది. మూడుతరాల రచయితలను తయారు చేసుకోగలిగింది. ముస్లింవాదం రాజకీయ, పాలనాపరమైన అణచివేతకు, ధిక్కారంగా సాహిత్యావరణలోకి ప్రవేశించింది. కాలక్రమంలో అనేక పాయలుగా విస్తరించుకోగలిగింది. ఈ వ్యాప్తికి ఈ సాహిత్యసృష్టికి భారతీయ సామాజిక చలనాల్లో కారణాలు ఉన్నట్లే, ప్రత్యేకంగా ముస్లిం సమాజంలో వున్నట్లే ముస్లిం సృజనకారుల్లో అంతర్లీనంగా ఉంది. అంతమాత్రమే కాదు ప్రగతిశీల రచయితలతో కలిసి ముస్లిం రచయితలు రచనా వ్యాసాంగాన్ని కొనసాగించగలిగారు.

శిల్పపరంగా, రూపపరంగా తన ఇంటిభాష నుండి వెలుపలికి వచ్చి తనదయిన భావజాల ముద్రను వేయగలిగారు. దానికి భారతదేశంలో ప్రగతి అనే గీటురాయికి నిలబడగల శక్తి ఉన్నది. ఆ రకంగా 'మెజారిటీ' సమాజపు ఆవోదాన్ని పొందగలిగింది. అస్తిత్వపు గతంగానేగాక సమకాలీనతగా రచనలోకి ముస్లిం సాహిత్య ప్రవేశించింది. భారత సమాజపు వైవిధ్యభరితమైన కళగా ముస్లిం సాహిత్యం నిలబడగలిగింది. ఇది కూడా ఆధునికత తెలుగు సాహిత్య చరిత్ర రచనలో భాగం కావాల్సిన ఒక ముఖ్యమైన అంశం.

మెజారిటీలో కొందరు ఇది మైనారిటీల అస్తిత్వంకు సంబంధించిన అంశంగా, తమకు ఏమి పట్టనట్లు మాట్లాడవచ్చు. కానీ నాలుగు దశాబ్దాలుగా ముస్లింవాద సాహిత్యం నిలబడటం వెనుక సాంస్కృతిక కళా రాజకీయ అంశాలన్నీ ఉన్నాయి. నిజానికి అవే ఈ సాహిత్య ధోరణిని అత్యంత బలంగా సుపరిపక్వం చేశాయి.

ముస్లిం వాద సాహిత్యాన్ని, దాని పరిణామ శీలతను దాని పునాది అంశంతో ముడిపెట్టి దానిదైన సాహిత్య చరిత్రగా ఎలా మలచాలనే ప్రయత్నం జరగవలసి ఉన్నది. అంతిమంగా మార్క్సిస్టు చలన సూత్రాల నుండి దీనికి ఒక పద్ధతిని సిద్ధం చేయవలసి ఉన్నది.

దేనికంటే ముస్లిం సాహిత్యం ఆ సమూహపు అస్తిత్వంలోని సంస్కృతి మీదే ప్రధానంగా కేంద్రీకరించి ఉండవచ్చు. అస్తిత్వవాదంలో ఇది సహజమే. కానీ ఆ అస్తిత్వంలో వర్గ విభజన ఉన్నది. మెజారిటీ ముస్లింలు శ్రామికులు. ఉత్పత్తిలో పాల్గొనేవారు. ఈ దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకం. దోపిడీకి గురవుతున్న శ్రామికవర్గం. భారతదేశ శ్రామిక వర్గంలో ఒకానొక ప్రత్యేకమైన సాంస్కృతిక అస్తిత్వం, వివక్ష అనుభవిస్తున్న సమూహం. ఈ దేశ పౌరులే కాదనే నిత్య అనుమానాన్ని మోస్తున్న శ్రామికవర్గం. ఈ రెంటినీ పునాదిలో కూడా చూడాలి.

తెలుగు సాహిత్య చరిత్ర రచనలో పాటిస్తున్న మార్క్సిస్టు పద్ధతిని మరింత విశాలం చేసి, సృజనాత్మకంగా అన్వయించి ముస్లిం సాహిత్య చరిత్ర రచనకు పూనుకోవాల్సి ఉన్నది. సాహిత్యం కాబట్టి పునాది అంశంతోపాటు బ్రాహ్మణీయ మతభావజాలాన్ని కేంద్రం చేసుకొని శ్రామిక వర్గ, దళిత బహుజన కులాల, మత మైనారిటీల, అన్ని పీడిత అస్తిత్వాల సాంస్కృతిక వికాసాన్ని చరిత్రగా చూసే ఈ పద్ధతి ముస్లిం సాహిత్య చరిత్ర రచనకు కూడా దోహదం చేస్తుంది.

* * *

భారతీయ సాహిత్యంలో దేశవిభజన మిగిల్చిన విషాదం నుంచి చాలా రచనలు వచ్చాయి. అయితే బాబ్రీమసీదు విధ్వంసం తర్వాత ముస్లిం అస్తిత్వం సాహిత్యావరణలో ప్రధాన భూమిక

(మిగిలింది 42వ పేజీలో...)

మహమూద్

సీమ-బహుజన అస్తిత్వ కవితాపతాక

రాయలసీమ నుంచి కొత్తగా వీస్తున్న కవన పవనం పల్లిపట్టు నాగరాజు. రాయలసీమ అనే విశేషణం లోకి ఈ కవి కవిత్వాన్ని కుదించడం ఈ సమీక్ష ఉద్దేశ్యం కాదు. నిజానికి ఈ కవి దృష్టికి బహుళమైన కోణాలున్నాయి, పరిశీలనా విశాలత్వం ఉంది. దానికి ఇతడి మొదటి కవితా సంపుటి "యాలైపూడ్సింది" సాక్షీభూతంగా నిలుస్తుంది. మొదటి కవితలోనే కర్రిసూరీడు నల్లచందమామ అనే కవితలో ఈ దేశ మూలవాసులు బహుజనులే అని నినదించాడు. కానీ తన కవిత్వాన్నీ సీమ నుడికారంతో నింపేయడమే కాకుండా, అనేక కవితల్లో సీమ కరువు, సీమ రైతు, సీమ శ్రమజీవులూ కనబడతారు. తన చుట్టూ ఉన్న జీవితాన్ని తన జీవితంతో అల్లుకున్న కవి కవిత్వంలో అనివార్యంగానే స్థానికత వచ్చి చేరుతుంది.

సీమ వెనుకబాటు తనాన్నీ, కరువునీ, భౌతిక వాతావరణాన్నీ, రైతు దుఃఖాన్నీ, తన కవిత్వంలో ఇముడ్చుకున్నాడు కాబట్టి తనకు తానుగా సీమ అస్థిత్వాన్ని ఈ కవి ప్రకటించుకున్నట్టైంది. ఆ విధంగా రాయలసీమ వాడు ఈ కవి.

మొత్తంగా రాయలసీమ వెనుకబాటతనం ఒక పార్శ్వమైతే అయింది కానీ ఈ కవి నిమ్న కులం వాడైనందున బహుజన పోరాట పరిమళం సహజంగా వచ్చి చేరింది. ఆ విధంగా చూసినా సీమ బతుకు పోరాటంలోంచి వచ్చిన విశిష్టమైన కవిత్వం కింద దీనిని జమచేయవచ్చు. రాయలసీమ వెనుకబటుతనంతో కులం విడదీయరాని బంధం ఉంది. నాగప్ప గారి సుందర్రాజు ఈ అంశాన్ని తన కవిత్వం లో చాలా ఏళ్ళ కిందటే ప్రకటించి ఉన్నాడు. ఈ మధ్య వచ్చి ప్రశంసలు అందుకుంటున్న స్వామి నవల శప్తభూమి కూడా ఈ విషయాన్ని రూఢి చేసింది. కాబట్టి వ్యక్తిగా ఈ కవీ, ఇతడి కుల నేపథ్యమూ రాయలసీమ అస్థిత్వంతో పెనవేసుకొని పోయాయి.

కవి పుట్టి పెరిగిన "స్థలకాలం" కవి పై ఎంతటి బలమైన ప్రభావం వేయగలదో ఇక్కడ బయటపడడం యాదృచ్ఛికం ఎంతమాత్రం కాదు. అది కవికి బలమైన సాధనమైంది కూడా! ఇక్కడ ఏమంటున్నాడో చూడండి

" గెనింపై మా నాయన కయ్యికి కళ్ళు అప్పగించి నడుస్తుంటే నడి కొంద్రిలో నిలబడి నన్నే చూస్తున్న పల్లెద్దుకి గిట్టల్లో మడకతెగిన నొప్పితోనేమో కళ్ళల్లో నీటిచారా ఒక్కొక్కటి కదులుతున్నాయి" ఇది రాయలసీమ నుడికారాన్ని కళాత్మకంగా నిలబెట్టిగలిగిందీ కవిత్వం.

ఈ పుస్తకం నిండా తన వెనుకటి రోజుల ఘర్షణనకి సంబంధించిన వ్యక్తీకరణలు కొకొల్లలుగా కనబడతాయి. అవి పైపైన తాకినట్టుగా కాకుండా మూలాల్ని వెతకుతున్నట్టుగా అనిపిస్తుంది. శ్రమ జీవుల జీవనంలో కళ ఎంతగా పెనవేసుకుపోతుందో, బహుముఖాలుగా కనబడుతుందో నిరూపించడానికి కూడా ఈ సంపుటి ఓ అదనపు చేర్పు. రుక్మత్త , మంగలి న్యాయం అలాంటి అరుదైన కవితలు.

"ఎన్నెన్ని ముఖాలను ఎంత అందంగా పొగడ్రా పూసి పెళ్ళికొడుకుల్ని చేస్తూప్రతి పూటా రెట్ట నొప్పులతో మూలుగు తున్నామో" (మంగలి న్యాయం)



సీమ రాజకీయ ఆర్థిక సాంస్కృతి సాహితీ వారసత్వంలో బలమైన ధిక్కార స్వరం వేమన, అన్నమయ్య, వీరబ్రహ్మం ల నుంచి మనకు అందుతున్నదే. కవికి నేరుగా రాజకీయాలతో పరిచయం లేకపోయినా ప్రజాబాహుళ్యం నిలబడి ఏటికి ఏదురీదే పరస్థితులు అనివార్యంగా కవి రాజకీయ దృక్పధాన్ని నిర్ధారిస్తాయని చెప్పటానికి వెనకాడనవసరం లేదు. ఈ కవికి రాజకీయాలు ఉన్నాయి. అవి ఫ్యూడల్ ఆధిపత్య సంస్కృతిని సవాల్ చేస్తున్నాయి. "పనిని కులం చేసి కులాన్ని కట్టడి కలుగుల్లో పాముజేసినా.."మా కత్తెరకు ఏ కుళ్ళిన కట్టుబాట్లు అడ్డుగావని ప్రతి కూడలిలో అంగళ్ళు తెలిచినాం..ఉండండి ఉండండి కత్తెర ,కత్తి గాక కొత్తపనిముట్టుని కొలిమిలో కాలుస్తున్నాము (మంగలి న్యాయం) ఇదొక ధిక్కార రాజకీయ ప్రకటనే!

వృత్తి రీత్యా ఉపాధ్యాయుడైన ఈ కవి తన కుటుంబం నుంచి చదువుకొన్న అతి తక్కువ మందిలో ఒకడు. బాల్యం మొత్తం అడవి అంచుల మీద నిలదొక్కుకున్న జీవన సంఘర్షణే. ఇతడి కవితల నిండా కనబడే శ్రమజీవులూ, శ్రమ జీవనం అతడి ఎదుగుదలలోఎంత బలమైన ప్రభావాన్ని వేశాయని అర్థం అవుతుంది. వారి వారి వ్యక్తిత్వాల్ని వాళ్ళ భాషలోనే వ్యక్త పరచడం ఈ కవిత్వంలో ఇంకో విశిష్టాంశం. వాళ్ళు ఏళ్ళ తర్వాత ఎదురుపడినపుడు, వారి జీవితం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉండిపోవడాన్ని "అడిగాననిచెప్పు" " సాపాయమ్మలు" అనే కవితల్లో ఆర్తి నిండిన చూపుతో తడముతాడు కవి.

తరతరాలుగా మారని కరువు స్థితిని పట్టించే పని సీమ కవులంతా చేస్తారు. ఆ పరిస్థితులు మారే వరుకు చేస్తూ ఉంటారు కూడా. అది వారి అస్థిత్వంలో భాగం. అదే కవుల వ్యక్తీకరణలకు బలం కూడా! అందులో భాగమయే పోరాట రూపాలను, మర్పులను దగ్గరగా చూడడం వల్ల కవి అభివ్యక్తి బలంగా ఉంది. ఇటీవల బహుజన కులాల చదువరులలో పెరుగుతన్న అస్తిత్వ చైతన్యానికి ఓ చారిత్రక భూమిక ఉంది. రాజకీయ భూమికా ఉంది. అంబేద్కర్ చూపుడు వేలు కవులకు మార్గం చూపుతోంది. అటు సీమ అస్తిత్వం ఇటు తన నిమ్నకుల ఆత్మగౌరవ అస్తిత్వ చైతన్యం రెండూ ఈ కవిలో ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఇంకా ఇతని నుండి బలమైన కవిత్వం ఆశించేలా చేస్తున్నాయి.

గ్లోబల్ హిందుత్వను కూల్చివేద్దాం

(సెప్టెంబర్ 10-12 తేదీల మధ్య అమెరికాలో జరిగిన మహాసభ సంక్షిప్త నివేదిక)

"కలియుగపు చీకటిరోజులు కత్తుల్లాంటివి, రాజులు
నరహంతకులు
సత్యశీలత రెక్కలు తొడుక్కుని అబద్దమనే
నిశిరాత్రిలోకి ఎగిరిపోయింది
సత్యమనే చంద్రుడు ఎక్కడా కలికానికి కూడా
కనపడడంలేదు
నా వెతుకులాట అంతా వృధా,
డోలాయమానస్థితిలో వున్న నాకు
ఈ నిశీధిలో మార్గం కనపడడంలేదు
అహంకారపూరితులైన వాళ్లు బాధతో రోదిస్తున్నారు
నానక్ నీవు వాళ్ళను ఎలా కాపాడతావు"

– "గురుగ్రంథ్ సాహిబ్ నుండి"

సెప్టెంబర్ నెలను "నిరసనల నెలగా" పిలవవచ్చును. వ్యవసాయరంగ చట్టాలను భారత పార్లమెంటు ఆమోదించి సెప్టెంబర్ నాటికి సంవత్సరం అయింది. భారతదేశంలో కొనసాగుతున్న శక్తివంతమైన రైతుల నిరసన ప్రాముఖ్యంలోకి వచ్చింది. ప్రధాని మోడీ, ఇదే నెలలో అమెరికాలో పర్యటించారు.'హిందూస్ ఫర్ హ్యూమన్ రైట్స్' (HfHR) తరఫున మేం మైనారిటీలకు వ్యతిరేకంగా ఆయన ప్రభుత్వ పాలనా కాలంలో జరిగిన అన్యాయాలపట్ల నిరసన తెలియచేస్తూ న్యూయార్క్లో , వాషింగ్టన్(డిసి)లో ప్రదర్శనలను నిర్వహించాం. రైతాంగ ఆందోళనలలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న సిక్కు ప్రజల నుండి మేం ఉత్తేజాన్ని పొందాం. ఆ ఉద్యమంలో వెల్లివిరుస్తున్న ఐక్యతకు, ధైర్యసాహసాలకు, నమ్రతకు వాళ్లే పునాది. దీన్ని అర్థం చేసుకోవడానికి మేం 'గురుగ్రంథ్ సాహిబ్'ను చదివాం. అందులోని సరళమైన పద్యాలు ప్రస్తుత భారత ప్రభుత్వ వైఖరికి అద్దం పడుతున్నాయి. పట్టపగలే దళితులపైనా, ముస్లింలపైనా అమలవుతున్న ఊచకోతలు, నిజం మాట్లాడేవాళ్ల గొంతులు నొక్కివేయడాలు, అన్నదాతలు తమ హక్కులను ఎలుగెత్తి చాటడంకోసం తమ పొలాలు వదిలిపెట్టి దేశ సరిహద్దులకు రావాల్సిరావడం- ఇవన్నీ చెవిటివాడు ముందు శంఖం ఊదినట్టు అవుతున్నప్పటికీ – ఈ చర్యలన్నింటికి గురుగ్రంథ్ సాహిబ్లోని పద్యాలు ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. ఇలాంటి చీకటి సమయాల్లో, "మనం ఎలా కాపాడబడతాం?" అనే ప్రశ్న మనందరిలోనూ ఉదయిస్తుంది. ఆ పుస్తకాన్ని క్షుణ్ణంగా చదివితే దానికి సమాధానం దొరుకుతుంది. ఏది ఏమైనా ఎన్ని అడ్డంకులు ఎదురైనా 'సత్యం' పట్ల దృఢమైన వైఖరిని మనం అనుసరిస్తే రక్షించబడతాం.

సత్యం, న్యాయాల పక్షాన నిలబడడం అనే మా ప్రయత్నాన్ని కొనసాగించే క్రమంలో భాగంగా, ఈ నెల మేం, హిందూత్వ భావజాలానికి వ్యతిరేకంగా బలమైన మా స్వరాలను వినిపించాం. "గ్లోబల్ హిందూత్వను కూల్చివేద్దాం" అనే మహాసభను నిర్వహించి, ప్రధాని మోడీ అమెరికా పర్యటనకు వ్యతిరేకంగా ప్రదర్శనలు చేసి, 'జి.20 వివిధ మతాల ఫోరం'లో పాల్గొని, 'శాంతికోసం గొంతుకలు' అనే శీర్షిక కింద కొన్ని వీడియోలను విడుదల చేసి, 'హిందూత్వ 101 క్యాంపెయిన్'ను ప్రారంభించి, అమెరికన్ పార్లమెంటరీ కమిటీ ముందు మా అభిప్రాయాలు తెలియచేసి, ఇంకా ఇలాంటి అనేక కార్యక్రమాల ద్వారా మేం హిందూత్వ భావజాలం పట్ల మా బలమైన నిరసనను ప్రదర్శించాం.

"గ్లోబల్ హిందూత్వను కూల్చివేద్దాం" మహాసభ :

ఎప్పటి నుండో ఎదురుచూస్తున్న ఈ కాన్ఫరెన్స్‌ను సెప్టెంబర్ 10-12 తేదీల మధ్య విజయవంతంగా జరుపుకున్నాం. మితవాద బృందాలు ఎంత విస్తృతంగా హెచ్చరికలు జారీ చేసినా ఈ సమావేశంలో పాల్గొనడానికి ఆమోదించిన వ్యక్తులుగానీ, యూనివర్సిటీలుగానీ వెనక్కి తగ్గలేదు. ఇందులో వివిధ అధ్యయనాల శాఖలకు చెందిన వ్యక్తులు పాల్గొన్నారు. అకడమిక్ మేధావులు, సామాజిక కార్యకర్తలు, వివిధ భావజాలాలకు చెందిన వ్యక్తులు పాల్గొన్న కారణంగా ఈ సమావేశం వైవిధ్యభరితంగా నడిచింది హెచ్ఎఫ్హెచ్ఆర్. సహ వ్యవస్థాపకురాలు సునీత విశ్వనాథ్‌ను, హెచ్ఎఫ్హెచ్ఆర్ సలహామండలి సభ్యుడు టి.యమ్.కృష్ణను కూడా "హిందూయిజం- హిందూత్వ" అనే అంశంమీద జరిగే ప్యానల్ చర్చకు మేం ఆహ్వానించాం.

తన విశ్వాసాన్ని రోడ్లమీదకు తీసుకురావాల్సిన అవసరం గురించి సునీత మంచి ఉపన్యాసం చేశారు. మితవాద బృందాలు తమ ప్రయోజనాల కోసం హిందూయిజాన్ని రాజకీయంగా తమకు అనుకూలంగా మార్చుకుంటున్న ఈ దురదృష్టకరమైన సందర్భంలో, హిందూయిజంలోని అభ్యుదయ అంశాలను, అందరినీ కలుపుకుపోయే తత్వాన్ని పునరుద్దరించడం కోసం రోడ్లమీదకు రావల్సిన అవసరం ఏర్పడిందని ఆమె అన్నారు. ఆమె ప్రసంగాన్ని , "అభిప్రాయం : నా హిందూయిజాన్ని రోడ్లమీదకు తీసుకురావల్సిన అవసరం కలిగిందని నేనెందుకు అనుకుంటున్నాను ("Opinion: why I feel the need to bring my Hinduism to the streets") అనే శీర్షికతో 'ది స్క్రోల్' ప్రచురించింది. టి.యమ్.కృష్ణ మూడు రకాల కేటగిరీలకు చెందిన వ్యక్తులతో ఎలా సంభాషణ జరపాలి అనే అంశంమీద మాట్లాడారు. ఆ కేటగిరీలలో మొదటిది, హిందూయిజం- హిందూత్వ ఒకటే అనేవాళ్లు. రెండవది, హిందూయిజం- హిందూత్వల మధ్య ఎలాంటి సంబంధం లేదని భావించి, హిందూత్వను పట్టించుకోనివాళ్లు. మూడవది, హిందూయిజం- హిందూత్వల మధ్య ఎలాంటి సంబంధం లేదని భావిస్తూనే, హిందూయిజం తుడిచిపెట్టుకుపోతుందనే భయంతో హిందూత్వను బలపరిచేవాళ్లు. హెచ్ఎఫ్హెచ్ఆర్ బోర్డు సభ్యుడు డాక్టర్ బిదిషా బిశ్వాస్ 'ఇండికా న్యూస్'లో ఒక వ్యాసం రాశారు. అందులో ఈ కాన్ఫరెన్స్‌లో జరిగిన విషయాలన్నింటినీ సమీక్షించారు. పాల్గొనేవాళ్లను చంపివేస్తామనే బెదిరింపులు వచ్చినా భయపడకుండా వాళ్ళందరూ హాజరైన వైనాన్ని కూడా వివరించారు.

అలానే హెచ్ఎఫ్హెచ్ఆర్ సహ వ్యవస్థాపకుడు రాజు

రాజగోపాల్ 'ది ప్రింట్' లో ఒక వ్యాసం రాశారు. హిందుత్వవాదులు చేసిన ప్రయత్నాలు అనుకోకుండా ఈ కాన్ఫరెన్స్ విజయవంతం కావడానికి ఎలా ఉపయోగపడిందో ఆయన వివరించారు.

జి.20 వివిధ మతాల సమ్మేళనం :

ఈ సమావేశం ఇటలీలోని బొలోగ్నా లో జరిగింది. 28దేశాల నుంచి ఎంపిక చేయబడ్డ 40మంది యువ ప్రతినిధులు దీనికి హాజరయ్యారు. వారిలో హెచ్ఎఫ్హెచ్ఆర్‌కు చెందిన నిఖిల్ మందలపర్తి కూడా ఒక ప్రతినిధిగా హాజరయ్యాడు. ఆ సభలో ఆయన "మనలో అంతర్లీనంగా వుండే తీవ్రవాదంపై పోరాడడం" అనే శీర్షికపై ప్రసంగిస్తూ, హిందూ జాతీయవాదానికి వ్యతిరేకంగా పోరాడటంలోనూ, బహుళత్వాన్ని ప్రోత్సహించడంలోనూ హెచ్ఎఫ్హెచ్ఆర్ చేస్తున్న కార్యకలాపాల నివేదిక అందించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సంస్థలలో హెచ్ఎఫ్హెచ్ఆర్ ఏకైక హిందూ సంస్థ కావడం, అమెరికాలోనో, ఇండియాలోనో మాత్రమేకాక అంతర్జాతీయంగా కూడా మా ప్రభావాన్ని సూచిస్తుంది.

'హిందుత్వ 101' క్యాంపెయిన్ :

హెచ్ఎఫ్హెచ్ఆర్ 'హిందుత్వ 101' అనే పేరుమీద ఒక కొత్త సోషల్ మీడియా క్యాంపెయిన్ చేపట్టింది. పన్నెండు రోజులపాటు పన్నెండు సందేశాలను పంపింది. హిందుత్వవాదులుగా చెప్పుకుంటున్నవాళ్లు తమ వాదనలను సావర్కార్ మరొకరో రాసిన మూల పుస్తకాల నుండి కాక తమ మాటలుగా తమ కార్యకలాపాలుగా ఎలా చెప్తున్నారో అమెరికాలోని భారతీయులకు తెలియచెప్పడం ఈ క్యాంపెయిన్ పోస్టర్ల ఉద్దేశం. అందులో కొన్ని పోస్టర్లు :

(1) హిందుత్వను వ్యతిరేకించడం అంటే రాజ్యాంగబద్ధ పాలనను పునరుద్దరించడం, మైనారిటీలు, సామాజిక కార్యకర్తలను లక్ష్యంగా పెట్టుకున్న చట్టాలను వెనక్కి తీసుకోవడం.

(2) తాను హిందూవులందరి తరఫునా మాట్లాడుతున్నానని హిందుత్వ అంటుంది. కాని హిందూయిజం ఏకశిలాసదృశమనే భావనను హిందువులు ప్రతిరోజూ వ్యతిరేకిస్తూనే వున్నారు.

(3) హిందుత్వ హిందూయిజాన్ని కులం నుంచీ దూరం పెట్టటానికి ప్రయత్నిస్తుంది. కాని కుల వివక్షతకు వ్యతిరేకంగా అమెరికాలో చేసిన చట్టాలను "హిందూ వ్యతిరేక" చట్టాలుగా ప్రచారం చేసి వ్యతిరేకిస్తుంది.

(4) హిందుత్వను వ్యతిరేకించడం అంటే అన్ని మతాల ప్రజలకు సమాన గౌరవాన్ని ఇచ్చే లౌకిక భారత దేశాన్ని కోరుకోవడమే.

(5) హిందుత్వ వాక్ స్వాతంత్ర్యాన్ని , పత్రికా స్వాతంత్ర్యాన్ని ప్రేమిస్తుంది. కాని ఆ స్వాతంత్రాలు తనకేగాని , ఇతరులకు వుండకూడదని కోరుకుంటుంది.

ప్రధాని మోడీ పర్యటనకు వ్యతిరేక ప్రదర్శనలు :

భారత ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా అధ్యక్షుడు బిడెన్‌ను కలవడం కోసం సెప్టెంబర్ 23న వాషింగ్టన్ వచ్చారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో 25న ప్రసంగించారు. ఈ రెండు స్థలాలలోనూ హెచ్ఎఫ్హెచ్ఆర్ ఇతర సంస్థలతో కలిసి మోడీ ప్రభుత్వం మానవహక్కులపైనా, లౌకిక ప్రజాస్వామ్యంపైనా చేస్తున్న దాడులకు నిరసనను , మత మైనారిటీలు, దళితులు, రైతులపై భారతదేశంలో అమలవుతున్న వేధింపుల పట్ల తమ వ్యతిరేకతను తెలియజేసింది.

సెప్టెంబర్ 27న జరిగిన భారత్ బంద్‌ను సమర్థిస్తూ, భారతదేశంలో జరుగుతున్న రైతుల నిరసనను చిత్రీకరించిన 'శాంతి దళాలు' అనే వీడియోను ప్రదర్శించింది.

అమెరికాలో హిందూ తీవ్రవాదులు భావప్రకటనా స్వాతంత్ర్యంపై చేస్తున్న దాడులపట్ల , అమెరికన్ పార్లమెంటరీ కమిటీ నిర్వహించిన సమావేశంలో సెప్టెంబర్ 8న అమెరికాలోని వివిధ విశ్వవిద్యాలయాలలోని స్కాలర్లు, ప్రొఫెసర్లు, అధ్యాపకులతో కలి సిహెచ్ఎఫ్హెచ్ఆర్ తన వాదనను వినిపించింది.

ఇంతేకాకుండా సెప్టెంబర్ 22న హెచ్ఎఫ్హెచ్ఆర్ ఇతర సంస్థలతో కలిసి మరొక అమెరికన్ పార్లమెంటరీ కమిటీముందు తమ వాదనను వినిపిస్తూ బిడెన్ మోడీల సమావేశంలో భారతదేశంలో జరుగుతున్న మానవహక్కుల ఉల్లంఘన ఒక చర్చనీయాంశంగా వుండాలని తన వాదనను వినిపించింది.

(39వ పేజీ తరువాయి..)

వహించింది. బద్దలయిన హృదయం నుండి నూత్న రచయితలు స్పందించడం మొదలుపెట్టారు. దీంతో భారతదేశ సామాజికావరణ మారుతూ వున్నది. బ్రాహ్మణీయ హిందుత్వ ముస్లింలకు, దేశంలోని పీడిత కులాలకు, అంతిమంగా శ్రామికవర్గానికి ఇవాళ సవాల్‌గా మారింది. అంతే కాదు. ఈ సమూహాల నుంచి పెల్లుబుకుతున్న సృజనాత్మకత దానికి కూడా సవాలుగా మారింది. ఇది ఇంకా పరిపుష్టం కావాల్సి వుంది. ముస్లిం రచయితలు ఈ ప్రమాదాన్ని అంచనా వేస్తున్నారు. ఈ హిందుత్వ దాడిని బలహీనపరిచే రచనా క్షేత్రంలో వున్నారు.

ఇవాళ ముస్లింవాదం బలహీనమైన స్వరం కాదు. మూడు దశాబ్దాల పైబడిన అణచివేత నుండి బహుపాయలుగా విస్తరించింది. అయితే ముస్లిం కుటుంబాలలోని తమదయిన సంప్రదాయిక చట్రాల్ని కూడా ముస్లిం సాహిత్యం నమోదు చేసింది. తమ కుటుంబాలలోని సకల అప్రజాస్వామిక ధోరణులను బలహీనపరిచే అంశాలను సాహిత్యంలోకి తీసుకు రాగలిగారు. కుటుంబం ప్రజాస్వామికీకరణ చెందాలనే భావన నుండి రచయితలు మాట్లాడారు. ఇదొక ముఖ్యమైన ప్రజాస్వామిక పార్శ్వం. ముస్లిం సాహిత్యం భారతీయ సాహిత్యంలో ప్రజాస్వామిక ధోరణిని భాషలో, వ్యక్తీకరణలో నూతన అంశాలను ప్రోది చేసింది. తెలుగు సాహిత్యంలో కూడా అలాంటి అదనపు చేర్పు అయింది.

ఇప్పటి దాకా ముస్లిం సాహిత్యధోరణిలో భాగమైనవాళ్లు, ప్రగతిశీల వాదులూ ఈ సాహిత్యాన్ని విశ్లేషిస్తూ వచ్చారు. ఈ సాహిత్యానికి తనదైన చరిత్ర ఉన్నది. దాన్ని రాయవలసి ఉంది. దాని అన్ని ప్రత్యేకతలతో సహా అది ఆధునిక ప్రగతిశీల సాహిత్యంలో భాగం. ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రను రాయడానికి సిద్ధం కావడం అంటే ముస్లిం సాహిత్య చరిత్ర రాయడానికి అవసరమైన పద్ధతిని కూడా తయారు చేసుకోవడమే. దానికి తగిన కొన్ని అవగాహనలను ముస్లిం వాదం తప్పక అందిస్తుంది.

కమలా భాసిన్ మాటలు, కవితలు

స్వేచ్ఛ అంటే..

మిత్రులారా , 30-35 ఏళ్లకు పైగా నేను స్వేచ్ఛకు సంబంధించి నినదిస్తున్నాను.. మహిళల స్వేచ్ఛ కోసం, ఆడ పిల్లల స్వేచ్ఛకోసం.. మనలో చాలామంది మహిళా సాధికారత గురించి మాట్లాడుతున్నారు. అయితే మహిళలకు స్వేచ్ఛ ఎలా సాధ్యమవుతుంది అని ఆలోచించాను. ఆ క్రమంలో అనేక అంశాల జాబితానే తయారయ్యింది.. అప్పుడు మన సంస్కృతిని పూర్తిగా ప్రక్షాళన చేయకుండా మహిళా స్వేచ్ఛ సాధ్యం కాదని నాకర్థమయింది. మహిళా స్వేచ్ఛకోసం ఒక సాంస్కృతిక విప్లవమే అవసరం అని నాకు అర్థం అయింది. సాంస్కృతిక విప్లవం అంత ఆషామాషి వ్యవహారం కాదు. అయితే మన విలువల్ని మన జీవితంలోకి తర్జుమా చేయాలనుకుంటే, ఆ విలువల్ని వాస్తవంలో చూడాలనుకుంటే అప్పుడు సాంస్కృతిక విప్లవం ఎంత కష్టమయినా.. మనం తెచ్చుకోవలసే ఉంది.. మీతో నేను నా కవితను పంచుకుంటున్నాను.. మీరూ ఆలోచించండి.. మీ దృష్టిలో మహిళల స్వేచ్ఛా, స్వాతంత్రాలు ఎలా ఉండాలి అనుకుంటున్నారో చెప్పండి. నేను అనుకున్నది చెబుతాను..

ప్రపంచ జనంలోని సగం
ఎప్పటినుంచో అడుగుతోంది ఆజాదీ
పదండి మనం కలిసి ఆలోచనలు చేద్దాం
ఏంటీ ఎలా సాధ్యమీ ఆజాదీ..

ఆడపిల్లల ఉసురు తీయొద్దు
అదీ ఆజాదీ
ఆడపిల్లలకూ ఉండాలి కుటుంబం
అదీ ఆజాదీ
కన్యల దానాలు జరగొద్దు
అదీ ఆజాదీ
ఆడపిల్లలు కూడా కుటుంబానికి గౌరవమే
అదీ ఆజాదీ
ఆడపిల్ల పుట్టకా కావాలి ఒక సంబరం
అదీ ఆజాదీ
కుటుంబ ప్రేమా గౌరవాలు పొందడం
ఆజాదీ
కొడుకుల కన్న తక్కువగా చూడకపోవడం
ఆజాదీ
తాము తక్కువని భావించేలా చేయకపోవడం
ఆజాదీ
ధర్మం పేరిట పండుగ పేరిట
మమ్ముల తక్కువచేసి చూపకపోవడం
ఆజాదీ
అపవిత్రతకు కారాదు మేం చిహ్నం
అదీ ఆజాదీ
మమ్మల్ని శరీరంగా కుదించొద్దు
సినిమా టీవీ ప్రకటనలల్లో..
అత్యాచారాలు జరగొద్దు
వీధిలో, రోడ్డులో, బాజార్‌లలో
కానివ్వొద్దు మమ్మల్ని శాశ్వత నిస్సహాయులను
అదీ ఆజాదీ..
మా ఇచ్చానుసారం జీవించడం
ఆజాదీ
మనసున ఉన్నది నిరభ్యంతరంగా చెప్పగలగడం
ఆజాదీ
ఇష్టపూర్వక రాకా పోకా
ఆజాదీ
బంధాలు నచ్చిన తీరుగా ఏర్పరచుకోవడం
ఆజాదీ
మా శరీరం పై మా హక్కు
ఆజాదీ
ఆటపాటలతో దేహాన్ని వికసించనివ్వడం
ఆజాదీ
నచ్చినట్లు చదవడం చదివించడం
ఆజాదీ
నచ్చిన పని ఎంపికచేసుకోగలగడం
ఆజాదీ
కుటుంబం కోసం తమకోసం సంపాదించుకోగలగడం
ఆజాదీ
తమ కాళ్లపై తాము నిలబడడం
ఆజాదీ
తమని తాముకూడా సంతోషపెట్టుకోగలగడం
ఆజాదీ
తమ భాగ్యవిధాతలు తామే కావడం
అదీ ఆజాదీ
ఎప్పుడైనా తమకు తాము గర్వించగలగడం
ఆజాదీ
సమాన అవకాశ అధికారాలు పొందడం
మనసువిప్పి ఆలోచనలు చెప్పగలగడం
శషభిషలు లేకుండా ప్రశ్నించడం జవాబివ్వడం
నియంత్రణలు లేకుండా తమ కలల్ని నెరవేర్చుకోవడం
ఇదే ఆజాదీ

మనసున ఎటువంటి భయాలు లేకపోవడం
ఆజాదీ
మేమూ తల ఎత్తుకుని నడవగలడం
ఆజాదీ
మాకూ మా గూడు ఉండడం
అప్పుడు 'ఆజాదీ
మాకూ సమాజంలో గౌరవం ఉన్నపుడు
ఆజాదీ
మనసున విశ్వాసం ఉంటే
అప్పుడు ఆజాదీ
బలం ధైర్యం మనోబలం అయినప్పుడు
అదీ ఆజాదీ
మాకూ గుర్తింపు ఉన్నపుడు
అదీ ఆజాదీ
మాకూ గౌరవాదరాలు దొరికినప్పుడు
అదీ ఆజాదీ
సంఘ స్వాతంత్రంతో సమానమైన బాధ్యతే ఆజాదీ
పిల్లచెష్టల దెప్పిపొడుపుల వ్యవహారం కాదు ఎంతమాత్రం
మేము కుటుంబాలకు భారం కారాదు
అదీ ఆజాదీ
మేం అబలలుగా సంచరించే స్థితి లేకపోవడం
ఆజాదీ
మరెవరిలాగో కాక మేము మాలాగే ఉండగలగడం
ఆజాదీ
జీవిత దిశను మార్చుకోగలగడం
ఆజాదీ
సాయం కోసం దిక్కుతోచని స్థితి లేకపోవడం
అదీ ఆజాదీ
ఇతరులకు తాము సహకరించగలగడం
అదీ ఆజాదీ
మంచి స్నేహితుల తోడు ఉండడం
అది కూడా ఆజాదీ
సాంఘటితమవ్వడం, ఐకమత్యం చాటడం
అదీ ఆజాదీ
స్వేచ్ఛా సమానత్వాల నాగరికత
ఆజాదీ
అన్నిరకాల స్వయంప్రతిపత్తి
ఆజాదీ..

మీరందరూ ఆలోచించండి. అందరూ కలిసి ఈ జాబితాను రూపొందిద్దాం, మనం ఏమేమి చేయాలో. నినాదాలివ్వడం తేలికే.. వాటిని మనమే నిజం చేయాలి..

(మూడేళ్ళ క్రితం రికార్డ్ చేసిన యూ ట్యూబ్ వీడియాలో కమలా భాసీన్ హిందీలో చెప్పిన మాటలకు తెలుగు అనువాదం: రాంకీ)

నీ తోడు

నీ తోడు దొరికి
విశ్వాస బలం పురివిప్పింది...
నవలోక నిర్మాణపు కాంక్ష
మళ్ళీ ఉరకలెత్తింది...

ఒక ఒంటరితనంలో నేనూ
ఏదో ఏకాంతంలో నువ్వూ
ఇద్దరిలోనూ
ఆవరించిన అసహాయతే..
ఇద్దరిలోనూ
చేజారిన విజయాల వేదనే..

గుండెలు పేల్చే
విషాదవేళ..
ఊపిరిసలుపని ఘడియల్లో
తోడైనిలిచింది నీచెలిమి...

నాకు నువ్వు కొంతా
నీకు నేను కొంతా
అర్థమయ్యాం..
వెరసి ఇద్దరమూ
ప్రేమికులమయ్యామేమో అనిపిస్తున్నది...

కొత్త బంధాల్నీ
కొంగ్రొత్త అనుబంధాల్నీ..
హరివిల్లై విప్పార్చింది నీతోడు...

ఒకే ఆలోచనై
విరబూసిన మనం..
ఒకే ఆచరణై పరిమళిద్దాం...

వసంతమైనా శిశిరమైనా
ఏదేమైనా..
ఋతురాగం ఏదైనా..
ఒకరికొకరం బలమయ్యాం
బలీయమైన బంధమయ్యాం...

సప్తవర్ణ స్వప్నాల
పులకింత నీతోడు...

హిందీ నుండి అనువాదం: ఉజ్వల్
(కమలా భాసీన్ తొలితరం స్త్రీవాద రచయిత, సామాజిక కార్యకర్త. సెప్టెంబర్ 25న తన 76వ ఏట అనారోగ్యంతో మరణించారు.)

ప్రకటన:

ప్రజా కళామండలి నాయకుడు కా. కోటీకి మరో పీటీ వారంట్

జీ. మాదుగల కేసులో ఉదయం బెయిలు, మధ్యాన్నానికి పిడుగురాళ్ల కేసు

ప్రజా సాంస్కృతికోద్యమ నాయకుడు, గాయకుడు కా. కోటి మీద పోలీసుల వేధింపులు ఆగలేదు. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రజా సంఘాల నాయకులపై పెట్టిన కేసుల్లో కోటి 9 నెలలుగా జెయిల్లో ఉంటున్నాడు. మిగతా వాళ్లకు బెయిలు ఇచ్చిన కేసుల్లో సహితం ఆయనకు బెయిలు ఇవ్వకుండా ఇంత కాలం వేధించారు. చివరికి గత మంగళవారం జి. మాదుగుల కేసులో కోర్టు బెయిలు ఇచ్చింది. ఆ తర్వాత కొన్ని గంటల్లోనే పిడుగురాళ్లలో మరో తప్పుడు కేసులో పీటీ వారంట్ తీసుకొచ్చి ఆయన విడుదల కాకుండా అడ్డుకున్నారు. నిజానికి ఈ కేసులో అరెస్టయిన మిగతా ప్రజా సంఘాల బాధ్యులకు స్థానిక కోర్టులో బెయిలు వచ్చింది. అదే కేసులో కోటికి బెయిలు కోసం హై కోర్టుకు వెళ్లాల్సి వచ్చింది. రిమాండ్ 6 నెలలు నిండాక స్టాట్యూటరీ బెయిల్ ఇస్తామని కోర్టు చెప్పింది. చివరికి తొమ్మిది నెలల తర్వాత హైకోర్టు ఒక చేత్తో బెయిలు ఇవ్వడం, మరో చేత్తో పీటీ వారంట్ ఇష్యూ చేయడం రెండూ కొన్ని గంటల వ్యవధిలో జరిగిపోయాయి.

బెయిలు పొందే హక్కును న్యాయస్థానం పోలీసులతో కలిసి ఇలా అవమానపరిచింది. కుట్ర పూరితంగా వ్యవహరించిందని అనవలసి వస్తోంది. పిడుగురాళ్ల కేసులో కూడా కోటిని అదుపులోకి తీసుకోవాలని అనుకుంటే ఈ పీటీ వారెంట్ ఏదో ముందే ఇవ్వవచ్చు. ఆయన విశాఖ జెయిల్లోనే ఉన్నాడు. అక్కడే ఉన్న మిగతా నిందితులకు ఆ సమయంనే బెయిలు ఇచ్చారు. ఇవేమీ చేయకుండా కక్ష సాధింపుగా పోలీసులు, న్యాయస్థానం కూడబలుక్కొని వ్యవహరించాయని అనుమానించాల్సి వస్తోంది.

కోటిని డిసెంబర్ 23 న హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో విశాఖ పోలీసులు ముంచింగిపుట్టు కేసులో అరెస్ట్ చేసి తీసుకెళ్లారు. ఆ తరువాత ఆ కేసు ఎన్ఐఏ కు బదిలీ అయింది. ఏప్రిల్ నెల మధ్యలో ఆయనకు జి. మాడుగుల కేసులో పిటి వారెంట్ ఇష్యూ అయింది. ఎన్ఐఏ కేసులో మే నెలలో బెయిల్ వచ్చింది. ఆ వెంటనే తెలంగాణ పోలీసులు ఏనాడో పెట్టిన ఎల్ బి నగర్, ములుగు తప్పుడు కేసుల్లో పిటి వారెంట్ వేశారు. ఈ కాలంలోనే కోటి వాళ్ళ నాన్న చనిపోయారు. ఆ విషయం కూడా జైలు అధికారులు ఆయనకు తెలియజేయలేదు. అంత్యక్రియలకు హాజరు అయ్యేందుకు కూడా అనేక ఇబ్బందులు పెట్టారు. ఎల్బీ నగర్ కేసులో విచారణ పేరుతో సంకెళ్లతో, చైన్‌లతో కట్టివేసి ఆయనను హైదరాబాదులోని ఇంటికి తీసుకెళ్లి సోదాలు నిర్వహించారు. అప్పటికే ఎన్ఐఏ అధికారులు ఆయన ఇంట్లో సోదాలు చేశారు. అయినా చట్ట వ్యతిరేకంగా సంకెళ్లతో తీసుకొని వచ్చి కుటుంబసభ్యులను, ఆ ప్రాంతంలోని వాళ్లందరినీ భయపెట్టేలా వ్యవహరించారు.

గత ముప్పై ఏళ్లుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో తన ఆట పాటలతో ప్రజా ఉద్యమాలకు అండగా నిలిచి, ప్రముఖ సాంస్కృతిక కార్యకర్తగా, ప్రజా కళా మండలి నాయకుడిగా గుర్తింపు పొందిన కోటితో అక్రమ కేసులు పెట్టడమే గాక చట్ట వ్యతిరేకంగా గొలుసులతో బంధించి 'నేరస్థుడి'గా చిత్రించే దుర్మార్గ ప్రయత్నం చేశారు.

చివరికి ఎల్‌బీ నగర్, ములుగు కేసుల్లో బెయిల్ వచ్చాక కూడా జి. మాడుగుల కేసులో బెయిల్ ఇవ్వకుండా వేధించారు. 9 నెలలు తరువాత ఏపీ హై కోర్టు బెయిల్ ఇచ్చి పిడుగురాళ్ల కేసులో పిటి వారెంట్ తీసుక రావడం అంటే ఆయనను వీలైంత ఎక్కువ కాలం జెల్లో నిర్బంధించాలనే దురుద్దేశం ప్రభుత్వానికి ఉన్నదని అర్ధమైపోయింది. కుటుంబానికి, పౌర జీవితానికి, తను నమ్మిన సాంస్కృతికోద్యమానికి ఆయనను దూరంగా జైలు గోడలకు

కామ్రేడ్ గొంజాలోకు జోహార్లు

పెరూ తొలితరం మావోయిస్టు, షైనింగ్ పాత్ నిర్మాత, ప్రజాయుద్ధ సంస్కృతిని లాటిన్ అమెరికా పోరాట ఆచరణలో ఎత్తిపట్టిన గొప్ప మార్క్సిస్టు-లెనినిస్టు కామ్రేడ్ గొంజాలోకు విప్లవ రచయితల సంఘం జోహార్లు! ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని వెలిగించిన 1980ల తరం మావోయిస్టు మేధావి చివరి ముప్పై ఏళ్ల జీవితం జైలులోనే గడిచిపోయింది. పెరూలోని నావికా స్థావరంలోని ఆస్పత్రిలో 2021 సెప్టెంబరు 11వ తేదీన గొంజాలో 86 ఏళ్ల వయసులో తీవ్ర అనారోగ్యంతో మరణించారు. కొంతకాలంగా పార్కిన్సన్, చర్మ కేన్సర్‌తో ఆయన బాధపడుతున్నారు. ఈ స్థితిలో కూడా ఆయనకు వైద్య సాయాన్ని ప్రభుత్వం నిరాకరించింది. చివరకు తన భార్యతో ఇంటర్వ్యూను సైతం రద్దుచేసింది. దీనికి నిరసనగా ఈ ఏడాది జూలై నుంచి ఆయన ఆహారం తీసుకోవడం లేదు. జైలులో గొంజాలో ప్రారంభించిన నిరాహార పోరాటానికి సంఘీభావంగా లాటిన్ అమెరికా, యూరప్, ఆసియా, ఆఫ్రికా ఖండాల్లో గత రెండు నెలలుగా ప్రత్యక్ష ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఆయన విడుదల కోరుతూ అన్ని దేశాల్లోని పెరూ రాయబార కార్యాలయాల ఎదుట నిరసనలు జరిగాయి. ఆయన ప్రాణాలను కాపాడాలని ఐక్యరాజ్యసమితి సహా పలు అంతర్జాతీయ సంస్థలకు వినతులు వెల్లువెత్తాయి.

భారతదేశంలోని కొన్ని నగరాల్లోనూ గొంజాలో సంఘీభావ కార్యక్రమాలు జరిగాయి. ఈ ఒత్తిళ్లకు తలవంచిన పెరూ ప్రభుత్వం చివరకు నావికా స్థావరంలోని ఆస్పత్రికి తరలించింది. జీవితాంతం సాగించిన కష్టతరమైన, దీర్ఘకాలిక పోరాటాన్ని అక్కడా కొనసాగిస్తూనే గొంజాలో తుదిశ్వాస విడిచారు.

కనీసం రెండు దశాబ్దాలకాలం ప్రభాతాల జడిలో ప్రపంచాన్ని షైనింగ్‌పాత్ ఉద్యమం ముంచెత్తింది. 'ఇది విప్లవాల యుగంలి అని ప్రకటించిన చైనా సాంస్కృతిక విప్లవం ఈ ఉద్యమానికి స్ఫూర్తి. భారత్‌లో నక్సల్బరీ వసంతమేఘం, పారిస్‌లో ఆగ్రహ విద్యార్థులు, పెరూలో షైనింగ్‌పాత్ ఉద్యమం దాదాపు ఒకేసారి మొదలయ్యాయి. ఉత్పత్తి- ప్రయోగం-యుద్ధం ద్వారా నిర్మాణమయి, విస్తరించే దీర్ఘకాలిక సాయుధ పంథాను పెరూలో గొంజాలో నిర్మించారు. గొంజాలో ఆలోచనా విధానంగా దీనిని ఉద్యమ సహచరులు పిలుస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోకి ఈ అవగాహన శరవేగంగా చొచ్చుకెళ్లింది. చాలా ప్రాంతాల్లో విప్లవ భూసంస్కరణలను ఉద్యమం చేపట్టింది. ఉన్నత విద్యావంతుడైన గొంజాలో, తాను చేస్తున్న ప్రొఫెసర్ ఉద్యోగాన్ని వదిలి, 1960 చివర్లో పూర్తికాలం ఉద్యమజీవితాన్ని ఎంచుకున్నారు. విప్లవ తపనతో కొన్ని పొరపాట్లు చేసినప్పటికీ, యుద్ధ స్వభావాన్ని ప్రజా సంస్కృతే నిర్ధారించాలన్న మావోయిస్టు మూల సూత్రాన్ని పెరూలో ఆచరించి అద్భుత ఫలితాలను అందుకున్నారు. కేంద్ర కమిటీ సమావేశభవనంలో మిగతా నాయకులతోపాటు గొంజాలో 1992లో అరెస్టు అయ్యేనాటికి ఉద్యమం మూడువంతుల గ్రామాలను విముక్తిచేసి, పట్టణాలపై పట్టు బిగిస్తోంది. ఒక విప్లవ సంకేతంగా షైనింగ్‌పాత్ ప్రపంచవ్యాప్త పోరాటాలను, కవులు, రచయితలను ఊపేస్తోంది.

అమెరికా సామ్రాజ్యవాదులు ఎల్ఐసీ (మంద్రస్థాయి యుద్ధం) పద్ధతుల్లో ఈ దశలోనే ఉద్యమంపై విరుచుకుపడ్డారు. పట్టణాలను అనుకొని ఉన్న మైదాన గ్రామాల్లో ఇన్ఫార్మర్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసుకొన్నారు. ఉద్యమాన్ని అణచడానికి నమ్మకద్రోహులతో ప్రత్యేకంగా ఒక డిపార్టుమెంటునే పెరూ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఎల్ఐసీ ఉచ్చును వెంటనే గ్రహించలేక, గ్రహించినా ప్రతివ్యూహం రచించేంత వ్యవధి లేక మూకుమ్మడిగా నాయకత్వమంతా ఒకేసారి దొరికిపోవడంతో పెరూలో

తాత్కాలికంగా సామ్రాజ్యవాదులదే 'పైచెయ్యిలి అయింది. కోర్టులో గొంజాలో విచారణ ఒక ప్రహసనంలా సాగింది. విచారణ మొదలైన కొన్ని గంటల్లోనే ఆయనకు కోర్టు రెండు యావజ్జీవ కారాగార శిక్షలను విధించింది. గొంజాలో క్షేమం కోసం, ఆయన విడుదల కోసం ప్రపంచమంతటా ఈ సమయంలో జరిగిన ఆందోళనల కారణంగానే అంత హడావుడిగా విచారణ తంతును పూర్తిచేశారు. పోరాట భూమిలో నిలిచిన గొంజాలోను నేరుగా ఎదుర్కోలేకపోయారు. కనీసం తమ చేతికి చిక్కిన తర్వాతైనా పెరూ పాలకులు ప్రశాంతతను .పొందారా అంటే..అదీ లేదు.

ఎంత గడ్డు కాలమది! ఏ ఉద్యమానికైనా ఆటుపోట్లు సహజం. సాధించుకున్న విజయాలను ఒక్కోసారి కోల్పోవాల్సి రావచ్చుకూడా. అయినా మొండిగానైనా కాడిని వదిలిపెట్టకుండా ఉద్యమాన్ని నిలుపుకొనే ఉదంతాలెన్నో! పెరూ ఉద్యమ అనుభవం అలాంటిది కాదు. ప్రజలు తయారుచేసుకున్న నాయకత్వమంతా ఒక్క అరెస్టుతో తుడిచిపెట్టుకుపోయింది. అంతకుమించిన నష్టం ఎల్ఐసీ ట్రాప్‌లో పడి నాయకుల మధ్య పెరిగిపోయిన అపనమ్మకాలు కొనితెచ్చాయి. ఈ పరిస్థితుల్లో అరెస్టు అయి జైలుకు పోయినవారు పోగా బయట మిగిలిపోయిన కొద్దిమంది సైతం ఉద్యమాన్ని నిలబెట్టలేకపోయారు. "ఉద్యమాన్ని మా శత్రువు ఏమీ చేయలేకపోయాడు. పరస్పర అపనమ్మకాలతో మేమే చంపుకొన్నాం" అని గొంజాలో నిజాయితీగానే అంగీకరించారు. ఇంత ప్రతికూలతలోనూ.. మావోయిస్టు ఉద్యమం, ప్రజాయుద్ధ సంస్కృతి పట్ల చివరివరకు ఆయన సానుకూల దృక్పథాన్నే ప్రదర్శిం చారు. "నేను ఈరోజు ఉండవచ్చు. లేకపోవచ్చు. కానీ ఆలోచనలు మాత్రం ఉంటాయి. అవి ఒకరి నుంచి ఒకరికి ప్రవహించినం తకాలమూ కమ్యూనిజం అజేయం. కమ్యూనిస్టులు జయిస్తారు" అన్న గొంజాలో సందేశాన్ని మనమంతా ఎత్తిపడదాం!

అరసవిల్లి కృష్ణ, అధ్యక్షుడు, **బాసిత్**, ఉపాధ్యక్షుడు,
రివేరా, సహాయ కార్యదర్శి,
విప్లవ రచయితల సంఘం, 15-9-2021

కామ్రేడ్ జీతన్ మరాండీకి జోహార్లు

ఉరికొయ్యలను దాదాపుగా తాకిన సాంస్కృతిక విప్లవ గొంతుక, జార్ఖండ్ అభేన్ నాయకుడు జీతన్ మరాండీకి జోహార్లు. ప్రజలను చైతన్యవంతం చేస్తున్న పాటపై సుదీర్ఘ కాలం సాగిన వేట మరాండీని మానసికంగా బలహీనపరచలేకపోయింది. కానీ, ఆయన ఆరోగ్యాన్ని మాత్రం బాగా దెబ్బతీసింది. ఓ తప్పుడు హత్య కేసు నుంచి 2013లో మరాండీ బయటపడ్డారు. అరెస్టు సమయంలో చేసిన ఇంటరాగేషన్‌లో పోలీసు అధికారులు చూపించిన నరకం వల్ల జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా అనారోగ్య సమస్యలు వేధించాయి. ఈ నెల 12వ తేదీన బాగా జబ్బుపడిన ఆయనను ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ వైద్య చికిత్స అందిస్తుండగానే 13న జీతన్ మరాండీ మరణించారు. ఆయన సహచరి అపర్ణ కూడా సాంస్కృతిక కార్యకర్తే. జీతన్, అపర్ణ ఇద్దరూ తెలంగాణ, ఆంధ్రా నేలలకు పరిచయమైన గొంతుకలు. సహచరుడు జీతన్ విడుదల కోసం విరసం, ఇతర ప్రజాసంస్థలు హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన సభల్లో అప్పట్లో అపర్ణ పాల్గొన్నారు. జీతన్ కూడా తాను విడుదలయి బయటకు వచ్చిన మరుసటి ఏడాది హైదరాబాద్‌లో జరిగిన ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక కార్యక్రమానికి హాజరయ్యారు. ఆ క్రమంలో ఆయన బృందం అరెస్టు అయింది. ఆ తరువాత 2014 లో ప్రజాకళామండలి మహాసభలకు హాజరయ్యారు. అంతకుముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో పీపుల్స్‌వార్, జనశక్తి పార్టీలు జరిపిన చర్చలు, ఐక్య మావోయిస్టు పార్టీ ఆవిర్భావం సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన సాంస్కృతిక వేదికలపై జార్ఖండ్ అభేన్ తరఫున జీతన్ బృందం కళా ప్రదర్శనలు ఇచ్చింది. నేలను ఎగదన్ని పైకి తన్నుకొచ్చిన ఊచలాంటి శరీరంతో వేదికపై కదలాడే జీతన్ రూపం మన కళ్లలో కదలాడుతూనే ఉంటుంది.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో చెరబండరాజు, శివసాగర్, వంగపండు, గద్దర్ పాట ఎంత ప్రసిద్ధమో, జార్ఖండ్‌లో జీతన్ మరాండీ పేరూ, ఆయన గొంతూ అంత ప్రముఖమైనవి. పలు భాషల్లో ఆయన పేరిట ఆడియో, వీడియో సీడీలు విడుదలయ్యాయి. జార్ఖండ్ అభేన్ ఉమ్మడి ఆచరణలో భాగమవుతూనే తనకుండే ప్రత్యేక కళా కౌశలం వల్ల జీతన్ పేరు వ్యక్తిగతంగానూ జార్ఖండ్ సంథాల్ ఆదివాసీ సమాజం నాలుకలపై నిలబడిపోయింది. జార్ఖండ్‌లోని గిరిధి జిల్లా సుదూర్‌లో జన్మించిన జీతన్‌కు సీపీఐ రాజకీయాలు తొలి ప్రేరణ. ఆ తర్వాత ఆయన చాలా దూరమే ప్రయాణించారు. కళను వాహిక చేసుకుని ప్రజా సమస్యలపై పనిచేస్తూ, తనలా ఆలోచించే మరికొందరితో కలిసి జార్ఖండ్ అభేన్ అనే కళాసంస్థను ఏర్పాటుచేశారు. విరసం వ్యవస్థాపకుడు, మార్క్సిస్టు సాహిత్య విమర్శకుడు కేవీఆర్ వంటివారి పూనికతో ఏర్పడిన ఏఐఎల్ఆర్‌సీలో ఈ సంస్థ కూడా భాగస్వామి. జీతన్ ప్రేరణాత్మక వక్త కూడా. తన ఉపన్యాసాల కారణంగా అరెస్టు కూడా చేశారు. గుర్తించిన సమస్యలపై అప్పటికప్పుడు పాట కట్టేవారు జార్ఖండ్ అభేన్ కళా ప్రదర్శనలు చాలావరకు జనం మధ్య తయారయినవే. ప్రదర్శనలకు ముందు జీతన్ ప్రసంగించేవారు. అయితే అది వాచ్యంలా కాకుండా ఆ ప్రసంగమూ ప్రదర్శనలో అనివార్యమైన, అవిభాజ్యమైన అంగమన్నట్టు అమరేది.

అవిభాజ్య బిహార్ నుంచి 2000లో వేరుపడేటప్పుడు సంథాల్ ఆదివాసీ సమాజానికి ఇచ్చిన ఏ హామీనీ జార్ఖండ్ నూతన ప్రభుత్వం నిలబెట్టుకోలేదు. జనాభాలో మూడొంతులుగా ఉన్నప్పటికీ, ఆదివాసీల

సాంస్కృతిక ప్రతిష్టను నిలిపే చర్యలేవీ అప్పటి బాబూలాల్ మరాండీ ప్రభుత్వం తీసుకోలేదు. పైగా ఆదివాసీలను అడవులనుంచి బేదఖలు చేసేందుకు ప్రైవేటు హంతక సాయుధ ముఠాలను సృష్టించింది. వేర్పాటుతో జార్ఖండ్ ఒక సాంస్కృతిక క్షేత్రం అవుతుందని జీతన్ వంటి కళాకారులు ఎంతో ఆశించారు. ఆ కలలు రక్తసిక్తమవ్వడం కళ్లారా చూసినవాడిగా తన సంథాల్ ఆదివాసీ జాతి కోసం జీతన్ నిలబడ్డారు. అడవి ఎవరిది అని ప్రశ్నించి జైలుపాలైన వేలాదిమంది ఆదివాసీల కోసం నిలబడ్డారు. ఈ క్రమంలోనే రాజకీయ ఖైదీల విడుదల కమిటీ ఆచరణలో భాగమయ్యారు. రాంచీలో 2007లో జరిగిన కమిటీ సభలో పాల్గొని, తొలిసారి అరెస్టు అయ్యారు. ఆ తర్వాత కూడా అనేకసార్లు పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పారు. ఈ క్రమంలోనే 2008 ఏప్రిల్ ఐదో తేదీన మాజీ ముఖ్యమంత్రి బాబూలాల్ మరాండీ కుమారుడు అనూప్ మరాండీ, మరో 19 మంది హత్యల కేసును జీతన్ మరాండీపై మోపారు. విస్థాపన్ విరోధి జన వికాస్ ఆందోళన సంస్థ నిర్వహించిన ఆందోళనలో పాల్గొని ఇంటికి తిరిగి వస్తుండగా మఫ్టీలో పోలీసులు ఎత్తుకుపోయారు. గనుల తవ్వకాలను వ్యతిరేకిస్తున్న ఈ సంస్థలో జాతీయ కమిటీ సభ్యుడు జీతన్. గనుల యజమానుల కోసమని జార్ఖండ్‌లో అధికార పార్టీ, విపక్ష పార్టీ కలిసిపోయాయి. మాజీ ముఖ్యమంత్రి బాబూలాల్ మరాండీ కుమారుడు అనూప్ మరాండీ ఆదివాసీలు, మావోయిస్టులను నిర్మూలించడం కోసం హర్మత్ వాహిని అనే ప్రైవేటు హంతక ముఠాను ఏర్పాటుచేశాడు. వాహిని సభపై మావోయిస్టులు 2007లో జరిపిన దాడి ఘటనే చిల్ఖారీ ఊచకోతలుగా సంచలనం రేపాయి. ఈ ఘటనలో జీతన్ మరాండీ అనే మావోయిస్టు కార్యకర్త పాల్గొన్నట్టు ఎఫ్ఐఆర్‌లో రాసుకున్న పోలీసులు కళాకారుడు జీతన్ మరాండీని ఈ కేసులో అక్రమంగా ఇరికించారు. అనిల్ రామ్, మనోజ్ రాజ్వర్, ఛత్రపతి మండల్‌లను ఇతర నిందితులుగా చూపారు. చిల్ఖారీ ఘటనకు మించిన సంచలనాత్మక రీతిలో ఈ నలుగురికీ గిరిధి సెషన్స్ కోర్టు ఉరిశిక్ష ప్రకటించింది.

జీతన్ సహచరుల కేసులో పర్యావసరాలు ఎలా మొదలై ఎలా ముగిశాయనేది ఇప్పుడు చరిత్రలో భాగం. కానీ, కేసు నడిచిన ఐదేళ్ల కాలం న్యాయవ్యవస్థపై గట్టి ప్రశ్నలను సంధించింది. మరో కెన్‌సారోవివాను బలి కానివ్వబోమంటూ దేశవ్యాప్తంగా మేధావులు, కవులు, కళాకారులు కదిలారు. జీతన్ కోసం జరిగిన ప్రధాన ఆందోళనలకు హైదరాబాద్ వేదికగా మారింది. సహ కళాసంస్థలతో కలిసి ప్రధాన కార్యాచరణలో విరసం భాగమైంది. కవులు, రచయితలను ఉరిశిక్షకు వ్యతిరేకంగా అప్పట్లో పెద్దఎత్తున కదిలించిన విరసం వ్యవస్థాపక సభ్యుడు కామ్రేడ్ వరవరరావు, సీనియర్ సభ్యుడు ప్రొ. జిఎన్ సాయిబాబాలు స్వయంగా ఇప్పుడు నిర్బంధంలో ఉన్నారు. జీతన్ స్వేచ్ఛ కోసమే కాకుండా రాజ్యం నుంచి కళలను రక్షించుకోవాలని తపించిన ప్రజాకళామండలి కార్యదర్శి జె. కోటేశ్వరరావు ఇప్పుడు తానే ఒక జైలు కోకిల. జీతన్ విడుదల సందర్భంగా 'అంతిమంగా సత్యమే పరిఢవిల్లింది' అని ప్రకటించిన స్టాన్‌స్వామిని ఇటీవల నిర్బంధం మింగేసింది. ఇంతలోనే సంభవించిన జీతన్ మరాండీ మరణం జార్ఖండ్ ఆదివాసీ సమాజానికి, సహచరి అపర్ణకు కలిగించిన దుఖఃన్ని విరసం పంచుకుంటోంది. భూమి, శ్రమ, ఆత్మగౌరవం, వైవిధ్య జీవనవిలువలతో ముడిపడిన సాంస్కృతిక విప్లవ కర్తవ్యాలను పరిపూర్తి చేయడమే జీతన్ మరాండీకి నిజమైన నివాళి.

అరసవిల్లి కృష్ణ, అధ్యక్షుడు
బాసిత్, ఉపాధ్యక్షుడు
రివేరా, సహాయ కార్యదర్శి
విప్లవ రచయితల సంఘం, 1, అక్టోబర్ 2021

పరిమితం చేయాలనే దురుద్దేశమే దీనికి కారణం.

పైగా ఈ కేసుల్లో న్యాయస్థానం బెయిలు ఇచ్చిన తీరు కూడా అన్యాయమైనదే. హేతురహితమైనదే. జి మాడుగుల కేసులో అయన రోజూ జి.మాడుగుల వెళ్లి సంతకం పెట్టాలి అని కండీషన్ పెట్టారు. ముంచింగిపుట్టు కేసులో ప్రతి రెండో శనివారం విజయవాడ ఎన్ఐఏ ఆఫీసులో హాజరు కావాలనే నిబంధన పెట్టారు. అలాగే ములుగు కేసులో మూడు నెలలు పాటు ప్రతి మంగళవారం ములుగు పోలీస్ స్టేషన్లో సంతకం పెట్టాలి. అలాగే ఎల్బీ నగర్ వారంలో ఒకటి రెండు సార్లు సంతకాలు పెట్టాలి. హైదరాబాదులో నివసిస్తున్న వ్యక్తి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆ చివరి నుంచి ఈ చివరి దాకా వెళ్లి ప్రతి రోజూ, వారానికి రెండుసార్లు వెళ్లి సంతకాలు పెట్టడం ఎలా సాధ్యం అవుతుందనే కనీస హేతుదృష్టిని కూడా న్యాయస్థానాలు ప్రదర్శించలేదు. ఈ కండీషన్లను చూస్తే ఇది బెయిలా? లేక ఆ పేరుతో అదనపు శిక్షా? అర్థం కావడం లేదు. ఏపీలో, తెలంగాణలో కోటి నిందితుడుగా ఉన్న అక్రమ కేసుల్లో అరెస్టయిన ఇతర ప్రజాసంఘాల నాయకులకు ఇచ్చిన బెయిళ్లలో కూడా ఇలాంటి అన్యాయమైన కండీషన్లు పెట్టారు. పైగా జైలు నుంచి విడుదలైన వారి బెయిళ్లను రద్దు చేయించడానికి ఇప్పటికే పోలీసులు కోర్టులో ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు నోటీసులు కూడా ఇస్తున్నారు.

ఇవన్నీ చూస్తే పోలీసులు అక్రమ కేసులకు తోడు న్యాయస్థానాల అన్యాయమైన కండీషన్లతో బెయిళ్లు ఇవ్వడం, తిరిగి వాటినీ రద్దు చేయాలనుకోవడం చూస్తే రెండు తెలుగు రాష్ట్రాల్లో పోలీసులు, న్యాయస్థానాలు కూడబలుక్కొని పని చేస్తున్నాయని అర్థం అవుతోంది. దీని వెనుక రాజకీయ దురుద్దేశ్యాలు, కుట్రలు ఉన్నాయని స్పష్టమవుతోంది. ఈ స్థితిని అర్థం చేసుకొని ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు పూనుకోవాలని విరసం అందరికీ విజ్ఞప్తి చేస్తోంది.

అరసవిల్లి కృష్ణ, విరసం అధ్యక్షుడు
28, సెప్టెంబర్

శిరోమణి వ్యాసంపై నా అభ్యంతరాలు

అరుణతార ఆగస్ట్ 2021 సంచికలో కరుణాకర్ స్మృతిలో శిరోమణి రాసిన 'నన్ను తీర్చిదిద్దిన కరుణన్న' అనే వ్యాసం పట్ల నాకు కొన్ని అభ్యంతరాలు ఉన్నాయి. క్యాజువల్ గా మాట్లాడుకునే విషయాల్ని సీరియస్‌గా తీసుకోకూడదు కానీ, అవే అచ్చులోకి వచ్చినప్పుడు చరిత్రగా నమోదవుతాయి. చరిత్ర ఊహాగానాల మీదో, కల్పితాల మీదో ఆధారపడి ఉండకూడదు.

శిరోమణికి, కరుణ కుటుంబానికి దగ్గర సంబంధాలు ఉన్నాయి అని తెలుసు కానీ 22 సంవత్సరాల క్రితం జరిగిన వాళ్ళ పెళ్ళిసమయంలో శిరోమణి తన పాత్రని కొంచెం ఎక్కువగా రాసుకున్నాడు. ఎవరైనా "నేను" అని రాసే ఏ వ్యాసంలోనైనా నేను చుట్టూనే ఎలాంటి చరిత్ర అయినా తిరుగుతుంది. కరుణ, ఝాన్సీ వాళ్ళ పెళ్లి మా జిల్లాలో ఒక సంచలనం. వాళ్ళ పెళ్లికి సంభందించిన చర్చలు , కార్యక్రమాలు దాదాపు 90 శాతం ఒంగోలులోని మా చిన్ని ఇంటిలోనే జరిగాయి. అప్పటికే చీమకుర్తి లో పని చేస్తున్న శిరోమణి ఆ చర్చల్లో పాల్గొనలేదు. మా ఇల్లు వేదికగా ఉండేది కనుక జరిగిన చర్చల్లో, తీసుకున్న నిర్ణయాల్లో తప్పనిసరిగా మా పాత్ర ఉండేది. కరుణ, ఝాన్సీ పెళ్లి విషయంలో కరుణ వాళ్ళు నడిపే కాన్వెంట్ లో పార్టనర్, టీచర్ అయిన వీరయ్య అన్నది ప్రధాన పాత్ర. కరుణకి, ఆ చుట్టుపక్కల ఊర్లోని చాలామందికి ప్రగతిశీల భావాల పరిచయం అవడానికి వీరయ్యన్నే ప్రధాన కారకుడు. వీరయ్యన్న, శిరోమణి మామయ్య బాబు, దిలీప్, హనుమంతరావు ఈ పెళ్లి విషయంలో మా ఇంట్లో చర్చలు జరిపారు. పెళ్లికి కరుణ ఇంటిలో వారు ఇష్టపడలేదు. ఝాన్సీ వాళ్ళింట్లో పెద్దగా అభ్యంతరం చూపలేదు. కరుణ వాళ్ళ నాన్న కరస్పాండెంట్ గా నడిపే కాన్వెంట్లో కరుణ, వీరయ్యన్న భాగస్వాములుగా ఉండేవారు. ఆ కాన్వెంట్ కి అంత మంచి పేరు, గుర్తింపు రావడానికి కరుణ, వీరయ్యన్న ప్రవేశపెట్టిన సృజనాత్మక కార్యక్రమాలే ప్రధాన కారణం. ఝాన్సీ కూడా ఆ కాన్వెంట్‌లో టీచర్‌గా చేరాక వారిద్దరి మధ్య ప్రేమ మొదలైంది. పెళ్ళి ఇంట్లో ఒప్పుకోరు, ఉద్యోగం ఉండాలను కున్నారు. 98 లో టీచర్ గా రాచపూడిలో చేరాడు.

శిరోమణి తన వ్యాసంలో రాసినట్టు ఝాన్సీతో నేను మాట్లాడినప్పుడు శిరోమణి లేడు. మేం మాట్లాడింది ఏమిటో తెలుసుకొని రాయొచ్చు. ఝాన్సీ, నేనూ శిరోమణికి అందుబాటులోనే ఉన్నాం. కానీ మా ఇద్దరిలో ఎవరినీ సంప్రదించలేదు. తన ఊహాగానాల మీద ఆధారపడి రాయడం సరైంది కాదు.

1. ఝాన్సీ తో నేను మాట్లాడిన విషయం -" ఝాన్సీ మీ ఇంట్లో మీ పెళ్లి విషయం తెలుసా? అన్నీ ఆలోచించుకున్నావా? నీ ఎదురుగా ఓ భార్యా భర్త నడిచి వెళుతుంటారు. సినిమాలు, షికార్లకు వెళుతుంటారు. కరుణతో నీకు అది కుదరదు. వాళ్ళతో మిమ్మల్ని పోల్చుకుంటే సమస్యే" అన్నాను.

"అన్ని విషయాలని, అన్ని కోణాల్లో ఆలోచించుకొనే కరుణతో జీవితాన్ని పంచుకోవడానికి సిద్ధమయ్యానక్కా" అని దృఢంగా చెప్పింది. "ఝాన్సీ నిన్ను అభినందిస్తున్నాను. పెళ్లి జీవితంలో ఒక భాగం మాత్రమే. పెళ్లే జీవితం కాదు. ఇప్పుడు ఈ పెళ్ళీ నీ మంచికే అనుకో, భవిష్యత్ లో మీ ఇద్దరికీ సరిపడక విడిపోవాల్సి వస్తే అదీ నీ మంచికే అనుకో, ఒక ఆడపిల్లగా ఎప్పుడూ నీకు అండగా ఉంటాను. ఏ విషయమైనా నాతో పంచుకోవచ్చు. అంతేగానీ అవమానాలని, మనస్పర్ధలని, ఎగతాళులని ఆలోచించవద్దు. ఎలాంటి ఉద్రేక నిర్ణయాలకు, అఘాయిత్యాలకు పాల్పడకు" అని చెప్పాను. ఝాన్సీ "అక్కా నాకు ఎవరూ ఇలా చెప్పిన వాళ్ళు లేరు. అందరూ నిరుత్సాహ పరిచిన వారే. ఇప్పుడు నాకు చాలా ఆనందంగా, ధైర్యంగా ఉంది" అని చాలా సంతోషంగా మాట్లాడింది. అనేక విషయాలను పంచుకుంది. ఝాన్సీ వాళ్ళ అమ్మని కూడా పిలిచి మాట్లాడాను.

2. ఆ రోజుల్లో మా ఇద్దరికీ చాలా మొహమాటం ఉండేది. (ఇప్పటికీ ఉంది) . వారిద్దరి సంబంధాల విషయం లో ఝాన్సీ వైపు ఆలోచించి మేము అడగలేక దిలీప్ ఇంటికి కరుణ, నేనూ, మూర్తి వెళ్లాం. దిలీప్, వాళ్ళ అమ్మగారు కరుణతో మాట్లాడేరు. అక్కడ నేను కూర్చొలేదు. ఏం మాట్లాడింది నాకు తెలియదు. మూర్తి, దిలీప్ నీకు ఏ డౌటు వద్దు అన్నారు. ఇక పూర్తి స్థాయి పెళ్లి చర్చల్లో మునిగిపోయాం. ఈ పెళ్లి వల్ల నష్టపోయే వీరయ్యన్న కు ఎలా ఆ నష్టపరిహారం ఇవ్వాలి అనేది కూడా చర్చలు జరిపారు.

2. మే 4 వ తేదీన పెళ్లి అనుకున్నాం. అప్పుడు వేసవి సెలవులు కాబట్టి నెలరోజుల్లో పరిస్థితులు, ఆవేశకావేశాలు సర్దుకుంటాయి అని భావించి ఆ తేదీని ఎన్నుకున్నాం. ఆలోగా వచ్చేయొచ్చు అనుకొని మేమిద్దరం విశాఖపట్నం వెళ్లాం. అయితే కరుణ ఇంట్లో అనుమానం రావడం, దీని వెనుక వీరయ్యన్న ఉన్నాడనుకోవడంతో కరుణ వాళ్ళ ఇంటిలో కోపంగా ఉన్నారని అన్న అటు వైపు వెళ్ళక పోవడం, కరుణ తిరిగే బండి చక్రాల్లో గాలి తీసేస్తే ఇంట్లోనే బందీ అయిపోతాడని భావించి ముందే ఇంట్లోంచి వచ్చేయడంతో అనుకున్న తేదీకన్నా ముందే పెళ్లి హడావుడిగా జరిగిపోయింది. భద్రత ఉంటుందని వాళ్లిద్దర్నీ చీమకుర్తి లో ఉంచారు. ముందుగా అనుకున్నట్టుగానే మేం వచ్చాం.చీమకుర్తిలో ఉన్నారని తెలిసింది. వెంటనే ఝాన్సీ వాళ్ళ దగ్గరకు మేమిద్దరం వెళ్లాం. చీమకుర్తి నా స్వంత ఊరు. సంగీతరావు మాస్టారిగారితో నాకు పదేళ్ల మంచి పరిచయం. నేరుగా ఆ ఇంటికే వెళ్లాం. మేం వెళ్లేసరికి కరుణ, ఝాన్సీ లిద్దరే వున్నారు. శిరోమణి రాసినట్టు ఝాన్సీ వాళ్ళ అక్క రజనీ లేదు. మాంసం కూరా లేదు. అప్పటికే వాళ్ళు భోజనాలు అయిపోయాయి. ఝాన్సీ చేసిన పప్పుచారు, మొక్కజొన్న వడియాలతో భోజనం చేసాం. అలాంటి వడియాల్ని నేను చూడటం అదే మొదటిసారి. అడిగితే కొట్లల్లో అమ్ముతున్నారు అని మూర్తి చెప్పాడు. అప్పటికి ఝాన్సీకి నాన్‌వెజ్ వంట రాదు. మేము ఎప్పుడు వాళ్ళింటికెళ్లినా మూర్తినే వంట చేసేవాడు. మూర్తిని తన పుట్టింటి తరపు అన్నగానే ఝాన్సీ భావించేది. ఝాన్సీ వాళ్ళింట్లో మేం ఎప్పుడూ నాన్ వెజ్ తినలేదు. ఓసారి వాళ్ళింట్లో ఓ మిత్రుడు ఉంటే కలవడానికి వెళుతూ మూర్తి చికెన్ తీసుకొని వెళ్ళితానే వంట చేసాడు.

3. శిరోమణి రాచినట్లు చీమకుర్తిలో 43 రోజులు లేరు. మే 3కి జూన్ 3కి 43 రోజులు కావు. వేసవి సెలవులు పూర్తి కావస్తుండటంతో జూన్ 3, 4 తేదీల్లో ఝాన్సీ, కరుణ మా ఇంటికి వచ్చేసారు. కరుణ పోస్టింగ్ ఊరైన రాచపూడిలో వీరయ్యన్న వాళ్ళ కోసం ఇల్లు అద్దెకు తీసుకున్నారు. మంచం, పరుపు ల్లాంటివి నేనూ,

కరుణ వెళ్లి ఒంగోలు ట్రంకు రోడ్డులోని క్వాలిటీ ఫర్నిచర్ షాపులో కొన్నాం. బట్టలు, దుప్పట్లు, వంటసామాగ్రి అంతా నేనూ, ఝాన్సీ వెళ్లి కొన్నాం. చీమకుర్తి నుంచి ఎలాంటి సామాన్లు తీసుకురాలేదు, వాళ్ళ వెంట. వీరయ్యన్న సామాన్లు తీసుకెళ్లేందుకు ట్రక్‌ని మాట్లాడతానన్నాడు. అనుకున్నట్లుగానే వీరయ్యన్నను, సీతమ్మ టీచరును కరుణ వాళ్ళ నాన్న స్కూల్లో నుండి పంపించాడు. వీరయ్యన్న నష్టపోకుండా, తన వాటా కింద 25 వేలు ఇవ్వాలని నిర్ణయించి, ఆ డబ్బులు ఎట్లా అనేది కూడ చర్చించాము. స్కూలు బస్సు ఆపాలని నేను బయటకు వెళ్లి వచ్చే సరికి నిర్ణయించారు. ఈ నిర్ణయంలో కరుణదే ప్రధాన పాత్ర. ఆస్తి కోసమే ఝాన్సి పెళ్ళి చేసుకుంటుదనటంతో, కరుణ, ఝాన్సి ఆస్తి కోసం చేసుకోటం లేదని తన పేరుతో ఉన్న ఆస్తుల ను వాళ్ళ నాన్నకే రాసి ఇచ్చాడు. ఇది చెప్పి, భవిష్యత్తులో సంబంధాలు ఇలానే ఉండవు. కొద్ది రోజులు పోయి, పిల్లలు పుడితే దగ్గరౌతారు. బస్ నిలేస్తే మీ నాన్న వచ్చి రెండు తంతాడు. నిన్ను తీసుకెళ్ళతాడు. అప్పుడేమి చేస్తావని, అప్పట్లో 25 వేలు కష్టం కనుక ఎలా సమకూర్చాలో వివరంగా చెప్పేను. కరుణ లోన్ పెట్టి కొంత, నేను మా ఫ్రెండ్ నుండి అప్పు తెచ్చి కొంత చాలక పోతే ఝాన్సి వాళ్ళ అమ్మను ఆ ఊరిలో కొంత అప్పు తెమ్మని ఆదుగుదామని చెప్పాను. ఇది అందరికి బాగా నచ్చి, ... అన్నారు. ఊరు వెళ్లిన తర్వాత కరుణ వాళ్ళు ఏమి చేసారో కాని నన్ను డబ్బులు అడగలేదు.

4. జూన్12 నుంచి స్కూల్స్ రీఓపెన్ కనుక 10 తేదీన రాచపూడి వెళ్లి సామాన్లు అవి సర్దుకోవాలి అనుకున్నారు. నాకు గుర్తున్నంత వరకు ఆ తరలింపు ఏర్పాట్లు అన్నీ వీరయ్యన్న చేసాడు. ఎవరైనా సహాయం తీసుకుంటే తీసుకొని ఉండొచ్చు.

5. శిరోమణి రాసినట్లు మా ఇంటినుంచి ఝాన్సీ, శిరోమణి వాళ్ళింటికి ఎప్పుడూ వెళతాను అనలేదు. ఉందు అన్నా, అనుమానాలు లొస్తాయి ఊళ్ళో అని వెళ్లిపోయేది. పెళ్లికి ముందు జరిగిన చర్చల సమయంలో ఝాన్సీ వాళ్ళ ఊరి నుంచి ఉదయాన్నే వచ్చి, తిరిగి సాయంత్రం వాళ్ళ ఊరు వెళ్లిపోయేది. పెళ్లికి ముందు నాకు తెలిసినంత వరకు శిరోమణితో ఝాన్సీకి పరిచయం లేదు.

నేను, మూర్తి చాలాసార్లు కరుణ, ఝాన్సీ వాళ్ళు ఉన్న రాచపూడి, మాలెంపాటివారి పాలెం వెళ్లాం. ఎప్పుడు వెళ్లినా ఉదయం టిఫిన్ చేసి వెళ్ళి, సాయంత్రానికి తిరిగి వచ్చేసేవాళ్ళం. మలంపాటివారిపాలెంలో నేను మాత్రమే రాత్రికి ఉన్నాను. ఓసారి మాత్రం వీరయ్యన్న వాళ్ళింట్లో ఒక రాత్రి ఉన్నాం. తెల్లవారి వాళ్ళ పాప చేసిపెట్టిన అద్భుతమైన టిఫిన్ తిని, వీరయ్యన్న చూపించిన దారిలో పొలాల మధ్య నుంచి గట్ల మీదుగా నడుస్తూ బెండ మొక్కలు(అది జూట్ పంట ఆట!) చూసుకుంటూ మూడు కిలోమీటర్లకి పైగా నడిచి కరుణ వాళ్ళ ఇంటికి చేరాం.

6. నేను మాట్లాడితే ఝాన్సీ దిగులు మొఖం పెట్టిందని శిరోమణి రాశాడు. అది చదివిన వాళ్లకు నేనేదో వాళ్ళ పెళ్లికి అభ్యంతరం పెట్టినట్లు అనిపిస్తుంది. ఆ వ్యాసం చదివిన మా అమ్మాయి అయితే "ఏమిటమ్మా నువ్వేదో వాళ్ళ పెళ్లిని చెడగొట్టే ప్రయత్నం చేస్తే ఈయన పూనుకొని ఆ పెళ్లి చేసినట్లు అనిపిస్తుంది?" అని అడిగింది. శిరోమణి రాసిన కరుణ, ఝాన్సీ ల పెళ్లి ఎపిసోడ్ వరకు చదివిన వారందరికీ అదే అభిప్రాయం వస్తుంది. నేను అప్పటికే సి.ఎం.ఎస్. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాల్ని. ఎన్నో మహిళా పోరాటాల్లో పాల్గొన్న అనుభవం ఉంది. ఇలాంటి పెళ్లిళ్ళు చేసిన అనుభవం ఉంది. ఎవరితో ఎలా డీల్ చేయాలో ఉద్యమం విసరంతైనా నేర్పింది. నేను మాట్లాడాక ఝాన్సీ మొఖం సంతోషంతో వెలిగిపోయింది. ఝాన్సి వాళ్ళ అమ్మ, అక్క కూడా నేను మాట్లాడాక చాలా రిలీఫ్ ఫీలయ్యారు. ఈ పెళ్లి చర్చ అంతా నాదేనని భావించిన కరుణ వాళ్ళ అమ్మ నన్ను గడ్డ పారతో పొడుస్తాననన్నదని కరుణ చెప్పి నప్పుడు, నన్ను గుర్తు పట్టదని నవ్వుకున్నాము.

మరో విషయం ఏమిటంటే ఈ శిరోమణి స్వంత పిన్ని పెళ్లి చేసింది కూడా మేమే. నేనూ మూర్తి ప్రసాద్ అన్న వాళ్ళ ఊరు వెళ్లి ఒక రోజంతా ఉండి, వాళ్ల పెద్దల్ని ఒప్పించి , ఆ పెళ్లిని మా ఇంట్లోనే చేసాం. ఆ చిన్న ఇంట్లో ఆ ఊరినుంచీ వచ్చిన వాళ్లందరికీ అప్పటికప్పుడు మూర్తి, రాపర్ల అంటి వంట చేసి పెట్టారు. ఆ పెళ్లికి శిరోమణి వచ్చిన జ్ఞాపకం లేదు.

మా గురించి ఎక్కువగా రాయలేదనో, మా పాత్రల్ని తక్కువ చేశాడనో నేను ఈ సమాధానాన్ని రాయడం లేదు. నాకు గానీ, మూర్తికి గానీ తొలినుంచీ కూడా గుర్తింపు సమస్య లేదు. మా బాధ అల్లా ఎన్ని భేదాభిప్రాయాలు వున్నా బతికిఉన్న వాళ్ళ విషయంలో వాస్తవాలని తెలుసుకొని రాయాలి. ఇంతకుముందు శిరోమణి సిరీస్ గా రాసిన జిల్లా అమరవీరుల చరిత్రల్లో కూడా కొన్ని వాస్తవ విరుద్ధమైన అంశాలు చాలావున్నాయి.

శిరోమణి గారు ఇకముందు రాసే రచనల్లోనైనా పూర్తి సత్యాల్ని తెలుసుకొని, కొంచెం పరిశోధించి రాస్తే బాగుంటుందని సూచించడానికే ఇది. ఈ అభిప్రాయానికి మేం ఎలాంటి సమాధానాన్నీ ఆశించడం లేదు. ఇక రాయబోయేదేదైనా సత్య అసత్యాలను పరిశీలించి రాస్తాడానే ఓ సూచనగా, నా ప్రయత్నం లేదా సలహా.

- కాంతి నల్లూరి

ప్రేమాస్పదురాలైన సహచరిని కోల్పోయారు. మరెంతో మంది తమ శ్రేయోభిలాషిని కోల్పోయారు. ఇంకెంతో మంది ఒక మంచి స్నేహితురాలిని కోల్పోయారు.

ఇప్పటికే శ్వేత మరణాన్ని పంటి బిగువున భరిస్తున్న అ కుటుంబాన్ని రింకీ మరణం మరింతగా కుదిపేసి వుంటుంది. ఇప్పటికే శ్వేత మరణాన్ని పంటి బిగువున భరిస్తున్న అ కుటుంబాన్ని రింకీ మరణం మరింతగా కుదిపేసి వుంటుంది. తనను ఎంతగానో ప్రేమించే, తన కోసం పరితపించే అమ్మ తన చెంత లేకపోయినా, ఎక్కడో ఒక చోట క్షేమంగా వుందనే భరోసాతో వున్న చిన్నారి హృదయం ఎంతగా తల్లడిల్లుతున్నదో.

కామేడ్స్ శ్వేత, శ్రీనుల రక్తంతో తడిసిన జెండాను సగర్వంగా ఎత్తిపట్టి, తన నాయకుడు కామ్రేడ్ విశ్వం తనపై వుంచిన విశ్వాసాన్ని దృఢంగా నిలబెట్టి నేడు రింకీ అమరత్వంలో వాళ్ల సరసన చేరింది. రింకీ భౌతికంగా లేదు. కానీ అమె నడిచిన మార్గం మరిన్ని త్యాగాల మేళవింపులతో ఇంకింతగా ఎరుపెక్కింది. రండి ఆ మార్గాన్ని మరింతగా సుదృఢం చేస్తూ మునుముందుకు సాగుదాం.

తూరుపు ముఖాన

దీర్ఘ కవిత

విరసం ప్రచురణలు

అనేక బుక్‌స్టాల్,
ఏలూర్ రోడ్డు, విజయవాడ
ఫోన్ : 8977493465,
సహా రెండు తెలుగు రాష్ట్రాల్లోని
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లో
లభించును



వెల : రూ. 30/-



సబ్జెక్ట్ కరెక్షన్

సంక్లిష్టమైన ప్రయాణంలో సవాళ్లను అధిగమించే సాహసం చేయడం సృజనకారుడికి తెలిసుండాలి. సంక్షుభిత కాలంలో సమాజాన్ని ఓదార్చే సాహిత్యం కాదు... సమాధానం వైపు నడిపించే సాహిత్యం కావాలి. విప్లవ కవిత్వంలోని విస్తృతికి, వైవిధ్యానికి సబ్జెక్ట్ కరెక్షన్ ఒక ఉదాహరణ.

వెల : రూ. 100/-

ARUNATARA A Literary and Cultural Telugu Monthly Journal RNI Regn. No. 21152/72
October, 2021, Vol. : 49, Issue : 7, Vijayawada

KLVA101M197

అరుణతార నిర్వహణకు విరాళాలివ్వండి
శాశ్వత నిధి ఏర్పాటుకు సహకరించండి

విప్లవ రచయితల సంఘం అధికార పత్రిక అరుణతార 1977 నవంబర్ నుంచి మాస పత్రికగా వస్తోంది. సాహిత్య సాంస్కృతిక సంస్థగా విరసం విప్లవ, విప్లవ సాహితోద్యమాల్లో నిర్వచించుకున్న తన రాజకీయ, సాహిత్య, మేధో పాత్రకు వాహికగా తెలుగు సమాజంపై ప్రభావం వేస్తున్నది. గత మూడు తరాలుగా ఎందరో రచయితల, బుద్ధిజీవుల ఆలోచనా వికాసానికి వేదికగా ఉన్నది. సాహిత్య పత్రిక అయినప్పటికీ సామాజిక, రాజకీయార్థిక, సిద్ధాంత విశ్లేషణలకు, చర్చలకు, అన్వేషణకు సృజనశీలమైన మాధ్యమంగా కొనసాగుతున్నది. నక్సల్బరీ శిశువుగా విరసం తాను ఎంచుకున్న విప్లవోద్యమ ప్రచార కర్తవ్యంలో అరుణతార పాత్ర గణనీయం. 1970లలో ఉత్తర తెలంగాణలో విప్లవోద్యమ పునర్నిర్మాణ దశ నుంచి ఇవాళ దేశవ్యాప్తంగా సాగుతున్న విప్లవ, ప్రజా పోరాట సంచనాలను అరుణతార తన శక్తినంతా వెచ్చించి అక్షరబద్ధం చేస్తున్నది. మరీ ముఖ్యంగా చత్తీస్‌ఘడ్‌లో సల్వాజుడుం దుర్మార్గాలు మొదలైనప్పటి నుంచి ఇవ్వాల్టి ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడో దశ, సాల్వాజుడుం రెండో దశ దాకా దండకారణ్య ప్రజా యుద్ధాన్ని, ప్రజారాజ్యాధికారాన్ని, ప్రత్యామ్నాయ రాజకీయ విధానాన్నీ, అక్కడ సాహిత్య, సాంస్కృతిక వికాసాన్నీ తెలుగు పాఠకులకు పరిచయం చేస్తున్నది, విశ్లేషిస్తున్నది. దండకారణ్య విప్లవోద్యమానికి సంఘీభావ హస్తాన్ని అందిస్తున్నది. ఈ పనిలో ఇతర ప్రజాస్వామిక పత్రికల పాత్ర కూడా ఉన్నప్పటికీ అరుణతార దాన్నే ఒక ప్రధాన కర్తవ్యంగా స్వీకరించింది. ఇటీవల పెరిగిపోయిన హిందూ ఫాసిస్టు ప్రమాదానికి వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామిక కంఠస్వరాన్ని బలంగా వినిపిస్తున్నది. వేర్వేరు సామాజిక ఉద్యమాల ఆకాంక్షలను ఎత్తిపడుతూ వాటి న్యాయబద్ధతను విశ్లేషిస్తున్నది.

ప్రజాఉద్యమాల్లోని కార్యకర్తల సృజనాత్మక వ్యక్తీకరణలకు అరుణతార అవకాశం ఇవ్వడం వల్ల వాళ్లలోంచి ఎందరో ప్రతిభావంతులైన ఆలోచనాపరులు, రచయితలు తయారువుతున్నారు. అరుణతార ఈ పని ఆది నుంచి చేస్తున్నది. అందువల్ల ఒక పక్క లబ్ధప్రతిష్ఠుల రచనలతోపాటు ఎప్పటికప్పుడు కొత్త గొంతులు అరుణతారలో వినిపిస్తుంటాయి.

అయితే మొదటి నుంచీ అరుణతార అనేక ఆర్థిక, నిర్వహణ సమస్యలను ఎదుర్కొంటున్నది. ఒక్కోసారి ఈ ఇబ్బందులు కాస్త తక్కువగా ఉన్నా, ఇటీవల తీవ్రమైన సంక్షోభాల మధ్య ఎప్పటికప్పుడు అభిమానుల, మిత్రుల అండదండలతో నడుస్తున్నది. గతంలో ఒకసారి అరుణతారకు విరాళాలు వద్దు.. చందాలు కట్టండనే ఆదర్శాన్ని కూడా అమలు చేసింది. అయితే నానాటికి పెరుగుతున్న ప్రెస్ ఛార్జీలు, నిర్వహణ ఖర్చులు మోయలేని భారమయ్యాయి. దీంతో రెండు నెల్లకో సంచిక వచ్చిన సందర్భాలూ ఉన్నాయి. అయితే పేజీలు పెంచి పాఠకులకు మరిన్ని రచనలు అందిస్తూ వచ్చాం.

ఈ అన్ని అనుభవాల దృష్ట్యా అరుణతారకు శాశ్వత నిధి తయారు చేయకుండా ఇక పత్రికను నాలుగు కాలాల పాటు నడపడం అయ్యేపని కాదని తేలింది. ఇంత కాలం అభిమానుల సహకారంతోనే నడుస్తూ వచ్చిన అరుణతార ఈసారి శాశ్వత నిధి కోసం మీ ముందుకు వచ్చింది. ఇవాళ ఉన్న విప్లవోద్యమ ప్రత్యేక పరిస్థితుల్లో అరుణతార అవసరం ఎంత ఉన్నదో పాఠకులకు తెలుసు. తెలుగు నేల మీద, దేశంలోని ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో ఉన్న అసంఖ్యాక విప్లవాభిమానులు తలా ఒక చేయి వేస్తే శాశ్వత నిధి సమకూరడం కష్టమేమీ కాదని మా నమ్మకం. దాంతోనే మీ ముందుకు వచ్చాం. విప్లవోద్యమ రాజకీయ, సాంస్కృతిక వేదిక అరుణతారకు మీవంతు విరాళాలు ఇవ్వాలని, ఇప్పించాలని కోరుకుంటూ...

అరసవిల్లి కృష్ణ,- విరసం అధ్యక్షుడు, ఎంఎ బాసిత్-ఉపాధ్యక్షుడు, కాశీం-కార్యదర్శి, రివేరా-సహాయకార్యదర్శి,
వరవరరావు, టి. కృష్ణాబాయి, సివిఎస్‌ఆర్ ప్రసాద్, జి. కళ్యాణరావు, వి. చెంచయ్య, అల్లం రాజయ్య,
ఎం. రత్నమాల, పాణి, పి. వరలక్ష్మి, రాంకీ

చందాలు, విరాళాలు పంపాల్సిన చిరునామా :

అరసవిల్లి కృష్ణ, 6-1/16-7A/1, పెద్దిరాజు స్ట్రీట్, ప్రైజర్‌పేట, విజయవాడ-520001

చెక్‌లు/డ్రాఫ్టులు/ఆన్‌లైన్‌లో పంపడానికి :

A. Krishna, Bank : State Bank of India, A/c. No. 52018355595, IFSC : SBIN0020714,
Branch : Vagu Center, Vijaywada.

If undelivered please return to:

ARUNATAARA
6-1/16-7A/1, Peddiraju Street
Prizer peta, Vijayawada - 520 001
Andhrapradesh

TO
Mr/Mrs.

EDITED, PRINTED, PUBLISHED BY ARASAVILLI KRSIHNA AND OWNED BY DUVVURI VENKATA KRISHNA RAO. PRINTED AT VISALAANDHRA VIGNANA SAMITHI, CHANDRAM BUILDINGS, CHANDRA RAJESWARA RAO ROAD, MACHAVARAM (PO), VIJAYAWADA - 520 004, ANDHRAPRADESH STATE (New Declaration Filed), PUBLISHED AT 6-1/16-7A/1, PEDDIRAJU STREET, PRIZER PETA, VIJAYAWADA - 520 001, ANDHRAPRADESH STATE, EDITOR : ARASAVILLI KRISHNA

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M197
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	53
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	nazma
పేజీలు విడదీసినది	Bhanu
స్కాన్ చేసినది	Sharmila
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good